శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★

భారతదేశంలో ఫాసిజాన్ని గుర్తించడం మరెప్పుడు?
గేమింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై రాష్ట్రాలు చట్టాలు చేయొచ్చు
బెట్టింగ్ యాప్ కేసు... ఛత్తీస్‌గఢ్ మాజీ సిఎం ఇంట్లో సిబిఐ సోదాలు
లోపలి పేజీల్లో

సంపుటి 27, సంచిక: 276 | గురువారం | 27-03-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

# ఆన్‌లైన్ బెట్టింగ్‌ల నిరోధానికి సిట్

- గేమింగ్, రమ్మీ, బెట్టింగ్ యాప్స్ పట్ల అప్రమత్తం
- సైబర్ నేరాలు, గుట్కా వంటి నిషేధిత పదార్థాలపై కఠిన వైఖరి
- శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన
- భూసేకరణ, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడంపై బిఆర్‌ఎస్‌పై ఆగ్రహం



ప్రజాపక్షం/హైదరాబాద్

గేమింగ్,రమ్మీ,ఆన్‌లైన్ బెట్టింగ్స్,బెట్టింగ్ యాప్స్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం అప్ర మత్తంగా, కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించామని, వీలైతే సిబిసిఐడి లేదా అధికారులతో సమీక్షించి, ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో రెండు సంవత్సరాల శిక్షనే ఉన్నదని, నిర్వాహకులను,ఆడేవారిని, అడ్డగోలుగా నిర్వహిస్తున్న వారికి శిక్షలను పెంచుకునేందుకు వీలుగా సవరణ చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ప్రత్యేక్షంగా, పరోక్షంగా, ప్రోత్సహించినవారైనా, వారికి సహకరించినవారైనా, నిర్వహణలో భాగస్వాములైనా వారిని రాష్ట్ర ప్రభుత్వం ఎవరినీ వదిలిపెట్టబోదని హెచ్చరించారు. ప్రభుత్వం విఫలం చెందిందని చిత్రీకరించే ఆలోచనతో ప్రధానప్రతిపక్షం(బిఆర్‌ఎస్) రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపైన యాసిడ్ దాడులు చేసే పరిస్థితికి వచ్చిందని, తెలంగాణను కుప్పకూల్చాలన్న కుట్రపూరిత ఆలోచనతో అన్ని వేదికలపైన వారు తప్పుడు ప్రచారంతో తెలంగాణ ప్రతిష్టను మసకబార్చేందుకు ప్రయత్నిస్తున్నారని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో బుధవారం పద్దులపైన చర్చ జరుగుతున్న సమయంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఆన్‌లైన్ బెట్టింగ్, లాంటి కేసులో పూర్తి స్థాయి విచారణ చేపట్టాలంటే, పక్క రాష్ట్రాలు, పక్క దేశాలలో కూడా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంటుందని, అందుకే అధికారులకు అన్ని అధికారాలను కట్టబెట్టాని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సైబర్ నేరాల పట్ల గుట్కా వంటి నిషేధిత పదార్థాల సరఫరాపై కఠినంగా వ్యవహరిస్తామని, అప్రమత్తంగా ఉంటామన్నారు. భూసేకరణకు, అభివృద్ధికి అడ్డుకోవద్దని, అవసరమైతే బాధితులను ఎలా కాపాడాలని, వారికి ఎంత నష్టపరిహారం ఇవ్వాలో ప్రతిపక్ష పార్టీగా సూచన చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందడం, పెట్టుబడులు రావడం, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు రావడం ప్రతిపక్ష పార్టీకి ఇష్టం లేదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హాయంలో వెటర్నరీ డాక్టర్‌ను సాయంకాలం హత్య చేసిన పరిణామాలు చూశామని, వామన్ రావు న్యాయవాద దంపతులను నడిరోడ్డుపైన నరికి చంపితే, ఇప్పటికీ చంపినవారిపైన చర్యలు లేవన్నారు. మహేశ్వరం, సంతోష్‌నగర్ చంపాపేట పక్కన గంజాయి మత్తులో ఆరు సంవత్సరాల బాలికపై అత్యాచారం చేసి, హత్య చేస్తే ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. 2020 సంవత్సరంలో మహిళలపై జరిగిన అత్యాచారాలపై తరువాయి 2లో

తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ చిత్రపటంలో పెట్టాలని ప్రయత్నిస్తున్నాం. పెట్టుబడులను ఆకర్షించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచాలనే ఉద్దేశంతో శాంతిభద్రతలను కాపాడేందుకు నిర్విరామంగా కృషి చేస్తున్నాం. మేము అధికారంలోనికి వచ్చిన తర్వాత మొహర్రం, వినాయక చవితి, బక్రీద్ ఇలా అన్ని మతాలకు చెందిన పండగలలో చిన్న చెదురు మదురు ఘటనలు జరిగాయా?, శాంతిభద్రతల విషయంలో మేము రాజీపడ్డామా? ధరల నియంత్రణలో 1.3 శాతంతో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంలో నిరుద్యోగ సమస్యను తగ్గించాం. సొంత పన్నుల వసూళ్లలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా నిలిస్తే, మహారాష్ట్ర నంబర్ 2 స్థానంలో ఉన్నది. ప్రధాని సొంతరాష్ట్రం గుజరాత్ 6,7వ స్థానంలో ఉన్నది. సికింద్రాబాద్ ఎంఎల్‌ఎ, పద్మారావు వస్తే అక్కడికక్కడే పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించాం. నా వద్దకు ఎవరొచ్చినా స్పందిస్తా. మేము ఎవరి పట్ల వివక్షచూపబోం. వివక్ష మా విధానం కాదు. వివక్షతో రాష్ట్రాన్ని నడిపించలేం.

– సిఎం రేవంత్‌రెడ్డి

### ఉప ఎన్నికలు రావు

ఉప ఎన్నికలు రావు. సభ్యులు(ఎంఎల్‌ఎలు) ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పని లేదు. 2014 నుంచి అదే చట్టం ఉన్నది. గతంలో పార్టీ మారిన ఎంఎల్‌ఎలను మంత్రులను చేశారు. వారిపైన అనర్హత వేటు పడలేదు. ఎన్నడూ ఉప ఎన్నికలు రాలేదు.. ఇప్పుడు ఎలా వస్తాయి? అప్పుడున్న చట్టాలు, రాజ్యాంగమే ఇప్పుడూ ఉన్నాయి. స్పీకర్, పాలక, ప్రతిపక్షం అలాగే ఉన్నది. 2014 నుంచి 2019 వరకు, 2019 నుంచి 2023 వరకు ఈ సభ ఏ సంప్రదాయాలను పాటించిందో, అదే సాంప్రదాయాలను పాటిస్తున్నాం.



# ఆరంతస్తుల భవనం కుప్పకూలింది

### శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురు కూలీలు



- కొనసాగుతున్న సహాయకచర్యలు
- పరారీలో భవన నిర్మాణ దారుడు
- ఫిర్యాదులు అందినా పట్టించుకోని అధికారులు

ప్రజాపక్షం/భద్రాచలం

భద్రాచలం పట్టణంలో బుధవారం విషాదం చోటుచేసుకుంది. రామాలయానికి అతి సమీపంలో గల బోనాల వారి వీధిలో అనుమతులు లేకుండా నిర్మితమవుతున్న ఆరు అంతస్తుల భవన ఒక్క సారిగా కుప్పకూలింది. శిథిలాల కింద కూలీ పనులు చేస్తున్న ముగ్గురు చిక్కుకుపోయినట్లు అనుమానిస్తున్నారు. బోనాలవారి వీధిలో గత నాలుగేళ్లుగా ఓ బహుళ అంతస్తు నిర్మాణం అవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా ఆరు అంతస్తులు వేయగా అ భవనం పేకమేడల్లా కూలిపోయింది. శ్రీపతి శ్రీనివాసరావు అనే వ్యక్తి, శ్రీపతి నేషనల్ ట్రస్ట్ పేరుతో విజయ కనకదుర్గ భవాని ఆలయం, అనుబంధ ఆలయాన్ని దాతల విరాళాలతో నిర్మిస్తున్నారు. అక్కడ ఉన్న పాతభవనాన్ని కూల్చేసి ఆదే ప్రదేశంలో పాత పునాదులు, పాత ఫిల్లర్లసైజుల ఆధారంగానే ఆరు అంతస్తులు వేశారు. నిర్మాణసమయంలో పాతపునాదులను ఎలాంటి పటిష్టం చేయకుండానే అంత పెద్ద భవన నిర్మాణానికి పూనుకున్నారు. కాగా నిర్మాణం చేపడుతున్న వ్యక్తి శ్రీనివాసరావు ఆయన కుటుంబ సభ్యులు ప్రస్తుతం పారారీలో ఉన్నారు. ఈ భవన నిర్మాణంపై తొలినాళ్ల నుండి అనేక అభ్యంతరాలు ఉండటంతో పంచాయితీ అధికారులు భవన నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని నోటీసులు జారీ చేసినప్పటికీ వారి కళ్లు కప్పి లోపల పనులు చేస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా బుధవారం కూలీ పనులు నిర్వహిస్తున్న తరువాయి 2లో

# సభలో నన్ను మాట్లాడనీయడం లేదు

### లోక్‌సభ స్పీకర్ ఓమ్‌బిర్లాపై రాహుల్‌గాంధీ తీవ్ర అసనం

### సభ ప్రజాస్వామ్య పద్ధతిలో నడవడం లేదని విమర్శ



**న్యూఢిల్లీ :** లోక్‌సభ స్పీకర్ ఓమ్‌బిర్లాపై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విరుద్ధమైన పద్ధతిలో నడుస్తున్న సభలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని మండిపడ్డారు. స్పీకర్ ఓం బిర్లా తనపై నిరాధారమైన వ్యాఖ్యలు చేశారన్నారు. సభ గౌరవాన్ని కాపాడటానికి సభ్యులు పాటించాల్సిన విధాన నియమాలను పాటించాలని రాహుల్ గాంధీకి ఓమ్ బిర్లా సూచించారు. ఈ నేపథ్యంలో రాహుల్ స్పందించారు. స్పీకర్ తన పట్ల తీవ్ర వ్యాఖ్యలు చేశారని, తనకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా సభను వాయిదా వేశారని రాహుల్‌గాంధీ అసంతృప్తి వ్యక్తం చేశారు. 'స్పీకర్ లేచి వెళ్ళిపోయారు. ఆయన నన్ను ఒక్క మాట కూడా మాట్లాడనివ్వలేదు. ఆయన నా గురించి మాట్లాడుతున్నాడు, నా గురించి ఏమి చెప్పారో నాకు తెలియదు, అవన్నీ నిరాధారమైనవి. మీరు నా గురించి మాట్లాడినట్లుగానే నన్ను కూడా మాట్లాడనివ్వాలి. కానీ ఆయన తరువాయి 2లో

# కమీషన్‌పై అట్టుడికిన అసెంబ్లీ



- కెటిఆర్ వ్యాఖ్యలపై అధికారపక్షం ఆగ్రహం
- ప్రతిపక్ష బిఆర్‌ఎస్, అధికారపక్షం మధ్య వాగ్వాదం
- ఒళ్లు దగ్గరపెట్టుకొని మాట్లాడాలని మంత్రి భట్టి ధ్వజం
- బరితెగించిన రాజకీయాలు చేయడంలేదని గులాబీ పార్టీపై మండిపాటు



ప్రజాపక్షం/హైదరాబాద్

"రాష్ట్రంపై పడి అడ్డగోలుగా దోచుకున్నారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి. మీలాగా (బిఆర్‌ఎస్) బరితెగించి రాజకీయాలు చేయడంలేదు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది మీరే అని బిఆర్‌ఎస్ సభ్యులు కెటిఆర్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కమీషన్ తీసుకుంటున్నారని కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను నిరూపించాలని, లేదంటే సభలోనే క్షమాపణ చెప్పాలని భట్టి విక్రమార్క సవాల్ చేశారు. శాసనసభలో బుధవారం గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాలు, నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి, పౌర సరఫరాలు, సాధారణ పరిపాలన, సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, ఆర్థిక, ప్రణాళిక శాఖల పద్దులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రతిపక్ష బిఆర్‌ఎస్, అధికార పక్షాలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బిఆర్‌ఎస్ సభ్యులు స్పీకర్ పోడియం వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. ప్రతిగా కాంగ్రెస్ సభ్యులు సైతం నినాదాలు చేశారు. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని బిఆర్‌ఎస్ సభ్యుల డిమాండ్‌ను తోసిపుచ్చడంతో వారు సభ నుంచి వాకౌట్ చేశారు. చర్చను కాంగ్రెస్ సభ్యులు డాక్టర్ సంజీవ్‌రెడ్డి ప్రారంభించగా, బిఆర్‌ఎస్ తరువాయి 2లో

# బంగాళాఖాతంలోకి ధరణి పోర్టల్



- ఒక్క కలంపోటుతో భూమిపై హక్కులు లేకుండా చేసిన దుర్మార్గమైన చట్టం
- భూములపై రైతులకు హక్కులు కల్పించిందే కాంగ్రెస్
- లక్షల ఎకరాల భూములు వివాదంలో ఉండడానికి బిఆర్‌ఎస్సే కారణం
- మంత్రులు భట్టి, పొంగులేటి విమర్శ



ప్రజాపక్షం/హైదరాబాద్

'భూ భారతి'పై శాసనసభలో వాడీవేడి చర్చ జరిగింది. బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క కాలం పోటుతో భూమిపై హక్కులు లేకుండా చేసిన దుర్మార్గమైన చట్టం ధరణి అని భట్టి విక్రమార్క విమర్శించారు. ఆ చట్టాన్ని బంగాళాఖాతంలో వేసామని చెప్పామని, అలానే చేశామని తెలిపారు. అంతకు పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ భూ భారతిపై కాంగ్రెస్ ఎన్నికలకు వెళ్లితే, తాము కూడా ధరణిపైనే వెళ్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది.. భూ భారతి కాదని, భూ హారతి అని ఆరోపించారు. జమాబందీ ఎందుకో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. జమాబంది పేరుతో మరో దుకాణం తెరిచిందని ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలపై భట్టి విక్రమార్క స్పందిస్తూ పల్లా రాజేశ్వర్ రెడ్డి సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. 'దున్నేవాడిదే భూమి అనేది తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నినాదం అన్నారు. ఆ పోరాట స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం భూములపై హక్కులు కల్పిస్తూ వస్తోందన్నారు. ఒక్కకాలం పోటుతో భూమిపై హక్కులు లేకుండా చేసిన దుర్మార్గమైన చట్టం ధరణి, ఆ చట్టాన్ని బంగాళాఖాతంలో తరువాయి 2లో

## తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన నేత

- తెలంగాణ ఉద్యమంలో, సాయుధ పోరాటంలో అమరులైన పేరుమీద స్మారక మందిరాలు నిర్మించాలి
- బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతి సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం / హైదరాబాద్

సూర్యాపేట జిల్లాకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, మాజీ పార్లమెంట్ సభ్యులు బొమ్మగాని ధర్మ బిక్షం పేరు పెట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. సూర్యాపేటకు బొమ్మగాని ధర్మభిక్షం పెట్టాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరానని, రాష్ట్రంలో ఏదైనా ప్రాజెక్టును ఆయన పేరుతో కట్టాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో, సాయుధపోరాటంలో మరణించిన వారి తరువాయి 12లో

### ధర్మభిక్షం జిల్లాగా సూర్యాపేటకు నామకరణం చేయాలి

సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి 12

## ఒడిశా గంజాయి లేడీ డాన్ అరెస్టు..

### దేశ వ్యాప్తంగా స్మగ్లర్లతో సంగీత సాహుకు నెట్‌వర్క్

### నాలుగేళ్ల నుంచి కళ్లుగప్పి తిరుగుతున్న వైనం



ప్రజాపక్షం/హైదరాబాద్

గంజాయి సరఫరా చేస్తున్న మూలాలపై తెలంగాణ ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. ఈ క్రమంలోనే నాలుగేళ్ల నుంచి వివిధ రాష్ట్రాలకు హోల్‌ఎల్‌గా గంజాయిని సరఫరా చేస్తు ఒడిశా గంజాయి లేడీ డాన్‌గా ముద్ర వేసుకున్న సంగీత సాహు (29)ను తరువాయి 2లో



03

### 'కాళేశ్వరం'పై విజిలెన్స్ రిపోర్టు అందింది

- ప్రాజెక్టు డిపిఆర్, నిర్మాణానికి చాలా వ్యత్యాసం
- ఎన్‌డిఎస్‌ఎ నివేదిక కోసం ఎదురుచూస్తున్నాం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



03

### స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర

- జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ అల్దాస్ జానయ్య
- రెండోరోజు కొనసాగిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం 3వ మహాసభలు

## ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేద్దాం

### ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ

### భారత్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్న అమెరికా అధ్యక్షుడు



**న్యూయార్క్ :** అమెరికా ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి ఆ దేశ అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వులలో భారతదేశాన్ని ఒక ఆదర్శ ఉదాహరణగా చూపించారు. భారతదేశంలో ఓటరు గుర్తింపు కార్డును బయోమెట్రిక్ డేటాబేస్ (ఆధార్‌కార్డు)తో అనుసంధానం చేస్తున్నారు, కానీ మనం మాత్రం ఇంకా పౌరసత్వానికి సంబంధించి స్వయంగా సంతకం చేస్తేగానీ ధృవీకరించని తరువాయి 12లో

## నల్ల సముద్రంలో సైనిక చర్యలకు స్వస్తి

### రష్యా-ఉక్రేన్ అంగీకరించాయని అమెరికా వెల్లడి



**వాషింగ్టన్ :** నల్లసముద్రంలో వాణిజ్య నౌకలను సైనిక కార్యకలాపాలకు ఉపయోగించకూడదని రష్యా–ఉక్రేన్‌లు అంగీకరించాయని అమెరికా ప్రకటించింది. నల్లసముద్రంలో ఇక స్వేచ్ఛగా రవాణా కార్యకలాపాలు కొనసాగేందుకు రెండు దేశాలు సహకరించేందుకు ఒప్పుకున్నాయని వైట్‌హౌస్ తన ప్రకటనలో పేర్కొంది. సౌదీఅరేబియా నగరం రియాద్‌లో ఈనెల 24 నుండి మూడు రోజులుపాటు రష్యా, ఉక్రేన్ ప్రతినిధులతో తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## పెరూలో అస్థిరత్వం తొలగిపోతుందా?

### వచ్చే ఏడాది పార్లమెంటు ఎన్నికలు



**లిమా :** దక్షిణ అమెరికా పశ్చిమప్రాంతదేశం రిపబ్లిక్ ఆఫ్ పెరూలో వచ్చే ఏడాది పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయి. పెరూ దేశాధ్యక్షురాలు దినా ఎర్సిలియా బోలుఆర్టే జెగర్రా బుధవారంనాడు ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. గడచిన ఆరు సంవత్సరాలలో దేశంలో ఆరు ప్రభుత్వాలు మారాయి. తీవ్ర అస్థిరత నెలకున్నది. దేశాధ్యక్షపదవిలో ఉన్నవారు నైతిక విలువలు తప్పితే మెజారిటీ తీర్మానం ద్వారా వారిని పదవి నుండి తొలగించే అధికారం కాంగ్రెస్‌గా పిలిచే పెరూ పార్లమెంటుకు ఉంది. దేశంలో ఇటీవలి సంవత్సరాలలో అస్థిరత, సామాజిక విభేదాలు పెరుగుతున్నాయని, ఎన్నికల ద్వారా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆమె అన్నారు. నిర్ణీత ప్రకారం 2026లో ఏప్రిల్ 12న ఎన్నికలకు అధ్యక్షురాలు ముహూర్తం నిర్ణయించారు. దేశాధ్యక్షుడితో పాటు పార్లమెంటుకు సెనేటర్లను, డిప్యూటీలను ఎన్నుకుంటారు. పెరూ పార్లమెంటును ఏండియన్ పార్లమెంటు అంటారు. 1990 నుండి పెరూలో పార్లమెంటు ఉభయసభలు పనిచేయడంలేదు. దిగువసభలో 130 స్థానాలు (డిప్యూటీలు), ఎగువసభలో 60 స్థానాలు (సెనేటర్లు) ఉన్నాయి. ప్రజాస్వామ్య నిబంధనలకు అనుగుణంగా అని జాగ్రత్తలూ తీసుకుని ఎన్నికల ప్రక్రియ చేపడతామని ఆమె ప్రజలకు భరోసా ఇచ్చారు.

ఇటు పాలస్తీనాలో, అటు ఇజ్రాయెల్‌లో ప్రజలు శాంతిని కోరుకుంటున్నారు. శాంతిని కోరుతూ నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. పాలస్తీనాలో ప్రజలు ఉగ్రవాద సంస్థ హమాస్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు చేస్తుండగా, ఇజ్రాయెల్‌లో ప్రదానమంత్రి నేతన్యాహూకు వ్యతిరేకంగా చాలా రోజులక్రితం మొదలైన నిరసన ప్రదర్శనలు బుధవారంనాడు కూడా కొనసాగాయి. ఏతావాతా తేలిందేమిటంటే అటు పాలస్తీనాప్రజలు ఇటు ఇజ్రాయెల్‌ప్రజలు శాంతినే కోరుకుంటున్నారు.హమాస్‌గానీ, నేతన్యాహూ గానీ తమ పట్టుదల వదలకుండా యుద్ధా న్ని కోరుకుంటున్నారు. వారిని లొంగదీయడంకోసం ఈ రెండు ప్రాంతాల ప్రజలు రంగంలోకి దిగి నిరసన ప్రదర్శలు చేయడం ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిప్పుడు పాలకుల సమస్యగా కాకుండా ప్రజల సమస్యగా, ప్రజలు తమకు తాముగా తేల్చుకునే అంశంగా రూపుదిద్దుకోవాల్సి ఉంది. సోషల్ మీడియాలో ఈ వీడియోలు వైరల్ అవుతున్నాయి.

## హమాస్‌కు వ్యతిరేకంగా పాలస్తీనాలో అరుదైన ప్రజా పదర్శన



**గాజా :** మొండిగా యుద్ధాన్ని ప్రేరేపిస్తున్న పాలస్తీనా ఉగ్రవాద సంస్థకు వ్యతిరేకంగా గాజాలో పా లస్తీనా ప్రజలు వందలాదిమంది భారీ ప్రదర్శన చేశారు. పాలస్తీనా చరిత్రలో ఇది అరుదైన సంఘటన. పాలస్తీనాలో ఈ విధమైన ప్రజా ప్రదర్శనలు చాలా అరుదు. ఇది హమాస్‌పై ఉన్న వ్యతిరేకతను స్పష్టం చేస్తున్నది. ప్రజలు గాజాస్ట్రిప్ ఉత్తరప్రాంత బెయిట్ లహియాలోని ఇండోనేసియన్ ఆసుపత్రి ఎదుట ఈ ప్రదర్శన చేసినట్లు 'ద గార్డియన్' ప త్రిక తెలియజేసింది.''హమాస్ పోవాలి, హమాస్ ఉగ్రవాదులు...మేం చావడానికి సిద్ధంగా లేం...'' అంటూ ప్రజలు నినాదాలు చేశారు. గాజాలో ఇ జ్రాయెల్ యుద్ధం తిరిగి ప్రారంభించిన తొమ్మిది రోజులకు ఈ ప్రజా ప్రదర్శన జరిగింది. ''స్టాప్ ద వార్, ఉయ్ వాంట్ పీస్'' వంటి నినాదా లు రాసి ఉన్న బ్యానర్లను ప్రదర్శకులు మోసుకువెళ్ళారు. వందలమంది పాలస్తీనా ప్రజలు ఉత్తర గాజాలో పెద్ద పెట్టున హమాస్ వ్యతిరేక నినాదాలు చేస్తూ ప్రదర్శన జరిపారు. తక్షణం యుద్ధాన్ని విరమించాలని కోరారు. తాము శాంతిని కోరుకుంటున్నామన్నారు. ఈ ప్రదర్శనకు సంబంధించిన వీడియో లు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఈ ప్రదర్శనలో పాల్గొన్న మహ్మద్ అనే ఒక ప్రదర్శకు డు మాట్లాడుతూ, ఈ నిరసన ప్రదర్శన ఎవరు నిర్వహించారో తనకు నిజంగా తెలియదన్నారు. ఐ తే తాను హమాస్‌ను వ్యతిరేకిస్తున్నానీ, యుద్ధం ఆ గిపోవాలనీ, తాము శాంతిని కోరుకుంటున్నామనీ చెప్పారు. పాలస్తీనా ప్రజల తరపున తాను ఈ ప్రపంచానాకి ఒక సందేశం పంపిస్తున్నానన్నారు. ఇ క ఈ యుద్ధం చాలు అని ఆయన అన్నారు. ఈ నిరసన ప్రదర్శనను ధ్వంసం చేసేందుకు హమాస్ ఉగ్రవాదులు పౌర దుస్తుల్లో ఈ ప్ర దర్శనలో పా ల్గొనడాన్ని తాను చూశానని కూడా ఆయన చెప్పా రు. మరో ప్రదర్శకుడు మజ్దీ మాట్లాడుతూ, పాలస్తీనా ప్రజలు తీవ్రంగా విసిగిపోయారన్నారు.

## నేతన్యాహూకు వ్యతిరేకంగా పాదయాత్ర



**జెరూసలెం:** ప్రధానమంత్రి నేతన్యాహూకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్‌లో ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. వేలాదిమంది ప్రజలు ప్రదర్శనలు చేస్తుండగా బందీల కుటుంబీకులు, బాధితులు, వారి స్నేహితులు, మద్దతుదారులు ఇజ్రాయెల్ రాజధాని జెరూసలెంకు పాదయాత్ర ప్రారంభించారు. యుద్ధం ఆపండి, శాంతి కావాలి, బందీలను తక్షణం విడుదల చేయించి తీసుకురండి అని రాసి ఉన్న బ్యానర్లను ప్రదర్శకులు ప్రదర్శించారు. లాట్రన్ నుండి జెరూసలెం వరకూ ప్రదర్శకులు పాదయాత్ర ప్రారంభించారు. నేతన్యాహూ ఉద్దేశపూర్వకంగా యుద్దాన్ని కొనసాగిస్తున్నారనీ, దేశంలో రాజ్యాంగ చట్ట నిబంధనలను పాటించడం లేదనీ ప్రదర్శకులు విమర్శించారు.

## ద.కొరియాలో అసాధారణ కార్చిచ్చు

### ఏడో శతాబ్దం నాటి బౌద్ధ ఆలయం ధ్వంసం, హెలీ పైలట్ సహా 24 మంది సజీవదహనం





**సియోల్ :** దక్షిణ కొరియా, జపాన్ దేశాలలో కా ర్చిచ్చులు రగిలాయి. దక్షిణ కొరియాలో అసాధారణ కార్చిచ్చు గడచిన ఐదు రోజులుగా భీభత్సం సృష్టిస్తోంది. హెలికాప్టర్‌లో వెళ్ళి దావానలంపై నీళ్ళు జిమ్ముతుండగా మంటల్లో ఆ వాయువాహ నం దగ్ధమైంది. దీంతో ఒక పైలట్ సహా 24 మంది ఆ అగ్నికి ఆహుతయ్యారు. 26 మంది గాయపడ్డా రు. ఉయిసోంగ్ గ్రామంలో మంటలను అదుపు చే స్తుండగా పైలట్ మరణించారు. భూతలమార్గంలో మంటలను అదుపుచేసే ప్రయత్నంలో మరో నలుగురు అగ్నిమాపక సిబ్బంది కూడా సజీవదహనమయ్యారు. మ రో 27,000 కుటుంబాలు ఇళ్ళు ఖా ళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోయాయి. షి యల్లా రాజవంశీకులకాలంలో ఏడో శతాబ్దంలో నిర్మించిన పురాతన బౌద్ధ ఆలయం ధ్వంసమైంది. దీనికి సంబంధించిన 20 పురాతన ఆలయాలు, మరో 30 పురాతన నిర్మాణాలు అగ్నికీలల్లో ధ్వం సమయ్యాయి. మరో 200 కీలక మౌలిక సదుపాయాల నిర్మాణాలు దక్షిణ కొరియాలో అగ్నికి ఆ హుతయ్యాయి.43,330 ఎకరాల విస్తీర్ణం ఉన్న అడవులను ఈ కార్చిచ్చు దహించివేసింది.130 హెలికాప్టర్లు, 4,650 మంది అగ్నిమాపకద ళ సి బ్బంది, ఎమర్జెనీ సిబ్బంది మంటలను అదుపుచేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉండగా పశ్చిమ జపాన్‌లో కూడా కార్చిచ్చు చెలరేగింది. కాగాపు రాతనకాలంనాటి ప్రపంచ వారసత్వ జాబితాలో ఉన్న బౌద్ధ ఆలయం దావానలంలో ధ్వంసంకావడంపట్ల యునెస్కో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి ప్రదేశాలను సంరక్షించాలని కోరింది.

## శవపేటికలు అప్పగిస్తాం జాగ్రత్త



**గాజా :** గాజాపై యుద్ధం ఉద్ధృతం చేయడం ద్వారా ఒత్తిడి తీసుకువస్తే బందీలను సజీవంగా కాకుండా నిర్జీవులుగా చేసి శవపేటికల్లో అప్పగిస్తామని పాలస్తీనా ఉగ్రవాదసంస్థ హమాస్ ఇజ్రాయెల్‌కు తీవ్ర హెచ్చరిక చేసింది. గడచిన తొమ్మిదిరోజులుగా గాజాపై తీవ్ర యుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్ దళాలు బందీలకోసం తీవ్ర గాలింపు చర్యలు కొనసాగిస్తోంది. అడ్డంగా ఉన్నవారిని విచక్షణ లేకుండా హతమారుస్తోంది. అల్‌జజీరా జర్నలిస్టుతోపాటు మరో ఇద్దరు హమాస్ అగ్ర నాయకులను కూడా ఇజ్రాయెల్ దళాలు ఇటీవల హతమార్చిన పూర్వరంగంలో హమాస్ ఈ హెచ్చరిక చేసింది. బందీలను సజీవంగా ఉంచడంకోసం తాము శాయశక్తులా చేయగలిగిన కృషి చేస్తున్నామని, తమ సహనాన్ని పరీక్షించవద్దని స్పష్టం చేసింది. 2023 అక్టోబరు ఏడవ తేదీన హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌లో ఒక సంగీతోత్సవంపై దాడిచేసి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు.ఈ కాల్పుల్లో 1200 మంది మరణించగా, మరో 250 మందిని బందీలుగా తీసుకుపోయారు. ఇంకా హమాస్ వద్ద 59 మంది బందీలు ఉండగా వీరిలో 24 మంది మాత్రమే సజీవులుగా ఉన్నట్లు నేతన్యాహూ ప్రభుత్వం భావిస్తున్నది.

**38 మంది పాలస్తీనియన్లు మృతి**

ఇజ్రాయెల్ వరుస దాడులు అంతులేకుండా కొనసాగుతున్నాయి. గాజాలో గడచిన 24 గంటలుగా జరిగిన దాడుల్లో 38 మంది పాలస్తీనియన్లు మరణించారు. కొన్ని మృతదేహాలను శిథిలాల నుండి వెలికితీశారు. 17 నెలలుగా జరిగిన యుద్ధంవల్ల మరో 14 వేల మంది మరణించి పాలస్తీనాలోని శిథిలాలలో కూరుకుపోయి ఉంటారని అంతర్జాతీయ దర్యాప్తు సంస్థలు అంచనావేస్తున్నాయి.ఇదే నిజమైతే పాలస్తీనాలో ఇప్పటివరకూ మృతుల సంఖ్య 65,000 కు పెరుగుతుంది. బుదవారం దేరా ప్రాంతంలో జరిగిన బాంబుదాడుల్లో ఆరుగురు మరణించినట్లు సిరియా ప్రభుత్వం ప్రకటించింది. ఖతార్, సౌదీఅరేబియా ప్రభుత్వాలు ఇజ్రాయెల్ చర్యను తీవ్రంగా ఖండించాయి. మరోవైపు యెమెన్‌లో అమెరికా దళాలు దాడులు కొనసాగిస్తున్నాయి.



## పాడి రైతుల అకౌంట్లలో నేటి నుంచి బిల్లులు జమ

### - ఆదేశించిన సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ సహకారంతో పాల బకాయిలు వెంటనే చెల్లించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల పాడి రైతులు, పలు సొసైటీ జిల్లా యూనియన్ అధ్యక్షులు, పాడి సమాఖ్య ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, ఎండి చంద్రశేఖర్‌రెడ్డిలు బుధవారం శాసనమండలి ఆవరణలో సిఎం రేవంత్ రెడ్డిని కలిశారు. పాడి రైతుల సమస్యలు, వారికి రావలసిన బిల్లుల గురించి చర్చించారు. సంస్థ స్థితిగతులు గురించి సిఎంకు వివరించారు. దీనిపై సిఎం సానుకూలంగా స్పందించి, ప్రభుత్వ సహకారంతో పాల బకాయిలు వెంటనే చెల్లించవలసిందిగా ఆదేశించారు. పాడి రైతుల అకౌంట్లల్లో రేపటినుంచి సుమారు రూ. 60 కోట్ల బిల్లులు జమ చేయించడానికి పాడి సమాఖ్య ఏర్పాట్లు చేస్తున్నది.

## మాట్లాడనీయడం లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఒక్క మాట కూడా మాట్లాడకుండా వెళ్ళిపోయారు. అవసరం లేకున్నా సభను వాయిదా వేశారు' అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అన్నారు. కాగా, లోక్‌సభ డిప్యూటీ లీడర్ గౌరవ్ గొగోయ్, పార్టీ జనరల్ సెక్రటరీ కెసి వేణుగోపాల్, లోక్‌సభలో పార్టీ విప్ మాణిక్యం ఠాగూర్ సహా దాదాపు 70 మంది కాంగ్రెస్ లోక్‌సభ ఎంపిలు లోక్‌సభ స్పీకర్‌ను కలిసి సభలో గాంధీకి మాట్లాడే అవకాశం నిరాకరించి అంశాన్ని ప్రస్తావించారు. అనంతరం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో రాహుల్‌గాంధీ విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడు ఎప్పుడూ లేచినా మాట్లాడటానికి అనుమతిస్తారని, కానీ తాను మాట్లాడటానికి ఎప్పుడూ లేచినా అనుమతివ్వడం లేదన్నారు. తమను మాట్లాడేందుకు అనుమతి ఇవ్వకుండా సభను ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. తాము చెప్పాలనుకునే అంశాలను లేవనెత్తేందుకు అనుమతించడం లేదు. నేనేమీ చేయలేదు. ఒక్క మాట కూడా మాట్లాడకుండా కూర్చున్నా. గత ఏడెనిమిది రోజులుగా మాట్లాడేందుకు అనుమతివ్వడం లేదు అని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ఒక స్థానం ఉందని, అదే విధంగా ప్రభుత్వానికి కూడా సొంత స్థానం ఉంటుందని, కానీ ఇక్కమాత్రం ప్రతిపక్షానికి స్థానమంటూ లేదని ఆయన ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోడీ గత వారం మహా కుంభ్ గురించి ఒక ప్రకటన చేశారు, తాను దానిపై మాట్లాడాలనుకున్నానని, కానీ తనను మాట్లాడటానికి అనుమతించలేదని గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కుంభ్ జరగడం మంచిదే, కానీ నేను నిరుద్యోగం గురించి మాట్లాడాలనుకున్నాను. అయితే నన్ను మాట్లాడటానికి అనుమతించలేదు. స్పీకర్‌కు ఒక ఆలోచన లేదా విధానం ఉందో నాకు తెలియదు. కానీ నిజం ఏమిటంటే మమ్మల్ని మాట్లాడటానికి అనుమతించడం లేదు. సభ అప్రజాస్వామిక పద్ధతిలో నిర్వహిస్తున్నారు' అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. మరోవైపు బుధవారం సభా కార్యకలాపాల సమయంలో స్పీకర్ మాట్లాడుతూ సభ్యులు సభ ఉన్నత ప్రమాణాలు, గౌరవాన్ని నిలబెట్టే విధంగా ప్రవర్తించాలని సూచించారు. సభ్యుల ప్రవర్తన ఉన్నత ప్రమాణాలకు అనుగుణంగా లేదని అనేక సందర్భాల్లో తన దృష్టికి వచ్చిందన్నారు. 'ఈ సభలో, తండ్రి కూతరు, తల్లి కుమార్తె, భార్యా భర్తలు సభ్యులుగా ఉన్నారు. ఈ సందర్భంలో, ప్రతిపక్ష నాయకుడు (సభలో సభ్యులు పాటించాల్సిన నియమాలను నిర్వహించే నియమం) 349 ప్రకారం ప్రవర్తించాలని నేను ఆశిస్తున్నాను' అని స్పీకర్ అన్నారు. ముఖ్యంగా, ప్రతిపక్ష నాయకుడు నిబంధనల ప్రకారం ప్రవర్తించాలని కోరుకుంటున్నాన్నారు.

## లేడీ డాన్ అరెస్టు..

(మొదటి పేజీ తరువాయి)

ఎట్టకేలకు తెలంగాణ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్టు చేశారు. గత కొంత కాలంగా ఆమె కోసం ఐదు రాష్ట్రాల పోలీసులు గాలిస్తున్నారు. ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ 'ఈ' టీమ్ లీడర్ నంద్యాల అంజిరెడ్డి పర్యవేక్షణలో ఒడిశాకు వెళ్లిన బృందం చాకచక్యంగా ఆమె ఇంటిపై దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. సంగీత సాహును బుధవారం సాయంత్రం హైదరాబాద్‌కు తీసుకువచ్చి ఆమెపై నమోదైన ఐదు కేసులలో రిమాండ్ చేశారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన సంగీత సాహు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, ఢిల్లీ, భువనేశ్వర్, మహారాష్ట్ర, ఢిల్లీతో పాటు పలు రాష్ట్రాలకు హోల్‌సెల్‌గా గంజాయిని సరఫరా చేస్తుంది. దేశవ్యాప్తంగా ఆమె నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుంది. ముఖ్యంగా దూల్‌పేట్‌లోని గంజాయి స్మగ్లర్లతో మంచి సంబంధాలు ఉన్నాయి. తెలంగాణకు సరఫరా అయ్యే గంజాయిలో 30 శాతం సంగీతనే సరఫరా చేస్తుంది. ఈమెపై ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లలో ఐదు కేసులు ఉన్నాయి. నాలుగేళ్ల నుంచి తప్పించుకు తిరుగుతున్న సంగీత ఇంటిపై మంగళవారం ఎస్‌టిఎఫ్ టీం ఎస్‌ఐ సైదులు, హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీధర్, కానిస్టేబుళ్లు మహేష్, అరుణ్, మంగలు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. గంజాయి లేడీ డాన్ సంగీతా సాహును ఒరిస్సాకు వెళ్లి అరెస్టు చేసి తీసుక వచ్చిన టీమ్‌ను ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అభినందించారు.

## ధరణి పోర్టల్

(మొదటి పేజీ తరువాయి)

వేస్తామని చెప్పాం, వేశాం. 'భూ భారతి' పేరిట కొత్త చట్టం తీసుకొచ్చాం, అనేక చట్టాలు, పోరాటాల ద్వారా వచ్చిన హక్కులను గతంలో కాలరాశారు. ధరణిని బంగాళాఖాతంలో వేయాలనే ప్రజలు తమకు అధికారం కట్టబెట్టారు. భూములపై రైతులకు హక్కులు కల్పించింది కాంగ్రెస్ పార్టీనే. భూ రక్షణ కోసం ఏదైనా జరిగింది అంటే అది కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిందే. కబ్జా కాలం ఇచ్చి, పేదలకు హక్కులు ఇచ్చాం. ధరణితో పేదల భూములను బిఆర్ఎస్ లాక్కుంది. భూస్వాముల చట్టం ధరణి. లక్షల ఎకరాల భూములు వివాదంలో ఉండడానికి కారణం బిఆర్ఎస్. జమాబందీ వల్ల లాభం తప్ప నష్టం లేదు. ప్రతి సంవత్సరం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం వల్ల సమస్యలు పరిష్కారం అవుతాయని భట్టి విక్రమార్క అన్నారు.

**ధరణి వద్దని ఓటుతో ప్రజలు తీర్పు చెప్పారు : మంత్రి పొంగులేటి**

భూభారతి అంశంతోనే ఈసారి ఎన్నికలకు వెళ్తామని, ధరణి అంశంతో బిఆర్ఎస్ ఎన్నికలకు రాగలరా అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. ప్రజలు ఎవరికి మద్దతు ఇస్తారో చూద్దామన్నారు. బిఆర్ఎస్ నేతలకు మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. అసత్యాన్ని సత్యం చేసేందుకు పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బిఆర్ ఎస్ ప్రభుత్వం తప్పుచేసింది కాబట్టే వారిని ఓడించారన్నారు. ధరణి రెఫరెం డంతో అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లామన్నారు. ధరణి వద్దని ఓటుతో ప్రజలు తీర్పునిచ్చారన్నారు. ధరణితో బిఆర్ఎస్ సభ్యులు ఇబ్బంది పడ్డారని తెలిపారు. ధరణి తప్పిదాలను బిఆర్ఎస్ ఎందుకు ఒప్పుకోవడం లేదని ప్రశ్నించారు. 2020 ధరణి చట్టం తీసుకొచ్చి, 2023 వరకు రూల్స్ ఫ్రేమ్ చేయ లేదన్నారు. విఆర్ఎస్, విఆర్ఓ వ్యవస్థను తీసుకొస్తామని చట్టంలోనే పెట్టామన్నారు. అన్ని వర్గాలతో చర్చించాకే భూభారతి తెచ్చామన్నారు. బిఆర్ఎస్ నేతలు కట్టు కథలు చెబుతున్నారని పొంగులేటి మండిపడ్డారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు ఇస్తామని, అందుకోసం గ్రామాల్లో ఇంది రమ్మ కమిటీలు ఏర్పాటు చేశామని సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు.

## నిరోధానికి సిట్ (మొదటి పేజీ తరువాయి)

దేశంలోనే గత ప్రభుత్వం రాష్ట్రం నాల్గవ స్థానంలో ఉన్నదన్నారు. జూబ్లీహిల్స్ మైనర్ బాలిక అత్యాచార ఘటనలో టిఆర్ఎస్ నాయకుని కుమారున్ని కాపాడేందుకు ప్రయత్నించారని, వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్ కుమారడే ఉన్నారని ఆరోపణలు వచ్చాయని, ఒక మంత్రి కుమారునిపైన కూడా ఆరోపణలు వచ్చాయని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.

**పెట్టుబడులు రానివ్వకుండా ప్రయత్నం**

నేరాలకు పాల్పడుతున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం కాపాడుతోందని అన్నట్టుగా ప్రధాన ప్రతిపక్ష పార్టీ(బిఆర్ఎస్) ఆరోపిస్తూ, రాష్ట్రంలో ఆందోళన కరమైన పరిస్థితిని కలిపించి, తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు రానివ్వకుండా, ప్రయత్నిస్తోందని సిఎం రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు. శాంతిభద్రలను, పెట్టుబడిదారులకు రక్షణ కల్పించినప్పుడే రాష్ట్రంలో పెట్టుబడులు వస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ మంచి కార్యక్రమాన్ని చేపట్టినా ఆ కార్యక్రమానికి దుదుద్దేశాన్ని ఆపాదించి, తెలంగాణ రాష్ట్రం మొత్తం కుప్పకూలిందని, రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టవద్దని , రాష్ట్రం దివాళ తీస్తేనే తమకు సంతోషమని అన్నట్టుగా ప్రతిపక్ష పార్టీ నాయకులు మాట్లాడడం ఏ మాత్రం సమంజసం కాదని సిఎం హితువు పలికారు.

**అధికారం పోతే ఒక్క క్షణం భరించలేరా?.**

తెలంగాణ ఉద్యమంలో ఉండి, పదేళ్లు ప్రభుత్వాన్నినడిపించామని చెప్పుకుంటున్న వారికి (బిఆర్ఎస్) సామాజిక బాధ్యత లేదా?, రాజకీయ బాధ్యత మాత్రమే ఉన్నదా?, అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పవర్ మాంగర్స్‌గా మారి, అధికారం తమకు ఉండాలని, అధికారం పోతే ఒక్క క్షణం కూడా తాము భరించలేమని, ఉండలేమనే విపరీతమైన పోకడలు తెలంగాణ సమాజానికి ఏరంగా మేలు చేస్తాయన్నారు. అప్పుడే అంత ఆత్రం, తాపత్రాయం, అసహనం ఎందుకని, కడుపునిండా విషం పెట్టుకుని ఎందుకు మాట్లాడుతారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో మొదటి ప్రధాన ప్రతిపక్ష నేతగా జానారెడ్డి గతంలో ప్రభుత్వానికి ఏ రకంగా సూచనలు ఇచ్చారని, జానారెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జానారెడ్డి సంప్రదాయాన్ని భట్టి విక్రమార్క కొనసాగించారని, కానీ భట్టిపైన 'మీరు' (బిఆర్ఎస్)కక్షకట్టి ప్రతిపక్ష హోదా తీసేసినా, మైక్ ఇచ్చినా, ఇవ్వకపోయినా, ఇచ్చిన కొద్ది సమయంలోనైనా ప్రతిపక్ష నాయకునిగా భట్టి ఎన్నో సలహాలు ఇచ్చారని సిఎం అన్నారు.

**వారి పోటీ ప్రభుత్వానికి తలనొప్పి ..**

ఒకాయన ఉప ఎన్నికలు వచ్చేశాయని, వచ్చే నెలలో వస్తున్నాయని, టికెట్లు కూడా పంచుతున్నారని, ఆయనను చూసి ఇంకోయాన టికెట్లను పంచుతున్నారని, వారి పార్టీలోని(బిఆర్ఎస్) పోటీ తమ సావుకు వస్తోందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. వారి అంతర్గతంగా ఏమైనా ఉండనివ్వని, వారి ఇంట్లో తేల్చుకోవాలని, తమకు అభ్యంతరం లేదని, కానీ ఒకాయన పొద్దున్నే మీడియా సమావేశం పెడితే, మరోకాయన ట్విట్టర్‌లో పెడుతారని, ఒకరు ట్విట్టర్‌లో పెడితే, మరొకరు ప్రెస్‌నోట్ విడుదల చేస్తారని ఎద్దేవా చేశారు. వారి పోటీ రాష్ట్ర ప్రభుత్వానికి తలకాయ నొప్పిగా మారిందన్నారు. ఒక వేళ జమిలి ఎన్నికలు వస్తే, 2028 లో జరగాల్సిన ఎన్నికలు, కాస్త 2029లో జరిగే అవకాశాలు ఉన్నాయని, దీంతో ప్రస్తుత శాసనసభ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తారని వివరించారు.

**ఆ గుంట నక్కలకు గుణపాఠం చెబుతాం**

గచ్చిబౌలిలో ఉన్న 400 ఎకరాలు హెచ్‌సియుకు చెందిన భూమి కాదని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలిలో ఉన్న భూమిని దాదాపు 25 సంవత్సరాల క్రితం బిల్లీరావు అనే ప్రైవేట్ వ్యక్తికి, ఆయన సంస్థకు ప్రభుత్వం ఆ భూమి కేటాయించిందని, అప్పటి నుండి ఆ భూమి హెచ్‌సియుసి వద్ద లేదన్నారు. 2006లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూ కేటాయింపును రద్దు చేసిందని, అప్పటి నుంచి ఆ భూమి వ్యవహారం కోర్టులలో ఉన్నదని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సుప్రీం కోర్టుకు వెళ్లామని, అనుకూలమైన తీర్పు వచ్చిందని, ప్రస్తుతం ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నదని వివరించారు. ఆ భూమిని రాష్ట్ర అభివృద్ధి కోసం ఉపయోగిస్తున్నామని, టిజిఐఐసికి కేటాయించడంతో పాటు ఐటి కంపెనీలు, ఇండస్ట్రీలకు ఇచ్చేందుకు లేఅవుట్ లు వేయాలని సూచించిన విషయాన్ని సిఎం తెలిపారు. ఈ భూమిలో రిజర్వ్ ఫారెస్ట్ ఉన్నట్లు, ఆ ఫారెస్ట్ లో జీవరాశులు ఉన్నట్లు రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. అక్కడ పులులు, సింహాలు లేవని, కొన్ని గుంటనక్కలు ఆ భూమి చుట్టూ చేరి ఇలా వ్యవహరిస్తున్నాయని, ఆ గుంటనక్కలకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఆ భూమిని వందశాతం అభివృద్ధి జరుగుతున్న ఏరియాలో ఉందన్నారు. దీనికి సంబంధించి వాస్తవాలను తెలుసుకునేందుకు అవసరమైతే నిజనిర్ధారణ కమిటీ వేసినా తమకు అభ్యంతరం లేదని సిఎం అన్నారు

## కుప్పకూలింది (మొదటి పేజీ తరువాయి)

తాపీ మేస్త్రీ ఉపేందర్‌తో పాటు మరో ఇద్దరు కూలీలు ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కూలిపోయిన భవన క్రింద ఎంత మంది ఉన్నారు, ఎంతమంది ప్రాణాలతో ఉన్నారు అనేది శిధిలాలు తొలగిస్తేగానీ చెప్పలేకుండా ఉంది. పట్టణ నడిబొడ్డున,1/70 చట్టం అమల్లో ఉన్న ప్రాంతంలో అంతపెద్ద భవనాన్ని నిర్మిస్తుంటే అధికారులు చర్యలు తీసుకోక పోవడం విడ్డూరంగా ఉంది, దీనిపై ఇటీవల ఐటిడిఏ పిఓ సైతం స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయితీ అధికారిని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఆయన తన పై అధికారి ఆదేశాను సారం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నట్లు ప్రచారం సాగుతోంది. సదరు భవన నిర్మాణదారులు ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ ప్రశ్నించిన వారిపై పలుమార్లు ధౌర్జన్యాలకు పాల్పడినట్లు చెప్పుకుంటున్నారు. అధికారులు నోటీసులు ఇచ్చినా పలుకుబడి ఉపయోగించి పనులు కానిచ్చేస్తున్నాడు. చుట్ట ప్రక్కల వారు పలుమార్లు దీనిపై అభ్యంతరాలు . పలు రాజకీయ పార్టీలు, ఇతర సంఘాల వారు, అధికారులకు అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ భవన నిర్మాణం యదేశ్చగా సాగిపోయి ఆఖరికి కుప్పకూలింది.

**తప్పిన పెనుప్రమాదం**

భవన కుప్పకూలిన ప్రదేశంలో పెను ప్రమాదం తప్పినట్లే అని చెప్పవచ్చు. బోనాలవారి వీధి చాల పురాతనమైంది. ప్రస్తుతం నిర్మాణం అవుతున్న భవన ప్రదేశంలో 40 ఏళ్ళనాటి పాతభవనం ఉంది. దానిని తొలగించే ఆరు అంతస్తులు నిర్మిస్తున్నారు. కాగా నిర్మాణం అవుతున్న అతి పెద్ద భవనాన్ని అనుకుని అనేక ఇళ్లలో చాలా మంది నివాసం ఉంటున్నారు. కాగా భవనం ఒక్క సారిగా పై నుండి క్రిందికి కుప్పకూలింది. అదే ఏవైపుకు కూలిన ఇళ్లపై పడి పెను ప్రమాదం జరగడమే కాకుండా పెద్ద ఎత్తున ప్రాణనష్టం వాటిల్లేది. దీంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

**చేరుకున్న అధికారులు, సహాయక చర్యలు**

ఆరు అంతస్తుల భవనం కుప్పకూలి పోవడంతో ఒక్క సారిగా రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనానికి దారి తీసింది. దీంతో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్‌పి రోహిత్ రాజ్, ఎఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తూ సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ల సహాయంతో ఆరు అంతస్థుల శిధిలాలను తొలగిస్తున్నారు.

## అట్టుడికిన అసెంబ్లీ (మొదటి పేజీ తరువాయి)

సభ్యుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంలో బిఆర్ఎస్ సభ్యుడు కెటిఆర్ చేసిన వ్యాఖ్యలు సభలో దుమారాన్ని రేపాయి. గొడవ సద్దుమణిగేందుకు ఇరుపక్షాల సభ్యులను సముదాయించేందుకు స్పీకర్ రేవూరి ప్రకాష్‌రెడ్డి సావదానంగా చర్చలో పాల్గొనాలని పలు మార్లు సూచించారు. పద్దులపై చర్చలో బిఆర్ఎస్ సభ్యుడు పల్లారాజేశ్వర్‌రెడ్డి పాల్గొంటూ కాంగ్రెస్ ప్రభుత్వం పని తక్కువ ప్రచారం ఎక్కువ అన్నారు. దీన్ని మంత్రి పొంగులేటి తప్పుపట్టారు. ఇలాంటి చవకబారు మాటలు మానుకోవాలని హితవు పలికారు. ఇదే అంశంపై కెటిఆర్ జోక్యం చేసుకుని మంత్రులు ప్రతిసారీ సభ్యుల ప్రసంగాలకు అడ్డుతగలవద్దంటూనే ఈ ప్రభుత్వంలో కమీషన్లు లేకుండా పనులు జరగడంలేదని తీవ్ర స్థాయిలో ఆరోణలు చేశారు. ''మంత్రులు అంత ఎగ్జైట్ అయి మాట్లాడితే ఎలా?, ప్రతిపక్షానికి ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్వేచ్ఛ ఉంది. మీరు నెరవేర్చని హామీలు, పథకాలపైనే మాట్లాడుతున్నాము. మంత్రుల మాదిరిగా మేము కూడా రెచ్చగొట్టాలంటే ఆ పని చేయవచ్చు. దీంతో సభలో తీవ్ర గందరగోళం చోటుచేసుకుంది. సభలో అధికార కాంగ్రెస్, బిఆర్ఎస్ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ దశలో కెటిఆర్ చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కౌంటర్ ఇచ్చారు. 'సభలో సభ్యులు మాట్లాడేటప్పుడు నిబద్ధతతో, ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి. రాష్ట్రంపై పడి అడ్డగోలుగా దోచుకున్నారు. పోరాటాల ద్వారా తెచ్చుకున్న భూ చట్టాలను ఒక్క కలం పోటుతో కనుమరుగు చేశారు. పట్టాదారు కాలం పెట్టి సాగుకాలం ఎత్తివేసి దుర్మార్గమైన ధరణి చట్టం తెచ్చారు. సాయుధ రైతాంగ పోరాటం స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ రాష్ట్రంలో దున్నేవారికి భూమిపై హక్కులు కల్పించాయి. శాసనసభను రాష్ట్రాన్ని తప్పుదోవపట్టిస్తున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.40 వేల కోట్ల పనులు చేయించి, బిల్లులు ఇవ్వలేదన్నారు. బిఆర్ఎస్ పాపం వల్ల బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు ఏడుస్తున్నారని బిఆర్ఎస్ నేతలను ఉద్దేశించి భట్టి విక్రమార్క అన్నారు. తాము ప్రస్తుతం బిల్లుల చెల్లింపులను సరిచేస్తున్నామని తెలిపారు. 'కెటిఆర్ గౌరవంగా మాట్లాడుతారని నేను ఊహించా. కెటిఆర్ సభనే కాదు రాష్ట్రాన్ని కూడా తప్పుదోవపట్టిస్తున్నారు. అభయహస్తం పేరుతో అడ్డగోలుగా ప్రకటనలు ఇచ్చారని కెటిఆర్ చెప్పారు. రూ.4 కోట్లు ఇచ్చి రూ.40 కోట్లు ఇచ్చినట్టు ప్రచారం చేసుకుంటున్నారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మేం ప్రకటనలు ఇచ్చినట్టు పల్లా రాజేశ్వర్ రెడ్డి చూశారా? నిరాధార ఆరోపణలతో పల్లా రాజేశ్వరరెడ్డి సభను తప్పుదోవపట్టించారు. మైకు ఉందని అడ్డగోలు ఆరోపణలు చేయడం సరికాదు అని భట్టి విక్రమార్క అన్నారు. బిఆర్ఎస్ సభ్యులు కెటిఆర్ వ్యాఖ్యలను స్పీకర్ రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు ప్యానల్ స్పీకర్ రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రకటించారు. బిఆర్ఎస్ సభ్యులు హరీశ్ రావు, కెటిఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ప్రశాంత్ రెడ్డిలు తమకు మట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. పదేపదే కోరడంతో కెటిఆర్ అవకాశం ఇచ్చారు. తిరిగి ఆయన వివాదస్పంద వ్యాఖ్యాలు చేయడంతో స్పీకర్ ఆయన మైక్ కట్ చేశారు. దీంతో బిఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

**లాబీల్లో ఫొటోలు ఎందుకు తీశారు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

బిఆర్ఎస్ సభ్యులు కావాలనే సభలో హంగామా చేశారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సభలో నిరసన తెలిపే అవకాశం ఉన్నప్పటికీ లాబీల్లోకి వెళ్లి షో చేశారన్నారు. సభ నడుస్తున్నప్పుడు లాబీల్లో ఫొటోలు, వీడియోలు తీయడంపై నిషేధం ఉన్నప్పటికీ, ఫొటోలు, వీడియోలు తీశారని, వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్టు కూడా చేశారని, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. మార్షల్స్‌పై కూడా దౌర్జన్యం చేశారన్నారు. కమీషన్ కె అంటే కాళేశ్వరం, కమీషన్ కె అంటే కాకతీయ, కమీషన్ కె అంటే కరెంట్ కొనుగోళ్లు అని ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు.

**పాత అంశాలపైచర్చ వద్దు : శ్రీధర్ బాబు**

సభలో సభ్యులు ఇప్పుడు ప్రవేశపెట్టిన అంశాలపైనే మాట్లాడాలని శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సూచించారు. గతంలో పెట్టిన పద్దులు, బడ్జెట్‌పై మాట్లాడితే ఎలా?, సభ్యులు అందరు సహకరించాలన్నారు. గతంలో తాము ప్రతిపక్షంలో ఉన్నపుడు బిఆర్ఎస్ నాయకులు ఎలా మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉన్నపుడు మాట్లాడలేదా? అని ప్రశ్నించారు.

**వ్యక్తిగత విమర్శలు ఎవరూ చేసినా తప్పే : కూనంనేని సాంబశివ రావు**

సభలో వ్యక్తిగత విమర్శలు ఎవరూ చేసినా తప్పేనని సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. పొలిటికల్ కామెంట్లకు శాసనసభ వేదిక కాదని అన్నారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్న తీరు బాధాకరమన్నారు.




# జనరల్
STATE & REGIONAL NEWS

## విద్యావ్యవస్థలో పర్యవేక్షణ కోసం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి

ఎంఎల్‌సి డాక్టర్ బల్మూర్ వెంకట్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యావ్యవస్థలో పర్యవేక్షణ కోసం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఎంఎల్‌సి డాక్టర్ బల్మూర్ వెంకట్ ప్రభుత్వాన్ని కోరారు. శాసనమండలిలో బుధవారం 'తెలంగాణలో విద్య' అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన పాల్గొంటూ ఐదేళ్లలో దేశంలోనే తెలంగాణలో బెస్ట్ విద్యా విధానాన్ని అమలు చేయాలన్నారు. 2009లో యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా హక్కు చట్టాన్ని పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో 25 శాతం ప్రవేశాలను సరిగా చేయడం లేదన్నారు. దీనిని ప్రభుత్వమే దరఖాస్తులు స్వీకరించి సీట్లు భర్తీ చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల ప్రజా పాలనలోనే చిత్త శుద్ధితో చర్యలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

**ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి : ప్రొఫెసర్ ఎం.కోదండరామ్**

విద్యా వ్యవస్థలో ఫీజుల నియంత్ర చట్టం తీసుకురావాలని ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు.

ప్రాథమిక విద్యను బలోపేతం చేయడంతో పాటు ప్రీప్రైమరీ వ్యవస్థను ప్రభుత్వం ప్రవేశపెట్టడం ద్వారా ప్రైవేటు వైపు విద్యార్థులు వెళ్లకుండా మొదట్లోనే అరికట్టవచ్చన్నారు.

## సత్వరమే ప్రాజెక్టులు పూర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇప్పటికే రాష్ట్రంలో 80 శాతం పనులు పూర్తయిన ప్రాజెక్టుల పనులను సత్వరమే పూర్తి చేసి సాగునీరు అందించాలని సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభలో సోమవారం ఇరిగేషన్ శాఖ పద్దులపై జరిగిన చర్చలో ఆయన పాల్గొంటూ నీటిపారుదల శాఖకు గత ఏడాది బడ్జెట్‌లో రూ.22,162 కోట్లు కేటాయించగా, ఇందులో కేవలం 50 శాతం మాత్రమే ఖర్చు చేశారన్నారు. ఈ ఏడాది కేవలం రూ.11,618 కోట్లు మాత్రమే కేటాయించడం సరిపోవేమో అన్నారు. నీటిపారుదల శాఖ 34 భారీ, 39 మధ్య తరహా, 2 ఆధునిక ఒక వరద నీటికి సంబంధించి మొత్తం 76 ప్రాజెక్టులను చేపట్టగా, ఈ ప్రాజెక్టులన్నీ అక్రమార్కులకు ఎటిఎం మాదిరిగా మారాయన్న ఆపవాదు ఉందన్నారు. మైనర్ ఇరిగేషన్ పరిధిలో రాష్ట్రంలో మొత్తం 46 వేల చెరువులు, కుంటలు ఉండగా, వీటి కింద 25 లక్షల ఎకరాల సాగు జరుగుతుందని చెప్పారు. అయితే గతంలో మిషన్ కాకతీయ కింద కేవలం 22 వేల చెరువులను మాత్రమే బాగుచేశారని, మిగతావాటిని కూడా ఈ ప్రభుత్వం బాగుచేయాలని కోరారు. అదేవిధంగా 745 లిఫ్ట్ పథకాలు ఉండగా, వీటిని రైతులకు అప్పగించడం పంపుల నిర్వహణ లేక వీటి కింద ఉన్న భూములు బీడు భూములుగా మారుతున్న నేపథ్యంలో వీటిని ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. మధ్య తరహా ప్రాజెక్టులు 39 ఉండగా, రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్లతో ప్రారంభమై ఇవి గడిచిన 20 ఏళ్లుగా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని, వీటిలో 24 ప్రాజెక్టులకు సంబంధించి రూ.974 కోట్లు ఖర్చు పెడితే అవి పూర్తయి 18 లక్షల 58 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై తుది నిర్ణయం తీసుకోవాలని, దీనిని కొనసాగించడం కంటే తమ్మడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని చేర్చితే ఎకరాకు కేవలం రూ.10 వేల ఖర్చుతో సాగు నీరు అందుతుందని చెప్పారు. రూ.18వేల అంచనా వ్యయంతో పాలమూరు ప్రాజెక్టును చేపట్టగా ఇప్పుడది రూ.70 వేల కోట్లకు చేరగా, ఇప్పటికీ రూ.32 వేల కోట్లు ఖర్చుచేసినప్పటికీ ఒక ఎకరాకు కూడా సాగు నీరు అందించలేకపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామసాగర్ ప్రాజెక్టు బుర్గంపాడులో మొదలై కొత్తగూడెం గుండా పోతున్నప్పటికీ ఈ రెండు ప్రాంతాల్లో ఒక్క ఎకరాకు కూడా నీరు అందే ఏర్పాటు లేకపోవడంతో స్థానిక రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఈ ప్రాంతాలకు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కూనంనేని కోరారు.

## కాళేశ్వరంపై విజిలెన్స్ రిపోర్టు అందింది

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరంపై విజిలెన్స్ రిపోర్టు తమకు అందిందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ డిపిఆర్, నిర్మాణానికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఈ విషయంలో తాము ఎన్‌డిఎస్ఎ నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. శాసనసభలో బధువారం పద్దులపై చర్చ సందర్భంగా బిజెపి సభ్యులు పాల్వాయి హరీశ్ బాబు లేవనెత్తిన అంశాలపై మంత్రి సమాధానం ఇచ్చారు. కేంద్ర జలశక్తి మంత్రి చంద్రకాంత్ రఘునాథ్ పాటిల్‌ను కలిసి ఎన్‌డిఎస్ఎ నివేదికను త్వరిగతిన ఇవ్వాలని కోరామని తెలిపారు. కాళేశ్వరంపై విచారణ తుది దశకు చేరిందన్నారు. విచారణ నివేదిక సిఫార్సులతోనే కాళే శ్వరంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుత్వ తరలోనే ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కడుతామన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీళ్లందించే ప్రాజెక్టులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రాజెక్టులను రెండు భాగాలుగా విభజించామని తెలిపారు. ఏ ప్రాజెక్టు విషయంలోనూ ప్రభుత్వం వివక్ష చూపించడంలేదన్నారు. దేవాదుల ప్రాజెక్టు కొంత నిర్లక్ష్యానికి గురైన మాట వాస్తవమేనని చెప్పారు. ఎస్‌ఎల్‌బిసి దుర్ఘటన దురదృష్టకరమన్నారు. ఇప్పటి వరకు 2 మృతదేహాలు మాత్రమే లభించాయని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ప్రాజెక్టు పూర్తిచేస్తామని మంత్రి స్పష్టం చేశారు. అందుకు ప్రభుత్వం కూడా కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. సహాయకచర్యలు పూర్తికాగానే ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్టునుప్రారంభిస్తామన్నారు.

**ఈనెల 30వ తేదీ నుంచి సన్న బియ్యం పంపిణీ..**

రాష్ట్రంలో 22 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గతంలో బియ్యం పంపిణిలో చాలా లోపాలు ఉన్నాయన్నారు. రేషన్ షాపులలో ఇస్తున్న దొడ్డు బియ్యం 80 శాతం మంది లబ్ధిదారులకు ఉపయోగించడం లేదని, 7,8వేల కోట్ల రూపాయల బియ్యం పంపిణీ జరిగితే లబ్ధిదారులు వాడకపోవడంతో పక్కదారి పట్టిపోయాయని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిఎం, డిప్యూటీ సిఎం, క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకొని, పేదలు కడుపునిండా తినే విధంగా మంచి నాణ్యమైన ఫైన్ రకం బియ్యం పంపిణి చేయాలని నిర్ణయించామని తెలిపారు. దేశ చరిత్రలో ఒక విప్లవాత్మక మార్పు తీసుకువస్తూ ఆహారభద్రత కోసం ఇలాంటి గొప్ప నిర్ణయం తీసుకోవడం తమకు చాలా ఆనందాన్ని ఇస్తుందన్నారు. ఈ నెల 30వ తేదీన సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సన్న బియ్యం పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఎంఎల్‌ఎలు కూడా ఆయా నియోజకవర్గాలలో ప్రారంభించాలని కోరారు. రాష్ట్రంలో 84శాతం మందికి మనిషికి 6 కిలోల చొప్పున మంచి రకం సన్న బియ్యం ఉచితంగా అందించబోతున్నామన్నారు. ఇటీవల రేషన్ డీలర్లకు కొంత కమిషన్ పెంచామని, రేషన్ షాపుల్లో నిత్యావసర వస్తువుల విక్రయాలను ప్రారంభిస్తామన్నారు.

## రజకులకు రూ.300లకోట్ల విద్యుత్ బకాయిలు ఇవ్వాలి

స్పీకర్‌కు బిఆర్ఎస్ పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టిపిసిసి అధ్యక్షునిగా ఉన్న సమయంలో రజకులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని బిఆర్ఎస్ సభ్యులు వాకిటి సునీతాలక్ష్మారెడ్డి శాసనసభలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు బుధవారం పిటిషన్ అందజేశారు. వారికి రూ.300ల కోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నాయని, వాటిని రద్దు చేయాలని, రజక ఫెడరేషన్ల నుంచి రుణాలు ఇవ్వాలని, ప్రమాద వశాత్తు మరణించిన వారికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఆమె తన పిటిషన్‌లో కోరారు.

## బిఆర్ఎస్ ఎంఎల్‌సిల ఆందోళన

**ప్రజాపక్షం / హైదరాబాద్:** శాసనమండలి ఆవరణలో బుధవారం బిఆర్ఎస్ ఎంఎల్‌సిలు ఆకస్మికంగా నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ప్లకార్డులు చేతబట్టుకుని నిరసన తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద తులం బంగారం ఇవ్వాలని, బంగారం కడ్డీల నమూనాలను ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పక్ష నాయకులు మధుసూదనాచారి, కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ నిరుపేదలు ఆడబిడ్డ పెళ్లి చేసేందుకు ఇబ్బందులు పడకూడదనే కెసిఆర్ కల్యాణల, షాదీముబారక్ పథకాల ద్వారా రూ.లక్షకు పైగా ఆర్థిక సాయం చేశారని గుర్తు చేశారు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని మాయ మాటలు చెప్పారని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనట్లయితే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపడతామని బిఆర్ఎస్ ఎంఎల్‌సిలు హెచ్చరించారు.

# నేటికీ 'ఫ్రెండ్లీ పోలీస్'గా రూపాంతరం చెందకపోవడం బాధాకరం

సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** పోలీసు వ్యవస్థ అనేది ఓ సామాన్యుడి బాధ విని, వారికి న్యాయం చేసే ఫ్రెండ్లీ వ్యవస్థగా నేటికీ రూపాంతరం చెందకపోవడం బాధాకరమని సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. ఒక సామాన్యుడు తనకు జరిగిన అన్యాయంపై ధైర్యంగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ ముందు కూర్చొని ఫిర్యాదు చేసే పరిస్థితి నేటికి కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ పరిస్థితి మారాలని, ఇందుకు కావాల్సిన సంస్కరణలు తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభలో బుధవారం హోమ్, రెవెన్యూ, గృహనిర్మాణం, పౌర సరఫరాలు, నీటి పారుదల, పౌరసంబంధాల శాఖల పద్దులపై జరిగిన చర్చలో కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ముందుగా ఆయన హోంశాఖ పద్దుపై మాట్లాడుతూ రాష్ట్రంలో అంతర్గత భద్రతకు సంబంధించి కీలకపాత్ర పోషించే పోలీసు శాఖలో సినిమాల్లో చూపిస్తున్న విధంగా మంచివారితో పాటు అక్రమార్కులకు కొమ్ము కాసే కొంతమంది అవినీతి అధికారులు ఉన్నారని, అలాంటి వారితోనే ఈ వ్యవస్థ పట్ల సామాన్య ప్రజలకు నమ్మకం లేకుండా పోతోందని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థ ప్రక్షాళనకు ప్రభుత్వం అప్పుడప్పుడు కొన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ పరిస్థితుల్లో మాత్రం మార్పు లేదన్నారు.

''మనిషికి సంకెళ్లు లేకపోయినా ఎవరి మనసుకు అయితే స్వేచ్ఛ ఉండదో అతను స్వేచ్ఛా జీవి కాదని, ఓ బానిస'' లాంటి వాడేనని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అన్న వ్యాఖ్యలను ఈ సందర్భంగా కూనంనేని ఉటంకించారు. రాజ్యాంగం భావస్వేచ్ఛా ప్రకటనను ఇచ్చినప్పటికీ తమ భావాలను వ్యక్తం చేసే పరిస్థితి లేదన్నారు. డెన్మార్క్ లాంటి దేశాల్లో ఉన్న ఫ్రెండీ పోలీసు వ్యవస్థను ఇక్కడ కూడా అమలు చేయడం ద్వారా ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం, విశ్వాసం కల్పించే విధంగా చూడాలని ప్రభుత్వానికి సూచించారు.

**పోలీసు వ్యవస్థలోనూ బానిసత్వం :**

పోలీసు వ్యవస్థలో సైతం బానిసత్వం కొనసాగడం దురదృష్టకరమని, ప్రభుత్వం దీనిని అంతమొందించాల్సిన అవసరముందని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఎన్‌కౌంటర్ల పేరుతో అతి కిరాతకంగా కాల్చిచంపుతున్న పోలీసులకు ప్రత్యేక పదోన్నతులు కల్పించడం దేనికి సంకేతమని, అసలు ఇలాంటి విధానాలు ఉంటే పోలీసులకు న్యాయబద్ధంగా పనిచేయాలనే ఆలోచన ఎలా వస్తుందని, ఈ విధానాలన్నీ మారాలన్నారు. పోలీసులకు సైతం షిఫ్ట్ డ్యూటీల విధానాన్ని అమలు చేయాలన్నారు. ట్రాఫిక్ పోలీసుల పరిస్థితులు మరీ దారుణంగా ఉంటున్నాయని, గంటల తరబడి నిలబడి ఉద్యోగం చేయాల్సి వస్తోందన్నారు. వారికి తమిళనాడు తరహాలో సౌకర్యాలు కల్పించాలని, ఇందుకు పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేయాలని కోరారు. పోలీసులకు సంబంధించి పిఆర్‌సిలు, సరెండర్ లీవులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని చెల్లించాలన్నారు. హోంగార్డులు పోలీసుల మాదిరిగానే ఉద్యోగాలు చేస్తుండడంతో వారి సమస్యలను పరిష్కరించాలని, ఇక్కడి నుంచి ఎపికి, ఎపి నుంచి తెలంగాణ రావాలని 400 మంది దరఖాస్తులు చేసుకున్నారని, వాటిని పరిష్కరించాలని కోరారు. మల్టీ జోన్ విధానం కారణంగా పోలీసు అధికారులకు పదోన్నతుల్లో అలస్యం జరుగుతోందని, దీనిని సరిచేయాలని సూచించారు.

రాష్టంలో సైబర్ నేరాలు, డ్రగ్స్, గంజాయి, మహిళలపై దాడులు, హత్యలు ఇలా అన్ని రకాల కేసుల సంఖ్య నిత్యం పెరిగిపోతున్నాయని, వీటిని అరికట్టేందుకు మరిన్ని సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. జైళ్లల్లో ఖైదీల పరిస్థితులు దారుణంగా ఉంటున్నాయని, మంచి ప్రవర్తన కలిగిన వారు సైతం బయటికి వచ్చే పరిస్థితులు లేకుండా పోతున్నాయని, అలాంటి వారికి స్వేచ్ఛ కల్పించాలని కోరారు. కోర్టులు అనుమతించిన వారిని కూడా విడుదల చేయకపోవడంతో ఈ వ్యవస్థపై మరింత కోపం పెరిగే అవకాశం ఉందన్నారు.

**తెలంగాణ ఉద్యమ కారులపై కేసులు ఎత్తివేయాలి**

తెలంగాణ ఉద్యమకారులపై ఉన్న కేసులతో పాటు పోడు భూములకు సంబంధించి గిరిజనులపై పెట్టిన కేసులను కూడా ఉపసంహరించుకోవాలని కూనంనేని సాంబశివ రావు ప్రభుత్వాన్ని కోరారు. సామాజిక స్పృహ తో పనిచేస్తున్న వారిపై అర్బన్ నక్సలైట్లు అని ముద్ర వేస్తూ ఎన్ఐఎ కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. ఇలాంటివి జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరాపార్క్ ధర్నాలకు అన్ని అనుమతులు ఇవ్వాలన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిరసనను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేయడం సరికాదని, అక్కడ యాథాస్థితిని కొనసాగించాలని కూనంనేని సాంబశివరావు కోరారు.

## రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఆర్టిజన్లకు కనీస వేతన చట్టం అమలు చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కామ్‌లలో పనిచేస్తున్న వేలాది మంది ఆర్టిజన్లకు కనీస వేతన చట్టం అమలు చేయాలని సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు బుధవారం శాసనసభ సమావేశం కాగానే ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కామ్‌లలో పనిచేస్తున్న వేలాదిమంది ఆర్టిజన్‌లకు శాశ్వత ఉద్యోగులకు చెల్లించే సౌకర్యాలను చెల్లించడంతో పాటు, వారి సర్వీసులను క్రమబద్ధీకరించేందుకు చర్యలను తీసుకోవాలని కూనంనేని సాంబశివరావు తన వాయిదా తీర్మానంలో కోరారు.

## శాసనసభలో వీధి పోరాటమా !

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** శాసనసభ జరుగుతున్న తీరు చాలా దురదృష్టకరమని, సభలో అధికార, ప్రతిపక్ష సభ్యులు వీధి పోరాటాన్ని తలపించేలా వ్యక్తిగతంగా పరస్పరం దూషించుకునే విధంగా మాట్లాడం సరికాదని సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇందుకు బయట రాజకీయ వేదికలు చాలా ఉంటాయని, అక్కడ ఏమైనా మాట్లాడుకోవచ్చు.. కానీ ఇక్కడ సభా సమయం వృథా చేయడం సరైందికాదని సూచించారు. శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చ జరిగి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని, నాలుగున్నర కోట్ల మంది ప్రజలు ఎదురు చూస్తుంటారని, కాని దురదృష్టమేమిటంటే ఓ స్థాయిలో ఉన్న సభ్యులు ఇలా వ్యవహరించడం తగదన్నారు. ఎంత కోపం, ఆవేశం ఉన్నా పరిధి దాటి మాట్లాడకూడదని, పార్లమెంటరీ, అసెంబ్లీ సంప్రదాయాలు ఉంటాయని గుర్తుంచుకోవాలన్నారు. అద్దాల మేడలో కూర్చుకుని దానిపై రాయి మనమే విసురుకుంటే అది పగులుతుందని, అధికారపక్షమైనా, ప్రతిపక్షమైనా ఎవరైనా వ్యక్తిగతంగా పరస్పరం దూషించుకోవడం సమంజసం కాదన్నారు. రాజకీయాలు బయట మాట్లాడుకుందామని, సభ సమయాన్ని వృథా చేయరాదని, అధికార, ప్రతిపక్ష రెండు పక్షాల శ్రేయోభిలాషిగా కోరుతున్నానని తెలిపారు.

**రెవెన్యూ అంశం వస్తే చాలు అందరూ కమ్యూనిస్టుల మాదిరిగానే మాట్లాడుతారు**

''రెవెన్యూ అంశం వస్తే చాలు అధికార, ప్రతిపక్ష సభ్యులు ఇక తుపాకి పట్టడమే అలస్యం విప్లవం వచ్చేసింది అన్నట్లుగా వ్యవహరిస్తారు. అందరూ కమ్యూనిస్టుల మాదిరిగానే మాట్లాడుతారు. కమ్యూనిస్టు పరిభాషనే ఉపయోగిస్తారు. మళ్లీ తుపాకి పట్టే పరిస్థితి వస్తుందంటారు. మరొకరేమో మరోసాయుధ పోరాటం చేయాల్సి వస్తుందంటారు.'' ఎందుకు అంటున్నారో తెలియదు కాని పేదవారి పట్ల వారి హృదయంలో ఆ ప్రేమ ఉండాలని కోరుకుంటున్నానని సిపిఐ శాసన సభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు అన్నారు.

## పంచాయతీరాజ్ సవరణ బిల్లుకు శాసనమండలి ఏకగ్రీవ ఆమోదం

ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ప్రత్యేక హక్కులు: మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పంచాయతీరాజ్ సవరణ బిల్లును బుధవారం శాసనమండలి ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు ఆదిలాబాద్ నుంచి అచ్చంపేట వరకు షెడ్యూల్ ఏరియాను గుర్తించారని, ఆ చట్టాన్ని 1/70 గా పిలుస్తారని, ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ప్రత్యేక హక్కులు కల్పించేందుకు, అభివృద్ధి జరిగేందుకు 1/70 చట్టం కృషి చేస్తుందని మంత్రి ధనసరి అనసూయ సీతక్క చెప్పారు. పంచాయతీరాజ్ సవరణ బిల్లుపై చర్చకు, సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి ధనసరి అనసూయ సీతక్క సమాధానం ఇచ్చారు. మున్సిపాలిటీ కావాలని ఎన్నో గ్రామాల ప్రజలు అడుగుతున్నారని అన్నారు. మున్సిపాలిటీలు అయితే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. ములుగు జిల్లా కేంద్రం అయినా మున్సిపాలిటీ చేయలేదని, కానీ ఇప్పుడు ములుగును మున్సిపాలిటీగా చేసుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రజల అభిప్రాయం, కలెక్టర్లు పంపిన ప్రతిపాదనల ఆధారంగా మున్సిపాలిటీలుగా అప్డేట్ చేస్తున్నామని చెప్పారు. చాలా మండలాల్లోని గ్రామాలను ఇతర జిల్లాల్లో కలిపారని, స్థానిక ఎన్నికల సందర్భంగా ఎన్నో గందరగోళాలు తలెత్తుతున్నాయని అన్నారు. కొన్ని గ్రామాలు ఒక మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటున్నాయని, రెవెన్యూ పరిధి వేరే మండలంలో ఉంటుందన్నారు. ఆ సమస్యలకు పరిష్కారం చూపుతామని తెలిపారు. ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తేయాలని అడుగుతున్నారని, ఈ విషయంపై క్యాబినెట్, సిఎంతో చర్చిస్తామని స్పష్టం మంత్రి చేశారు. కొత్త గ్రామపంచాయతీలలో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను పరిశీలిస్తామన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉన్నాయని కొందరు సభ్యులు ప్రస్తావించారని, వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. స్థానిక సంస్థల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఆమోదించుకున్నామని, కేంద్రం ఆ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తే రిజర్వేషన్లు పెరుగుతాయని, అన్ని పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు.

## చైర్మన్, మేయర్ ఎన్నికల్లో రాజ్యసభ సభ్యులకు ఓటు హక్కు

మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొత్తగూడెం, పాల్వంచ సహా పలు మున్సిపాలిటీలను మున్సిపల్ కార్పొరేషన్‌లుగా, పలు గ్రామపంచాయతీలను కలుపుతూ మున్సిపాలిటీలలో విలీనం చేసే ''తెలంగాణ మున్సిపల్ సవరణ బిల్లు –2025'' ను శాసనమండలి బుధవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. శాసనమండలిలో తెలంగాణ మున్సిపల్ సవరణ బిల్లు –2025పై జరిగిన చర్చకు, సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు సమాధానమిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో సెక్షన్ 20 ప్రకారం రాజ్యసభ సభ్యులకు చైర్మన్, మేయర్ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సెక్షన్ 200 ప్రకారం ఎన్నికల్లో ప్రైవేటు ఆస్తులను ఉపయోగించుకుంటామన్నారు. ములుగును మున్సిపాలిటిగా అభివృద్ధి చేశామని, అలాగే మాల్కాజ్‌గిరి మేడ్చల్ జిల్లాలోని కల్లూరు, ఆలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట కామారెడ్డిలోని బిచ్‌కుందకు కూడా మున్సిపాలిటి హోదా కల్పించడం జరిగిందన్నారు. నర్సంపేట మున్సిపాలిటి నుంచి రాజంపేట గ్రామం తొలగించడం, హాలి యా మున్సిపాలిటిలోని ఇబ్రహీంపేట గ్రామం సర్వే నెంబర్ 1 నుంచి 260 వరకు 320 నుంచి 540 వరకు తొలగించామన్నారు. నుంచి 260 320 540 వరకు తొలగింపు పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటిలో సాయినగర్ గ్రామ పంచాయితీని కలపడం, జగిత్యాల మున్సిపాలిటిలో టూ బిహెచ్‌కె ప్రాంతాన్ని కలపడం అమీన్‌పూర్ మున్సిపాలిటీలో వడకపల్లి, జానకం పేట గ్రామ పంచాయితీ, మద్దూరు మున్సిపాలిటిలో నాగంపల్లి, భీపూర్, చాపంచెరువు తాండ, ఎర్రగుంట తాండ నాలుగు గ్రామ పంచాయతీలు కలపడం జరిగిందన్నారు.

# స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర ఇవ్వాలి

రైతు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుంది

జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ అల్దాస్ జానయ్య

రెండవ రోజు కొనసాగిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మూడవ మహాసభలు






**ప్రజాప్రక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** రైతు అనుకుంటే ప్రభుత్వాలను గద్దె నెక్కించగలరు. గద్దె దించగలరని స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర ఇవ్వాలని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ అల్దాస్ జానయ్య అన్నారు. రెండవ రోజు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మూడవ మహాసభలు నిజామాబాద్‌లోని బిఎల్‌ఎన్ గార్డెన్‌లో ప్రారంభం కాగా, ఉదయం మాజీ శాసనసభ్యులు ఉజ్జయిని, యాదగిరిరావు, జెండావిష్కరణ చేశారు. అమరుల వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. మొదట స్వాగత ఉపన్యాసాన్ని ఆహ్వాన సంఘం అధ్యక్షులు నర్ర రామారావు గావించారు. ఈ సభా కార్యక్రమానికి భాగం హేమంతరావు, ముత్యాల విశ్వనాథం, రవీందర్‌రెడ్డి, దేవ భక్తుని సంధ్య, డిజి. నరేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. కౌలు రైతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోపోజిట్ సూర్యనారాయణ అతుల్‌కుమార్ ఆంజాన్‌కు, ఈ మధ్యకాలంలో మరణించిన రైతులకు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జయశంకర్ వ్యవసాయ విద్యాలయం వైస్‌చాన్స్‌లర్ అల్దాస్ జానయ్య, అఖిలభారత రైతు సంఘం ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, వ్యవసాయ విశ్లేషకులు సోమర్ల వ్యవసాయ శాస్త్రవేత్త దొంతి నర్సింహారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్యకలాపాల నివేదికపై పశ్య పద్మ మాట్లాడారు. ఈ మహాసభలనుద్దేశించి జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ గ్రామస్థాయిలో రైతు బాగుంటే, రైతు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధి అనేది కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడ బాధ్యత అన్నారు. మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. నేను ఒక రైతు బిడ్డనే కష్టాలు కళ్లారా చూశానని, వ్యవసాయంపై మూడు దశాబ్దాలకు పైగా అధ్యయనం చేస్తూ వివిధ మాధ్యమాల ద్వారా ప్రభుత్వాలకు పాలకులకు సలహాలు, సూచనలు ఇవ్వటం జరిగిందన్నారు. నిత్యం రైతులతో మాట్లాడుతూ వారికి ఉన్న సమస్యల మీద సమస్యల పరిష్కారం కోసం సేవలందించే అవకాశం రావటం సంతోషంగా ఉందన్నారు. రైతులు వారి సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకోవాలి అందులో ప్రభుత్వంలో పాత్ర ఏమిటి ? రైతుల పాత్ర ఏమిటి ? అని విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల సమస్యల మీద ఎంత మాట్లాడినా తక్కువేనని, ఒక సమస్యల పరిష్కారమయ్యేలోపు మరో సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు అందుకనుగుణంగా కార్యాచరణ రూపొందించడం లేదన్నారు. రాష్ట్రంలో వరి ఉత్పత్తులు పెరిగాయని, అందుకు మనం గర్వపడాల్సిన అవసరముందని, మరో విధంగా బాధపడాల్సిన అవసరం కూడా ఉందని వరితో పాటు మిగతా ఉత్పత్తులు కూడా పెంచుకోవాల్సిన అవసరముందన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల లాభాలు రైతులకు అందిస్తున్నాయా లేదన్నది మొదటి ప్రశ్న అని, కష్టపడి పండించిన తర్వాత ఉత్పత్తులను ఎక్కడ అమ్ముకోవాలి? ఏ ధరకు అమ్ముకోవాలనేది ప్రశ్నార్థకమైందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గత ఐదు సంవత్సరాల క్రితం మూడు చట్టాలు కేంద్ర ప్రభుత్వం తీసుకురావటం జరిగిందని, కానీ మూడు చట్టాలలో కొన్నింటిని కార్పొరేట్ శక్తులకు లాభం చేకూరేలా ఉన్నాయన్నారు. చట్టాలు అధికారికంగా ప్రైవేట్ వ్యక్తులకు లైసెన్స్ ఇచ్చే విధంగా ఉన్నాయని, ఇది బాధ్యతారహితం అన్నారు. రైతులంటేనే ప్రభుత్వాలను గద్దె నెక్కించగలవు. ప్రభుత్వాలను గద్దె దింపగలవని రాజకీయ పార్టీలు మరిచిపోకూడదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతుకు మేలు జరిగే విధానాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతులకు కీడు కలిగించే ఎలాంటి విధానాలైనాసరే రైతు నాయకులు, మేధావులు, ఆర్థిక వేత్తలు శాస్త్రవేత్తలు అందరం కూడా వ్యతిరేకిస్తామన్నారు. ప్రపంచ దేశాలలో 35 దేశాలు తిరిగి చూశానని, రైతుల గురించి అధ్యయనం చేశామని అక్కడ కూడా రైతులకు ఇలాంటి పరిస్థితిలే ఉన్నప్పటికీ మన దేశంలో ఇంకా ఎక్కువగా సమస్యలున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర అందిస్తున్నామని చెప్పడం సరికాదని కాస్ట్ సి 3 ప్రకారం రైతు ఖర్చు చేసే 50 శాతంపై మద్దతు ఇవ్వాలని ఎ 2 ప్రకారం మాత్రమే ఇస్తున్నారన్నారు. స్వామినాథన్ సిఫార్సులప్రకారం చూసుకుంటే 30 నుండి 35 తేడా ఉంటుందన్నారు. స్వామినాథన్ చెప్పిన ప్రకారం లెక్కిస్తే రైతులకు 30 నుంచి 35 శాతం తక్కువగా ఇస్తున్నారన్నారు. పూర్తి మద్దతు ధర ఇస్తే చాలావరకు రైతు సమస్యలు పరిష్కారమయ్యే అవకాశాలున్నాయన్నారు. రైతులు ఒకే రకం పంటలు కాకుండా అన్ని రకాల పంటలు వేయాలని సూచించారు. పంట మార్పిడి అనేది రైతుకు లాభాదాయకమైనదన్నారు. సాంప్రదాయ పంటలు మరుగవుతున్నాయని, వీటికి ఎక్కువ మద్దతు ఇచ్చి పండించిన పప్పు ధాన్యాలను సేకరించి వాటిని ప్రోత్సహించేలా స్పెషల్ బోనస్ ఇవ్వాల్సిన అవసరముందన్నారు. వ్యవసాయంలో శాసన సాంకేతికతను పెంచితే ఖర్చులు తగ్గి లాభాలు పెరిగే అవకాశముందన్నారు. కార్యక్రమంలో స్వావర్ణ సందేశం సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఓమయ్య, రఘురాం ఈ సంఘం మహాసభకు సందేశమిచ్చారు. ఈ మహాసభస మావేశంలో తీర్మానాల కమిటీలో వార్ల వెంకటయ్య, కె.గోవింద్, కంబాల శ్రీనివాస్, కొల్లూరి రాజయ్య, ప్రభులింగం, రామచంద్రం, దేవిదాస్, సారంగపాణి, బొల్లు ప్రసాద్, రాజేష్, రమేష్ పాల్గొన్నారు.

ప్రజాపక్షం
గురువారం, మార్చి 27

## ఈ వివక్ష క్షమార్హం కాదు..

కేంద్ర ప్రభుత్వ ప్రకటనలకు... వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండాపోతున్నది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద నిధుల పంపిణీపై ప్రభుత్వ దాటవేత ధోరణితో ఇది స్పష్టమైంది. 20 కోట్ల జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్ కంటే, ఏడు కోట్ల జనాభాగల తమిళనాడుకు ఎక్కువ నిధులు వెళుతున్నాయని గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి చంద్రశేఖర్ పెమ్మసాని చెప్పడం సత్యదూరం. గ్రామీణ ఉపాధి నిధుల చెల్లింపుల్లో కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు విపరీతమైన జాప్యాన్ని ఎదుర్కొంటున్నాయి. ఇదే అంశాన్ని ప్రస్తావించిన కాంగ్రెస్ ఎంపి అదూర్ ప్రకాశ్‌కు మంత్రి డొంకతిరుగుడు సమాధానం... గ్రామీణ ఉపాధి వెబ్‌సైట్ ను పరిశీలిస్తే, మంత్రి వాదనలో డొల్లతనం స్పష్టమవుతుంది. కేరళకు రూ. 811 కోట్ల విలువైన బకాయిలు చెల్లించలేదన్నది వాస్తవం. తమిళనాడుదీ అదే పరిస్థితి. కేంద్ర ప్రభుత్వం గత ఐదు నెలలుగా తమిళనాడుకు రూ.4,034 కోట్ల ఉపాధి నిధులను చెల్లించాల్సి ఉందని డిఎంకె సభ్యురాలు కనిమొళి గుర్తుచేసినప్పుడు, చెల్లింపులు ఆలస్యమైతే 0.05 శాతం వడ్డీ ఇవ్వాలని చట్టంలో ఉండటంతో అసలు సమస్యను పక్కదారి పట్టించారు. రాష్ట్రాలకు నిధులు రాకుండా దిగ్బంధనం చేసి, రాజకీయ ప్రయోజనం పొందాలన్నది మోదీ ప్రభుత్వ కుట్రగా కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తదితర ప్రభుత్వాల ఆరోపణ. పార్లమెంటులో మంత్రి చేసిన ప్రకటన ఈ అనుమానాన్ని పెంచుతున్నది. డిమాండ్ ఆధారిత వేతన ఉపాధి పథకంగా గ్రామీణ ఉపాధి పథకం కొనసాగుతున్నదనే విషయాన్ని మరచిపోకూడదు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు నిధుల విడుదల ఓ నిరంతర ప్రక్రియ. క్షేత్రస్థాయిలో పని కోసం ఉన్న డిమాండ్‌ను అనుసరించి, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు నిధులను కేంద్రం అందుబాటులో ఉంచాలి. కానీ, బకాయిలు చెల్లించకపోగా, ఆలస్యమైతే వడ్డీ ఇస్తామనడం విడ్డూరం. రెక్కాడితేగానీ డొక్కాడని ఉపాధి హామీ కూలీలను పరోక్షంగా వడ్డీ స్వీకర్తలతో పోల్చడం దుర్మార్గం. నిధుల విడుదలకు కేంద్రం కట్టుబడి ఉందని మంత్రి పెమ్మసాని చెప్తుండగా, ఎప్పుడు చెల్లిస్తారనేది సమాధానం లేని ప్రశ్న. పశ్చిమ బెంగాల్‌కు 2022 నుంచి గ్రామీణ ఉపాధి నిధులు అందలేదు. యుపి వంటి బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలకు చెల్లింపులు ఎప్పుడూ ఆగలేదు. బిజెపియేతర ప్రభుత్వాలను ఆర్థికంగా కుంగదీసి.. వైఫల్యాలను అంటగట్టి.. రాజకీయంగా పట్టు బిగించడమే కేంద్ర సర్కారు వ్యూహంగా కనిపిస్తున్నది. నిధుల దుర్వినియోగం జరిగిందని కాబట్టి పశ్చిమ బెంగాల్‌కు చెల్లింపులు జరగలేదంటున్న మంత్రి, మూడేళ్లుగా ఏం చేస్తున్నారో చెప్పాలి. 'పశ్చిమ బెంగాల్ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన 44 పనుల్లో అవకతవకలు జరిగాయి. 34 కేసుల్లో రికవరీ పూర్తయింది. మొత్తం రూ. 5.37 కోట్లు దుర్వినియోగంకాగా, రూ. 2.39 కోట్లు రికవరీ చేశారు.' ఇవీ అధికారికంగా మంత్రి ఇచ్చిన గణాంకాలు. పెండింగ్‌లో ఉన్న పది పనుల కోసం ఏకంగా ఉపాధి హామీ మొత్తాలను నిలిపివేయడం ఎంతవరకు సమంజసం? నిధుల దుర్వినియోగాన్ని ఎవరూ సమర్థించరు. చర్యలు తీసుకోవద్దని కోరరు. కానీ, సంవత్సరాల తరబడి బకాయిలను చెల్లించకపోతే, పేద కార్మికులు జీతం.. జీవితం లేకుండా పోతుందనే ఆలోచన కేంద్రానికి లేదా? 'ఉపాధి హామీ'లోనే శ్రమకు చెల్లింపు హామీ లేకపోవడం దారుణం కాదా?

గ్రామీణ పేదలను ఆదుకోవడానికి ఉద్దేశించిన ఉపాధి పథకాన్ని కూడా రాజకీయం చేయడం క్షమార్హం కాదు. బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో చెప్పకుండా, అస్పష్టమైన సమాధానాలతో కాలయాపన చేయడం వల్ల ప్రయోజనం ఏమిటి? పార్లమెంటు సమావేశాలకు విలువ ఎక్కడిది? రాజకీయాలతో సంబంధం లేకుండా, కోరిన గ్రామీణ పేదలకు ఉద్దేశించిన పథకాన్ని సక్రమంగా అమలు చేయడం కేంద్రం విధి. చవకబారు రాజకీయాలకు తెరదించి, అన్ని రాష్ట్రాలకూ సమన్యాయం చేయాలి. సమాఖ్య వ్యవస్థను బతికించాలి.

# భారతదేశంలో ఫాసిజాన్ని గుర్తించడం మరెప్పుడు?



దీపాంకర్ భట్టాచార్య
జాతీయ ప్రధాన కార్యదర్శి,
సిపిఐ(ఎంఎల్) లిబరేషన్

భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్ట్) త్వరలో జరగనున్న 24వ మహాసభలకు ముందుగా విడుదల చేసిన ముసాయిదా తీర్మానం కంటే ఆ పార్టీ పోలిట్ బ్యూరో జారీ చేసిన అంతర్గత నోట్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొట్టడమే గాక ప్రజల దృష్టిని విశేషంగా ఆకర్షించింది. ముసాయిదా తీర్మానం కొన్ని చోట్ల ప్రస్తుత రాజకీయ పరిస్థితులను, మోదీ ప్రభుత్వాన్ని విశ్లేషించడానికి 'నయా ఫాసిస్టు లక్షణాలు' అనే వ్యక్తీకరణను ఉపయోగించింది. అయితే నయా ఫాసిస్టు లక్షణాలు అనే వ్యక్తీకరణను కేవలం లక్షణాలు లేదా ధోరణులుగా మాత్రమే అర్థం చేసుకోవాలి గానీ మోదీ ప్రభుత్వాన్ని ఫాసిస్టు లేదా నయా ఫాసిస్టు పాలనగా అర్థంచేసుకోకూడదని నోట్ స్పష్టం చేసింది. భారతదేశంలోని ప్రస్తుత పరిస్థితుల విశ్లేషణ విషయం లో సిపిఎమ్ పార్టీ సిపిఐ లేదా సిపిఐ (యమ్.యల్) పార్టీలకు భిన్నంగా ఉందని నోట్ స్పష్టం చేసింది.

బహుశా నయా ఫాసిజం అనే వ్యక్తీకరణ సిపియమ్ శ్రేణులలో గందరగోళాన్ని సృష్టించి ఉండవచ్చు. ప్రస్తుత సందర్భంలో సిపియమ్, సిపిఐ (యమ్.యల్) పార్టీల మధ్య వ్యత్యాసం ప్రధానంగా నయా అనే పదం చుట్టూనే తిరుగుతుంది కాబట్టి నోట్ దాన్ని వివరించాల్సిన పరిస్థితికి నెట్టబడింది. ప్రస్తుత భారతదేశంలో ఫాసిజం కేవలం ఒక ధోరణి మాత్రమేనని అది ప్రదర్శించే లక్షణాలు కేవలం పురిట్లోనే ఉన్నాయని ఇంకా పాతుకుపోలేదని లేదా నిర్ణయాత్మకంగా మారలేదని, కావున పాలకవర్గ స్వభావాన్ని ఫాసిస్ట్‌గా నిర్వచించలేమని నోట్ వివరించింది. సిపియమ్ డాక్యుమెంట్‌లో తొలిసారిగా కనిపించిన నయా ఫాసిస్టు పదం గురించి పార్టీ కార్యకర్తల దృష్టి ఎక్కువగా ఉండకూడదనే ఉద్దేశం నోట్ లో కనిపించింది. మరో మాటలో చెప్పాలంటే, ఒకపక్క 'ఎఫ్' అక్షరాన్ని (ఫాసిజం అనే పదాన్ని) ప్రస్తావించక తప్పదు అనే పరిస్థితులు ఉండగా, ఫాసిస్టు ప్రమాదాన్ని అతిగా అంచనా వేయకుండా పార్టీని హెచ్చరించడానికే సి.పి.యమ్ ఈ నోట్ ద్వారా ప్రయత్నించింది. సి.పి.యమ్ నోట్ ఇటలీ, జర్మనీలలో సంభవించిన ఫాసిజాన్ని సంప్రదాయ ఫాసిజం (క్లాసికల్ ఫాసిజం)గా వర్ణించింది, ఇప్పుడు ఉద్భవిస్తున్న నయా ఫాసిస్ట్ ధోరణి సాంప్రదాయ ఫాసిజం నుండి ఎలా భిన్నమైనదో నోట్ వివరించింది. ఈ వ్యత్యాసాలలో కొన్ని జర్మనీ, ఇటలీలలో మొదటి ప్రపంచ యుద్ధ నేపథ్యంలో సామ్రాజ్యవాద దేశాల మధ్య తీవ్రమైన అంతర్గత శత్రుత్వం, మహా మాంద్యం (గ్రేట్ డిప్రెషన్)గా పిలవబడే తీవ్ర పెట్టుబడిదారీ సంక్షోభ పరిస్థితులను బట్టి ఆవిర్భవించిన ఫాసిజం అని నోట్ పేర్కొంది. అక్కడితో ఆగకుండా నోట్ మరో స్వాభావికమైన వ్యత్యాసాన్ని కూడ పేర్కొంది. అదేమిటంటే సాంప్రదాయ ఫాసిజం బూర్జువా ప్రజాస్వామ్యాన్ని తిరస్కరించగా, ఈ 'నయా' రకం బూర్జువా ప్రజాస్వామ్యానికి ప్రత్యేకించి ఎన్నికల వ్యవస్థకు అనుకూలంగానూ దానిని సౌకర్యవంతంగా కూడా పరిగణిస్తుంది. మరో మాటలో చెప్పాలంటే సంప్రదాయ ఫాసిజానికి అంతర్గతంగా ఎలాంటి నియంత్రణలు(చెక్స్) లేవు. ప్రజాస్వామ్య వ్యవస్థ తాలూకు ప్రతి అంశాన్ని ధ్వంసం చేసిన భయంకర విధ్వంసక తుఫాను అది సృష్టించింది, కానీ నయా ఫాసిస్టు ధోరణిలో ఏదో ఒక స్వీయ పరిమితి లేదా స్వీయ నియంత్రణ ఉంది అని నోట్ చెబుతుంది.

సాంప్రదాయ ఫాసిజం దాని నూతన అవతారం మధ్య ఈ వ్యత్యాసాన్ని కచ్చితంగా గమనంలోకి తీసుకోవలసిన అవసరం ఉందని, భారతదేశం ఇప్పుడు చూస్తున్నది, అనుభవిస్తున్నది కేవలం కొన్ని నయాపాసిస్టు ధోరణులు మాత్రమేనని వాటిని నిలువరించకపోతే భవిష్యత్తులో అది నయా ఫాసిజంగా ఎదగవచ్చని సిపియమ్ వాదిస్తుంది. కానీ, 1920వ దశకములో ఫాసిజం పురోగమన చారిత్రక సందర్భం గురించి మాట్లాడుకుంటే సామ్రాజ్యవాద దేశాల మధ్య తీవ్రమైన అంతర్గత సంఘర్షణ, తీవ్రమైన ఆర్థిక సంక్షోభంతో పాటు విప్లవభయం కూడ ఉంది. 'యూరప్‌ను ఒక భూతం వెంటాడుతుంది. అది కమ్యూనిజం అనే భూతం' అనే సుప్రసిద్ధ వాక్యంతో 1848లో కమ్యూనిస్టు మేనిఫెస్టో ప్రారంభమైంది. 1917 నవంబర్ లో రష్యాలో సోషలిస్టు విప్లవం విజయం సాధించిన నేపథ్యంలో ఈ కమ్యునిస్టు భూతం అనే భయం వాస్తవ రూపం దాల్చింది. ఐరోపాలో, ఇతర చోట్ల విప్లవ అవకాశాలు ఫలించనప్పటికీ, రష్యన్ విప్లవ ఐదవ వార్షికోత్సవం నాటికి ఇటలీలో ఫాసిజం అధికారాన్ని పొందింది.

ఐరోపాలో ఫాసిజం ఆవిర్భవించిన తొలినాళ్ళలోనే ఫాసిజం అంతర్జాతీయ ధోరణి గా గుర్తించబడినప్పటికీ సంబంధిత చారిత్రక వాస్తవాలు సంబంధిత దేశాల సామాజిక పరిస్థితుల ద్వారా రూపొందించబడిన జాతీయ ప్రత్యేకతలను అది ఇముడ్చుకుంటుందని స్పష్టమైంది. జర్మనీలో ఫాసిజం విజృంభించే సమయానికి అది నాజీయిజం లేదా జాతీయ సోషలిజం అనే ప్రత్యేక పేరును సంతరించుకుంది. 20వ శతాబ్దపు ప్రథమ అర్థభాగంలో ఐరోపాలో మనం చూసిన అదే తరహా ఫాసిజం ఇక్కడ కూడా ఉందని భారతదేశంలో ఎవరూ మాట్లాడట్లేదు. నేడు భారతదేశాన్ని మార్క్సిస్టు కోణంలో విశ్లేషించేటప్పుడు, భారతీయ ప్రత్యేకతలతో పాటు, ఫాసిజం చరిత్రలో అన్ని సందర్భాలకు చెందిన సాధారణమైన, స్పష్టమైన ప్రాథమిక లక్షణాలను పరిగణలోనికి తీసుకోవాలి. ఈ దృక్కోణం నుండి సిపియమ్ తన వైఖరి స్పష్టం చేయడానికి ఇచ్చిన నోట్‌ని పరిశీలిస్తే కచ్చితంగా కొంత అర్థవంతంగా వుండేది.

భారతదేశంలోను అంతర్జాతీయంగానూ ఆర్‌ఎస్‌ఎస్ ను ఫాసిస్టు సంస్థగా భావించే విస్తృత ప్రగతిశీల అభిప్రాయంతో సిపియమ్ ఏకీభవిస్తుంది. అయితే కొన్ని కీలకమైన విషయాలను గుర్తించాలి. సిపియమ్ తన వివరణలో సాంప్రదాయక ఫాసిజానికి నమూనాలుగా పిలుస్తున్న ఇటలీ, జర్మనీ ఫాసిజాల నుండే ఆర్‌ఎస్‌ఎస్ తన ఆవిర్భావం నాటి నుంచి అనేక విషయాలను స్వీకరించింది. సైద్ధాంతిక పునాది, సంస్థాగత నిర్మాణం, వ్యవహార శైలీ లాంటి విషయాలను అరువు తెచ్చుకుంది. జర్మనీలో నాజీలు యూదుల పట్ల వ్యవహరించిన రీతిలోనే భారతదేశంలో ముస్లింలను అంతర్గత శత్రువులుగా చూపేందుకు ఆర్.ఎస్.ఎస్ ప్రయత్నిస్తోంది. అయితే, వలస కాలం నాటి భారతదేశ పరిస్థితీ, యుద్ధానంతర ఇటలీ జర్మనీ దేశాల పరిస్థితీ ఒకటి కాదనేది మరో విషయం. ఇటలీ జర్మనీలలో ఫాసిస్టులు ఉనికిలోనికి వచ్చిన కొన్ని సంవత్సరాలలోనే అధికారానికి వచ్చారు. భారతదేశంలో స్వాతంత్ర్య ఉద్యమకాలంలో కానీ భారతదేశం రాజ్యాంగ గణతంత్ర రాజ్యంగా ప్రయాణం ప్రారంభించిన దశాబ్దాలలో గానీ ఎటువంటి ప్రభావం చూపలేని నామమాత్రపు శక్తిగా ఆర్‌ఎస్‌ఎస్ మిగిలిపోయింది. ప్రపంచంలో ఒక ఫాసిస్టు ధోరణి దీర్ఘ కాలం కొనసాగి బలాన్ని కూడగట్టుకోవడానికి మారుతున్న సామాజిక రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా మారుతూ గణతంత్ర సంస్థాగత నెట్వర్క్ లోనికి అనూహ్యంగా చొచ్చుకుపోయి దానిని నియంత్రించి అదుపు చేసే స్థాయికి ఆర్ ఎస్ ఎస్ ఎదిగిన తీరు ప్రపంచంలో మరే యితర ఫాసిస్ట్ ధోరణికి సాటి లేని ఉదాహరణగా నిలుస్తుంది. ఒక ఫాసిస్టు శక్తి రాజకీయ అధికారంపై పెరుగుతున్న తన పట్టు ద్వారా ఏమి సాధించాలనుకుంటుంది? అది తన శక్తిని మొత్తం ప్రదర్శించి ఫాసిస్టు అజెండాను అమలు చేయాలని సంకల్పిస్తుందా లేక బూర్జువా ప్రజాస్వామ్యానికి శాశ్వతంగా అంటిపెట్టుకుని దాని నియమాల కనుగుణంగా వ్యవహరించాలనుకుంటుందా? ఈ విషయంలో ఆర్‌ఎస్‌ఎస్ ఉద్ధాన పతనాలు, ఎత్తుగడలు, వెనక్కుతగ్గిన సందర్భాలు, వ్యూహాత్మక పురోగతులు 100 సంవత్సరాల దాని వునికి, ముఖ్యంగా గత నాలుగు దశాబ్దాలలో దాని నాటకీయ పెరుగుదల, బలసమీకరణకు సంబంధించిన చరిత్ర పరిశీలిస్తే ఎవరికీ స్వల్పంగానైనా ఆర్‌ఎస్‌ఎస్ గురించి సందిగ్ధత రాకూడదు.

> లౌకిక ప్రజాస్వామ్య భారతదేశంలో హిందూ ఆధిపత్య ఫాసిస్టు రాజ్యాన్ని స్థాపించాలనే చిరకాల వాంఛ గల సంఘ్ పరివార్ తన అజెండాను క్రమపద్ధతిలో అత్యంత వేగంగా అమలు చేసే ప్రక్రియలో తీవ్రమైన నయా ఉదారవాద సంక్షోభం కంటే చాలా ఎక్కువ ప్రమాదం దాగి ఉందని మనకు తెలియజేస్తుంది.

అద్వాని రథయాత్ర ద్వారా రామ జన్మభూమి ప్రచారాన్ని ఉధృతం చేసి అంతిమంగా 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేయడం ద్వారా సంఘ్ పరివారం తన దుష్ట ఫాసిస్టు పన్నాగపు మొట్టమొదటి నమూనాని పరిచయం చేసింది. ఆ ఘటనను కేవలం ఒక దౌర్జన్యపూరిత మతతత్వ వాదంగానూ కరడుకట్టిన చాందసవాద చర్యగానో చూడకూడదు. హిందూ ఆధిపత్యం ఆధారంగా భారతదేశ ఉనికిని మార్చుతూ 'హిందూ రాజ్యం' అనే ఊహకి ఆజ్యం పోసేందుకు జరిగిన స్పష్టమైన ప్రయత్నంగా చూడాలి. ఈ సంఘటనను సిపిఐ (యమ్‌యల్) భారతదేశ మిశ్రమ సంస్కృతికి, రాజ్యాంగబద్ధ గణతంత్ర వ్యవస్థకు ప్రమాదకరంగా పరిణమించే మతతత్వ ఫాసిస్ట్ ముప్పుగా గుర్తించింది. కామ్రేడ్స్ వినోద్ మిశ్రా, సీతారాం ఏచూరి ఇరువురూ ఆర్‌ఎస్‌ఎస్ పన్నాగం గురించి విస్తృతంగా రాశారు. ఈ కీలక పరిణామం వల్ల కలిగే రాజకీయ పరమైన, భావజాల పరమైన ప్రభావాల గురించి వామపక్ష ప్రగతిశీల శ్రేణులను అప్రమత్తం చేశారు. ప్రగతిశీల విద్యావేత్తలు తపన్ బసు, సుమిత్ సర్కార్, ప్రదీప్ దత్త, తానిక సర్కార్, సంబుద్ధ సేన్‌లు ఆర్‌ఎస్‌ఎస్ యొక్క ఫాసిస్టు పన్నాగాన్ని బట్టబయలు చేస్తూ 'కాకీ నిక్కర్లు– కాషాయ జెండాలు' పేరుతో అద్భుతమైన చిన్ని పుస్తకాన్ని రూపొందించారు.

బాబ్రీ మసీదు కూల్చి వేసిన తర్వాత బిజెపి ఏకాకిగా మారిన వైనం కొంతకాలం మాత్రమే ఉంది, తిరిగి ఐదేళ్లలో ఆ పార్టీ అఖిల భారత సంకీర్ణాన్ని ఏర్పాటు చేయగలిగింది. శతాబ్దం మారేనాటికి భారతదేశం ఎన్.డి.ఏ పాలనలోనికి ప్రవేశించింది. పూర్తి కాలం మనుగడ సాగించిన మొదటి కాంగ్రెసేతర ప్రభుత్వంగా నిలిచింది. 1999జనవరిలో భజరంగ దళ్ నాయకుడు ధారా సింగ్, అతని బృందం గ్రాహం స్టువార్ట్ స్టెయిన్స్‌ను అతని కుమారులు ఫిలిప్, తిమోతీలను కాల్చిచంపిన ఘటన, మూడు సంవత్సరాల తర్వాత గుజరాత్‌లో చెలరేగిన ముస్లిమ్ వ్యతిరేక మారణకాండ పురులు విప్పుతున్న సంఘ్ బ్రిగేడ్ ఎజెండాకు స్పష్టమైన సంకేతాలను ఇచ్చింది. నరేంద్రమోదీ ప్రభుత్వం గుజరాత్ మారణహోమం గురించి 'అసలు జరగనేలేదనే' విధంగా వ్యవహరించినా, భారతదేశం ఇంటా బయటా విస్తృతంగా నిరసనలు ఎదుర్కొంది. 2004లో ఎన్.డి.ఏ ఓటమిని నిర్దేశించడంలో ఇది ప్రధాన పాత్ర పోషించింది. కేంద్రంలోని ఆర్‌ఎస్‌ఎస్ బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా ఎటువంటి చర్య తీసుకోవడానికి నిరాకరించడంతో సంఘ్ పరివారం తన హిందూ రాజ్య లక్ష్యంవైపు తదుపరి అడుగు వేయడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేసింది.

యు.పి.ఏ ప్రభుత్వం కేంద్రంలో రెండు దఫాల పాలనను పూర్తి చేసుకున్నప్పటికీ, గుజరాత్‌లో బిజెపి తన స్థానాన్ని పటిష్టం చేసుకుంది. భారతదేశ కార్పొరేట్ వర్గం కూడా 'వైబ్రెంట్ గుజరాత్' పేరుతో జరిగిన ద్వైవార్షిక పెట్టుబడి సదస్సులలో మోదీ చుట్టూ మూగడం ప్రారంభించింది. భారతీయ పెట్టుబడిదారీ వర్గం నిర్ణయాత్మక మద్దతుతో మోడీని ఢిల్లీకి తీసుకురావాలనే నినాదం మరింత ఊపందుకుంది, టాటా గ్రూప్ కూడా అదాని అంబానీల తో చేతులు కలిపింది. 2014 నుండి మనకు కేంద్రంలో మోడీ శకం ప్రారంభమైంది. కార్పొరేట్ మతతత్వ శక్తుల కలయికతో ఏర్పడ్డ ఈ బాటని గుర్తుపెట్టుకోవటం చాలా అవసరం. లౌకిక ప్రజాస్వామ్య భారతదేశంలో హిందూ ఆధిపత్య ఫాసిస్టు రాజ్యాన్ని స్థాపించాలనే చిరకాల వాంఛ గల సంఘ్ పరివార్ తన అజెండాను క్రమపద్ధతిలో అత్యంత వేగంగా అమలు చేసే ప్రక్రియలో తీవ్రమైన నయా ఉదారవాద సంక్షోభం కంటే చాలా ఎక్కువ ప్రమాదం దాగి ఉందని మనకు తెలియజేస్తుంది.

'హిందూ రాజ్యం వాస్తవ రూపం దాలిస్తే, నిస్సందేహంగా అది ఈ దేశానికి అతిపెద్ద విపత్తు అవుతుంది' అని అంబేద్కర్ ఎనభై సంవత్సరాల క్రితమే హెచ్చరించాడు. భవిష్యత్తును ఊహించి అంతకంటే గొప్ప విషయాన్ని చెప్పలేదేమో! చట్టాలను సవరించడం, చట్టసభ, న్యాయ వ్యవస్థల అమరికను మార్చడం దగ్గర నుంచి రాజ్యాంగ మౌలిక స్ఫూర్తిని పూర్తిగా ఉల్లంఘించే చర్యలను చట్టబద్ధం చేయడం, మన గణతంత్ర రాజ్యాన్ని నియంత్రించే మొత్తం సంస్థాగత నిర్మాణాన్ని, వాతావరణాన్ని దారి మళ్లించడం వరకూ, ఈ ఆర్.ఎస్.ఎస్ బి.జె.పి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకు పౌర హక్కులు స్వేచ్ఛలను హరించే చర్యలన్నిటినీ తీవ్రతరం చేస్తుంది. ముస్లిం సమూహాన్ని, సమాజంలోని వివిధ బలహీనవర్గాలను, అసమ్మతి గళాలను లక్ష్యంగా చేసుకొని సాగుతున్న రాజ్య ప్రోద్బలంతో చెలరేగుతున్న విద్వేషం, హింసలకు ప్రభుత్వం నుంచి లోపాయకారీ ఆమోదం అందడం మరో విశేషం. ఫలితంగా మన ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగ పునాదిపై అపూర్వమైన రీతిలో కొనసాగుతున్న దాడి మనకు స్పష్టంగా అర్థమవుతోంది. నూతన రాజ్యాంగం కోసం సంఘ్ పరివార్ లోని వివిధ సమూహాల నుండి స్పష్టమైన పిలుపులు కూడ వినిపిస్తున్నాయి. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా జరుగుతున్న పార్లమెంటు చర్చలో బాబాసాహెబ్ అంబేద్కర్ గురించి స్వయానా కేంద్ర హోం మంత్రి అమిత్ షా అవమానకరమైన వ్యాఖ్యలు చేశాడు.

(సశేషం)

# వాతావరణ హెచ్చరికలో దేశాల మధ్య అంతరాలు



కింజరాపు అమరావతి
82472 86357

మన దేశంలో గోవా, మహారాష్ట్రలు ఫిబ్రవరిలో మొట్టమొదటి వడగాలులను నమోదు చేశాయి, భారత వాతావరణ శాఖ ప్రకారం శీతాకాలంలో (జనవరి – ఫిబ్రవరి) మొదటి సారి వడగాలులు సంభవించాయి. మార్చి 15, 2025న ఒడిశాలోని బౌధ్ భారతదేశంలో అత్యధిక ఉష్ణోగ్రతను నమోదు చేసింది. తీవ్రమైన వేడి కొనసాగింది, మార్చి 16న బౌధ్ 43.6 డిగ్రీల సెల్సియస్, ఝార్సుగూడ 42 డిగ్రీలు, బోలంగిర్ 41.7 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. 2025 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా భూమిపై మంచు తుఫానులు, చల్లని గాలులు, కరువులు, వేడి తరంగాలు, అడవి మంటలు, వరదలు, సుడిగాలులు, ఉష్ణమండల తుపానులు వంటి అనేక వాతావరణ సంఘటనలు గణనీయమైన ప్రభావాన్ని చూపాయి. వాతావరణం అనేది ప్రపంచవ్యాప్తంగా ప్రజల జీవితాలు, ఆర్థిక వ్యవస్థలు, పర్యావరణ వ్యవస్థలను నేరుగా ప్రభావితం చేస్తుంది.మన వాతావరణంలో మార్పులు మరింత తీవ్రమైన వాతావరణ సంఘటనలకు దారితీస్తున్నాయి. వేగంగా తీవ్రతరం అవుతున్న ఉష్ణమండల తుపానులు, వినాశకరమైన వర్షపాతం, తుపానులు, వరదలు, ప్రాణాంతక కరువులు, అడవి మంటలు అధికమవుతున్నాయి. సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. జనసాంద్రత కలిగిన తీర ప్రాంతాలు ఉప్పెన, సముద్ర అలల ప్రభావాలకు గురవుతున్నాయి.

వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులకు సంబంధించి వాతావరణంపై అధ్యయనం చేసేందుకు 1950 మార్చి 23న, 180 దేశాల సభ్యత్వంతో ప్రపంచ వాతావరణ సంస్థ ప్రారంభించబడింది. 75 సంవత్సరాలకు పైగా డబ్ల్యుఎంఒ వాతావరణ వ్యవస్థ శాస్త్రంలో ప్రపంచంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఆ సంస్థ ఏర్పడిన రోజును ప్రపంచ వాతావరణ దినోత్సవంగా నిర్ణయించబడింది. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం జరుపబడుతుంది. వాతావరణ మార్పులు, విపరీతమైన వాతావరణ సంఘటనలు, పెరుగుతున్న సముద్ర మట్టాలు వంటి ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంలోనూ వాతావరణ శాస్త్రం ఉపయోగపడుతుంది.

అత్యాధునిక సాంకేతికతతో ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ఏర్పాటు చేయాలంటే ప్రపంచంలో కొన్ని దేశాలకు మాత్రమే సాధ్యం అవుతుంది. అల్ప ఆదాయ దేశాలు ఈ వ్యవస్థలు నిర్మించుకోలేవు. ఇది ప్రపంచ దేశాల మధ్య అంతరాలను సృష్టిస్తుంది. కానీ అన్ని దేశాల ప్రజల ప్రాణాలను కాపాడటం, జీవనోపాధిని రక్షించడం, సమాజ స్థితిస్థాపకతను బలోపేతం చేయడం లాంటివి అన్ని దేశాల ఉమ్మడి బాధ్యత. దీని కొరకై ఈ అంతరాలను తగ్గించడం లేదా పూర్తిగా తొలగించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను పెంపొందించడంలో ప్రపంచ సహకారానికి ప్రాముఖ్యత ఉంది. ముందస్తు హెచ్చరిక అంతరాన్ని కలిసి తగ్గించడం ద్వారా, మనం సురక్షితమైన, మరింత స్థితిస్థాపకంగా ఉండే ప్రపంచాన్ని నిర్మించగలము.

**ప్రధానమైనవి నాలుగు:**

అందరికీ ముందస్తు హెచ్చరికల వ్యవస్థ అందుబాటులోనికి తేవడానికి నాలుగు విషయాలు ప్రధానమైనవి. అవి ఒకటి, విపత్తు ప్రమాద పరిజ్ఞానం కలిగి ఉండాలి. రెండు ప్రమాదాల గుర్తింపు, పరిశీలనలు, పర్యవేక్షణ, విశ్లేషణ మరియు అంచనా వేయగలగాలి. మూడు, హెచ్చరిక సమాచారాన్ని వ్యాప్తి చేయగలగాలి. నాలుగు, ప్రతిస్పందించడానికి సంసిద్ధత కలిగి ఉండాలి. అయితే అంచనా సామర్థ్యాలు గణనీయంగా అభివృద్ధి చెందినప్పటికీ, పరిశీలన నెట్‌వర్క్‌లు, అంచనా కచ్చితత్వం, అధిక నాణ్యత వాతావరణ, జలసంబంధమైన డేటాను పొందడంలో అంతరాలు అలాగే ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో జాతీయ వాతావరణ జలసంబంధమైన సేవలను బలోపేతం చేయడం వాతావరణ అనుకూలతకు మాత్రమే కాదు, ఇది ప్రపంచ స్థితిస్థాపకత, భద్రత ఆర్థిక స్థిరత్వానికి కూడా అవసరం.

''అన్ని దేశాలలో వాతావరణ సంబంధిత ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలకు స్థితిస్థాపకత, అనుకూల సామర్థ్యాన్ని బలోపేతం చేయడం; వాతావరణ మార్పు చర్యలను జాతీయ విధానాలు, వ్యూహాలు, ప్రణాళికలలో సమగ్రపరచడం; వాతావరణ మార్పుల తగ్గింపు, అనుసరణ, ప్రభావ తగ్గింపు ముందస్తు హెచ్చరికపై చైతన్యం, అవగాహన పెంచడం, మానవ సంస్థాగత సామర్థ్యాన్ని మెరుగుపరచడం చేయాలని' యుయన్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో పదమూడవది తెలుపుతుంది. 2030 కల్లా ఇవి సాధించాల్సిన అవసరం ప్రపంచ దేశాల మీద ఉంది.

## సృజనాత్మకతకు అపూర్వ వేదిక థియేటర్ ఆర్ట్స్

నాటకరంగం లేదా థియోటర్ వేదికగా పలువురు నటులు, నటీమణులు, ఇతర కళాకారుల సహకార సృజనాత్మకత కళలను ప్రదర్శనలు ఇవ్వడం జరుగుతున్నది. నాటకరంగ కళాకారులు తమ నటన ప్రావీణ్యాలతో ముఖకవళికలు, సంభాషణలు, గీతాలాపనలు, సంగీతం, నాట్యాలు లాంటి పలు అంశాలకు ప్రేక్షకుల కరతాళధ్వనుల మధ్య నిర్వహిస్తూ సమాజంలో జరుగుతున్న పోకడలు, విజ్ఞాన వినోదాలు, ప్రభుత్వ పాలనలు, రాజకీయ నాయకుల పోకడలు, వ్యవస్థలో లోపాల వెలికితీతలు, సూచనలు, చైతన్య కార్యక్రమాలు లాంటివి నాటక రంగంలో సుసాధ్యం అవుతున్నాయి. ఆధునిక నాటకరంగం కూడా డిజిటల్ రంగులు అద్దుకొని పలు వినూత్న మార్పులకు ఊపిరి పోస్తున్నది. నటులు తమ నటన తో పాటు పాత్రకు తగిన వేషధారణలు, వేదిక వెనుక సందర్భోచిత పరదాలు, ఆధునిక సాంకేతిక ప్రదర్శనలు, మైమిం గ్, ఏకపాత్రాభినయాలు, తోలు బొమ్మలాటలు, సర్కస్, ఒపేరా, డిజిటల్ మీడియా లాంటివి అద్భుత రీతిలో అందంగా, వినోదాత్మకంగా, విజ్ఞానదాయకంగా, సానుకూల మార్పుల దిశగా, కళ్లు తెరిపించే విధంగా వేదికను సుసంపన్నం చేస్తూనే ఉన్నారు. 2025 ప్రపంచ నాటక దినోత్సవం ఇతివృత్తంగా నాటకరంగం సాంస్కృతిక సృజనతో ప్రపంచ శాంతి స్థాపన అనబడే అంశాన్ని తీసుకున్నారు.

ఒకరి పాత్రలో మరొకరు నటిస్తూ ప్రేక్షకులను అలరించడం లేదా ఒక అంశాన్ని ప్రజల కళ్ల ముందుంచడం, సమాజ విపరీత పోకడలను వేలెత్తి చూపడం, సకారాత్మక మార్పులను సూచించడం, విద్య వినోదాల విందులు ఆరబోయడం నాటకరంగ ప్రత్యేకతలని తెలుసు కోవాలి.

డిజిటల్ యుగంలో స్మార్ట్ ఫోన్స్, టివిలు ఇంటింటా వెలగడంతో సినిమా హాళ్లు కూడా ఖాళీగా కనిపిస్తున్నాయి. నాటక ప్రదర్శనలు అరుదైపోయాయి. నటులు, నటీమణులు మరో మార్గంలేక నటనకు స్వస్తి పలకడం లేదా సినిమారంగంలోకి వెళ్లే ప్రయత్నాలు చేయడం కొనసాగుతున్నది. నాటకరంగానికి నిధుల కొరత, ప్రభుత్వాల నిరాదరణ, కొరవడిన కళాకారులకు ప్రోత్సాహకాలు, డిజిటల్ వేదికలకు పెరిగిన ఆదరణ, ప్రజల ఆసక్తి తగ్గడం లాంటి అంశాలు థియేటర్ ఆర్ట్ రంగానికి శాపంగా మారుతున్నాయి. నాటకరంగంవైపు యువత చూపులు తగ్గడం, నాటకరంగ కళాకారులను చిన్న చూపు చూడడం, కళాభిమానులు పలుచబడడం, థియేటర్ ప్రదర్శనలకు ప్రేక్షకులు తగ్గడం లాంటివి థియేటర్ ఆర్ట్స్‌కు విఘాతాలుగా మారడం విచారకరం. మనదైన పూర్వపు నాటక కళకు డిజిటల్ రంగులు అద్ది కళాకారుల ప్రదర్శనలను ఆదరిద్దాం, విజ్ఞాన, వినోద, చైతన్యాలను పొందుదాం.

(27 మార్చి ప్రపంచ నాటకరంగ దినోత్సవం సందర్భంగా)

# ప్రజలు చెల్లించే పన్నులతో పార్లమెంట్ సభ్యుల జీతాల పెంపు



ఎస్.బాల్‌రాజ్
ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
8074246685

పార్లమెంట్ సభ్యుల వేతనాల పెంపు, రోజువారి అలవెన్స్‌లు, పెన్షన్, అదనపు పెన్షన్లు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అన్ని టీవీలలో, వార్తా పత్రికలలో, సోషల్‌మీడియాలో కోడై కూస్తుంది. ఈ నిర్ణయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి త్వ శాఖ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసి ప్రస్తుత పార్లమెంట్ సభ్యుల జీతం లక్ష రూపాయల నుండి ఒక లక్షా 24వేల కు పెంచుతున్నట్లు ప్రకటించారు. అదే విధంగా పార్లమెంట్ సభ్యులు రోజువారి అలవెన్స్‌లను రూ.2000 నుండి రూ.2500లకు పెంచ టం జరిగింది. పెన్షన్ మాజీ సభ్యులకు ప్రతినెలా రూ.25వేల చొప్పున పెన్షన్ అందుతుంటే, అందుకు 6వేలు కలిపి 31వేల రూపాయలకు పెంచటం జరిగింది. మాజీ సభ్యుల అదన పు పెన్షన్‌ను మార్పులు చేసి రూ.2000ల నుండి రూ.2500లకు పెంచి ఈ పెంచిన వేతనాలను, అలవెన్స్‌లను, పెన్షన్‌లను 01.04.2023 నుండి అమల్లోకి వస్తుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించి ప్రస్తుత పార్లమెంట్ సభ్యులను సంతోషపెట్టింది. అన్ని పార్టీలకు చెందిన పార్లమెంట్ సభ్యులు వ్యతిరేకించకుండా ఏకగ్రీవంగా ఆమోదించేది తమ వేతనాల ను మాత్రమే. పార్లమెంట్ సభ్యులకు బస్సులలో, రైళ్ళలో మరియు విమానాలలో ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యం, ఢిల్లీ నడివీధుల్లో విశాలమైన పార్లమెంట్ సభ్యుల క్వార్టర్స్‌లో విలాసవంతమైన జీవితం గడిపే అవకాశాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ కల్పిస్తున్నది.

ప్రజాస్వామ్య భారతదేశంలో పార్లమెంట్ అత్యున్నతమైనది. దానికి ఎన్నుకోబడే పార్లమెంట్ సభ్యులు ప్రత్యక్షంగా ఓటర్లతో ఎన్నుకునే వారు 543 మంది లోక్‌సభ సభ్యులు. అదే విధంగా అన్ని శాసన సభలు, విధాన సభల సభ్యులు ఎన్నుకునే రాజ్యసభ సభ్యులు కూడా పార్లమెంట్ సభ్యులే. ఇందులో ఎన్నికలో పోటీ చేసి గెలిచే ఆర్థిక స్తోమత లేక ఎంతో మంది మేధావులు, సామాజిక వేత్తలు, విద్యా వేత్తలు ఎన్నికల్లో పోటీ చేయలేక చతికిల పడుతున్నా రు. నేడు ఎన్నికల ద్వారా గెలిచే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సభ్యులు గెలవాలంటే ఎన్నికల కమీషన్ విధించిన షరతులకు, నిబంధనలకంటే అత్యధికంగా ఖర్చుచేసి ప్రత్యక్షంగా ఎన్నికవుతున్నారు. నేడు వార్డు మెంబర్ నుండి పార్లమెంట్ సభ్యుని వరకు పోటీచేసే ప్రతి అభ్యర్థి డబ్బులు ఖర్చు పెట్టవలసిందే. ఎన్నికల ప్రచారంలో ప్రచార సామాగ్రి, బ్యానర్లు, తోరణాలు, ఎన్నికల కార్యాలయాలు, కార్యకర్తలకు అన్ని రకాల సకల సౌకర్యాలను కల్పిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నికల ప్రచారం నిర్వహించాలంటే నేడు కోటీశ్వరులకు మాత్రమే అవకాశం ఉంది. మామూలు, సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎన్నికల్లో పోటీచేసి గెలిచే అవకాశం లేదు. కానీ అనేక సద్గుణాలు కల్గి, సమాజ సేవ చేస్తూ, ప్రజల వెంట ఉండి, ప్రజా సమస్యలపై అహర్నిశలు పోరాటాలు, ఉద్యమాలు చేస్తూ ప్రజలలో చైతన్యం నింపుతున్నవారు, నిజాయితీపరులు ఎన్నికల్లో పోటీచేసి గెలిచే ఆర్థిక స్తోమత లేదు. అంటే నేటి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో మనిషి ఎంత నిజాయితీపరుడైన, ఎంత విశాల దృక్పథం కల్గిన నాయకుడైన డబ్బులేనిదే ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి లేదంటే నేడు పోటీ చేసే అభ్యర్థులకు కావాల్సిన అర్హత డబ్బు మాత్రమే అనేది జగమెరిగిన సత్యం.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల తర్వాత భారతదేశం కొంతమంది కోటీశ్వర్లు అయితే, కోట్లాదిమంది పేద ప్రజ లు, కార్మికులు, దళితులు, బలహీనవర్గాలకు సంబంధించిన వివిధ వృత్తుల వారు ఒకపూట తింటే మరొకపూటకు భరోస లేని బతుకులు మెజార్టీ ప్రజలవి. ఈ మెజార్టీ ప్రజలు తమ జీవితంలో ఓట్లు వేయటం తప్ప పార్లమెంట్, అసెంబ్లీ గడప దాటే అవకాశం కూడా ఇవ్వని పాలకులు పరిపాలన చేస్తున్నారు. ఈ దుర్మార్గపు వ్యవస్థ మార్పుచెందాలి. పేదలు కూడా ప్రజాస్వామ్య పద్ధతిలో పార్లమెంటరీ పంథాలో స్వేచ్ఛగా, స్వతంత్రంగా పోటీచేసే పరిస్థితి ఉండాలి. గత సంవత్సరం జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో బిజెపి సిట్టిం గ్ ఎంపిలు 100 కోట్ల ఆస్తికి మించిన వారు 25 మంది పార్లమెంట్ సభ్యులుగా గెలిచారు. అదే విధంగా 93శాతం కొత్త పార్లమెంట్ సభ్యులలో దేశంలోనే అత్యధిక సంపద కల్గిన 10 మంది పార్లమెంట్ సభ్యులు బిజెపి పార్టీకి చెందినవారంటే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.

పార్లమెంట్‌లో 543మంది సభ్యులుంటే అందులో 504 పార్లమెంట్ సభ్యులు కోటీశ్వర్లు ఉంటే చట్ట సభలలో ఏ వర్గానికి చెందిన ప్రజలకు మేలు జరుగుతుందో ఊహించుకోవచ్చు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారికి చట్ట సభలకు ఎన్నుకోబడే స్తోమత లేదంటే 75 సం.ల స్వతంత్ర భారతదేశంలో పేదరికం పేట్రేగిపోయి కొంతమంది ధనవంతుల ఆస్తులు పెరుగుతుంటే దేశంలో సమానత్వం ఎక్కడ సాధ్యమవుతుంది. ఇది నేటి భారత దేశ ఆర్థిక పరిస్థితి. ఈ వ్యవస్థ మారాలి. పార్లమెంట్‌కు ఎన్నికవుతున్న ప్రజా ప్రతినిధులు 2014లో 82 శాతం, 2019లో 88 శాతం, 2025లో 93శాతం కోటీశ్వర్లు అయితే కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సభ్యుల వేతనాలను, పెన్షన్లను, అలవెన్స్‌లను పెంచుతున్నట్లు వచ్చిన వార్తలను చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఎందుకంటే పార్లమెంట్‌కు ఎన్నికైన ఏ ఒక్క సభ్యుడు కోటీశ్వరుని కంటే తక్కువ స్థాయిలో లేడని నివేదికలు తెలుపుతున్న విషయం విదితమే. రైతులు, రోజు పనిదొరకని కూలీలు, పనిచేస్తున్న కార్మికులు కనీస వేతనాలు లభించక శ్రమ దోపిడికి గురవుతున్న వారు, ఉద్యోగాలు దొరుకుతాయన్న ఆశతో యువత గెలిపించిన రాజకీయ పార్టీల నాయకులు అందర్నీ మర్చిపోయి తమ ఆస్తుల్ని పెంచుకోవటం, మళ్ళీ ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నించటం తప్ప మెజార్టీ ప్రజలకు చేస్తున్నది శూన్యం.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## కునాల్ కామ్రాకు రెండోసారి నోటీసులు..

### మరింత గడువుకు నిరాకరణ



**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిందేపై వివాదాస్పద వ్యాఖ్యల వివాదంలో చిక్కుకున్న స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రాకు ముంబయి పోలీసులు బుధవారం మరోసారి నోటీసు పంపారు. అధికారుల ముందు హాజరయ్యేందుకు వారం రోజులు గడువు ఇవ్వాలంటూ ఆయన తరపు లాయర్ చేసిన విజ్ఞప్తిని పోలీసులు తోసిపుచ్చారు. భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్) సెక్షన్ 35 కింద ఈ నోటీసులు జారీ చేశారు. దీనికి ముందు, మార్చి 25న ఇన్వెస్టిగేటింగ్ అధికారి ముందు హాజరుకావాలంటూ ముంబయి పోలీసులు కామ్రాకు నోటీసులిచ్చారు. అయితే, తాను షో నిర్వహించిన హాబిటాట్ కామెడీ క్లబ్‌ను శివసేన నాయకులు విధ్వంసం చేసిన మరో వీడియోను కునాల్ మంగళవారం విడుదల చేశారు. చట్టబద్ధంగా ఎలాంటి చర్యలు తీసుకున్నా విచారణకు తాను సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. తనను చంపుతామని 500కు పైగా బెదిరింపు కాల్స్ వచ్చినట్టు కూడా ఆయన తన సన్నిహితుకు తెలిపారు. ఆ కారణంగానే పోలీసుల ముందు హాజరుకు వారం రోజులు గడువు కోరినట్టు చెప్పారు.

## వివిధ దళాల్లో అమరులైన వారిపై వివక్ష తగదు

### రిటైర్డ్ సిఏపిఎఫ్ జవాన్ల గళాన్ని వినిపిస్తా : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సిఎపిఎఫ్)కు రిటైర్డ్ జవాన్ల ప్రతినిధి బృందాన్ని కలిశారు. వివిధ దళాల్లో అమరులైన వారిపై వివక్ష చూపుతున్నారని ఆందళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లోని తన కార్యాలయంలో ఆరు కేంద్ర సాయుధ పోలీసు దళాలకు చెందిన రిటైర్డ్ జవాన్ల ప్రతినిధి బృందంతో రాహుల్ భేటీ అయ్యారు. తన వాట్సాప్ ఛానెల్‌లో హిందీలో రాహుల్ పోస్ట్ చేస్తూ రిటైర్డ్ జవాన్ల స్వరాన్ని వినిపించేందుకు, వారికి న్యాయం చేసేందుకు సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేస్తానన్నారు. రిటైర్డ్ జనాన్ల డిమాండ్లపై వివరణాత్మక చర్చించామని, అయితే వారు పొందుతున్న సంక్షేమ పథకాలు, పదవీ విరమణ ప్రయోజనాలు వారు చేసిన సేవకు సరిపోవని చెప్పారు. అలాగే, వివిధ దళాల్లో అమరులైన వారిపై చూపుతున్న వివక్షత పట్ల ఆందోళన చెందుతున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. దేశ భద్రత కోసం నియమించబడిన ప్రతి జవాన్ దేశానికి గర్వకారణమని మరియు వారికి ఇచ్చే గౌరవం, సౌకర్యాలలో చూపుతున్న వివక్ష పూర్తిగా ఆమోద యోగ్యం కాదన్నారు. అన్ని దళాల నుండి అమర వీరులను సమానంగా చూడాలని, వారి కుటుంబాలకు ఒకే విధమైన ప్రయోజనాలు లభించాలని రాహుల్ రిటైర్డ్ జవాన్లకు సూచించారు.

## కేరళ, తమిళనాడు, బెంగాల్‌లకు ఎన్‌ఇపి పథకం నిధులు ఇవ్వండి

### కేంద్రానికి పార్లమెంటరీ స్థాయీసంఘం సిఫార్సు

న్యూఢిల్లీ : మూడు రాష్ట్రాలకు ప్రధానమంత్రి శ్రీస్కూల్ పథకం నిధులను విడుదల చేయకుండా స్తంభింపజేయడాన్ని పార్లమెంటరీ కమిటీ తప్పుపట్టింది. ఈ పథకాన్ని అమలు చేసేందుకు అంగీకరించని రాష్ట్రాలకు పిఎం శ్రీస్కూల్స్ నిధులను విడుదల చేయకపోవడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని పేర్కొంది. జాతీయ విద్యావిధానం–2020 (ఎన్‌ఇపి) ను అమలు చేయడానికి కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలు తిరస్కరించాయి. ఎన్‌ఇపి కింద త్రిభాషా సూత్రాన్ని సమ్మతించకూడదని నిర్ణయించాయి. ఈ విషయంలో ముఖ్యంగా తమిళనాడు రాష్ట్రం చాలా పట్టుదలగా ఉంది. ఎన్‌ఇపి–2020 పథకాన్ని సమ్మతించని రాష్ట్రాలకు నిధులు ఇవ్వకుండా వారిని ఇరకాటంలో పెట్టే పరిస్థితుల్లో పడేయడం సరికాదనీ, అందువల్ల ఈ పథకం అమలు చేయకుండా అవగాహనాపత్రంపై సంతకంచేయని రాష్ట్రాలకు సర్వశిక్ష అభియాన్ నిధులు ఆపకుండా చూసేందుకు కేటాయింపులను పునఃసమీక్షించాలని విద్య,మహిళలు,పిల్లలు,యువకులు,క్రీడలపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్థాయీసంఘం ఛైర్మన్ దిగ్విజయ్ సింగ్ పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర విద్యామంత్రిత్వశాఖకు కమిటీ తరపున ఒక సిఫార్సు చేశారు. ఈ విధంగా నిధులు కేటాయించకుండా నిలిపివేయడాన్ని పార్లమెంటరీ కమిటీ చాలా తీవ్రమైన విషయంగా పరిగణించింది. ఈ పథకం కింద కేరళ రాష్ట్రానికి రూ.859.63 కోట్లు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి రూ.1,000 కోట్లు, తమిళనాడు రాష్ట్రానికి రూ.2,152 కోట్లు కేంద్రం విడుదల చేయకుండా బకాయి పెట్టింది.

## అలహాబాద్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు అభ్యంతరం



### అత్యాచారయత్నం తీర్పుపై స్టే

### న్యాయమూర్తి అమానవీయంగా ప్రవర్తించారని ధర్మాసనం ఆగ్రహం

**న్యూఢిల్లీ:** ఒక బాలిక దుస్తులను ఊడదీసి దారుణంగా అవమానించడం అత్యాచారం కిందకు రాదని అలహాబాద్ హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు బుధవారంనాడు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తీర్పు చెప్పిన న్యాయమూర్తులపై మండిపడుతూ ఈ తీర్పుపై స్టే ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వ్యాఖ్యలు చెల్లుబాటు కాకుండా స్తంభింపజేసింది. ఇది చాలా చాలా తీవ్రమైన విషయమని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఆగస్టైన్ జార్జ్ మషీహ్‌లతో కూడిన ధర్మాసనం విమర్శించింది.ఒక మహిళ పైజమా ఊడదీసి, వక్షస్థలాన్ని తాకి అసభ్యంగా ప్రవర్తించడం అత్యాచారం కాదని కోర్టు ఇటీవల తీర్పు చెప్పింది. ఇది పూర్తిగా మందబుద్ధి,జడత్వంతో వ్యవహరించడమేననీ, అమానవీయమన వైఖరి అనీ న్యాయమూర్తిని సుప్రీంకోర్టు ధర్మాసనం విమర్శించింది. న్యాయమూర్తిపై ఈ విధమైన కఠిన పదజాలం ఉపయోగించాల్సిరావడం బాధాకరమని పేర్కొంది. అలహాబాద్ హైకోర్టు గత ఏడాది నవంబరులో ఈ కేసులో తీర్పు చెప్పకుండా నాలుగునెలలపాటు తనవద్దనే ఉంచుకుంది. ఆ తర్వాత ఈ వివాదాస్పద తీర్పును బయటపెట్టింది. కనుక న్యాయమూర్తి పూర్తిగా ఆలోచించే ఈ తీర్పు రాశారని అర్థమవుతోందని ధర్మాసనం అభిప్రాయపడింది.

ఈ కేసులో కేంద్ర ప్రభుత్వానికీ, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికీ, ఈ కేసులో విచారణకు హాజరైనవారికీ కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ తీర్పుపై తమ అభిప్రాయాలను చెప్పాలని కోరింది. ఈ కేసును పరిశీలించి చర్యలు తీసుకోవాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కోరింది. రెండు వారాల తర్వాత ఈ కేసును తిరిగి సుప్రీంకోర్టు విచారణ చేస్తుంది. హైకోర్టు ఉత్తర్వుకు వ్యతిరేకంగా తాము ఒక పిటిషన్ వేస్తామని విచారణ సందర్భంగా ఒక న్యాయవాది చెప్పారు. బాధితురాలి తల్లి తరపున తాము మరో పిటిషన్ దాఖలు చేస్తామని మరో న్యాయవాది చెప్పారు. ఈ పిటిషన్‌లపై తదుపరి విచారణ సందర్భంగా వాదనలు వింటామని సుప్రీంకోర్టు పేర్కొంది. జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా గత నవంబరులో ఈ వివాదాస్పద తీర్పు ఇచ్చారు.

''సాధారణంగా ఏ కేసులోనైనా స్టేలు మంజూరు చేసే విషయంలో ఆదరాబాదరా లేకుండా మేం కొంచెం మెల్లిగా వ్యవహరిస్తాం, కానీ ఈ కేసులో పేరాగ్రాఫ్ 21,24,26 లలో పేర్కొన్న అభిప్రాయాలు పూర్తిగా చట్టానికి తెలియని విషయాలు, పూర్తిగా అమానవీయం, మందబుద్ధివైఖరి, ఈ వ్యాఖ్యలు చెల్లుబాటు కాకుండా స్తంభింపజేస్తున్నాం'' అని ధర్మాసనం పేర్కొంది. సుప్రీంకోర్టు ఈ విషయాన్ని తనుకుతానుగా విచారణకు తీసుకుని అలహాబాద్ హైకోర్టు వ్యక్తం చేసిన అభిప్రాయాలకు తీవ్ర అభ్యంతరం తెలియజేసింది. హైకోర్టు చేసిన వ్యాఖ్యలు, వ్యక్తం చేసిన అభిప్రాయాలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా దృష్టికి రావడంతో ''మనది మహిళా భారతీయం' అని పేర్కొంటూ ఈ కేసును విచారణకు తీసుకున్నారు. మార్చి 17వ తేదీన అలహాబాద్ హైకోర్టు కేసు తీర్పు సందర్భంగా ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. నిందితులకు, ఇతరులకు ఉపశమనం కలిగించడంలో వారు ఏ విధంగానూ న్యాయపరమైన కార్యవిధాన పద్ధతులను పాటించలేదని ధర్మాసనం విమర్శించింది. ఒక మైనరు బాలికపై అత్యాచార ప్రయత్నం చేసిన ఘటనపై ట్రయల్ కోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ ఇద్దరు వ్యక్తులు అలహబాద్ హైకోర్టులో కేసు దాఖలు చేశారు. బాలిక దుస్తులు ఊడదీయడం చాలా చిన్న తప్పు అనీ, ఐతే నిందితులు ఈ కేసులో కోర్టుకు హాజరుకావడం సమంజసమేనని పేర్కొంది. తీర్పు సందర్భంగా హైకోర్టు చేసిన వ్యాఖ్యలను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ప్రస్తావిస్తూ, ఈ తీర్పును తీవ్రంగా తప్పుపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి కూడా ఈ కేసు విచారణ సందర్భంగా హాజరయ్యారు. ''ఇది చాలా చాలా తీవ్రమైన విషయం, న్యాయమూర్తి తీర్పు విషయంలో చాలా అమానవీయంగా ప్రవర్తించారు, మందబుద్ధితో వ్యవహరించారు'' అని జస్టిస్ గవాయ్ తప్పుపట్టారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అక్కడ సర్వాధికారి అనీ, ఈ విషయంలో కొన్ని చర్యలు తీసుకోవాలని ఆయన సూచనలు చేసి ఉంటే బాగుండేదనీ మెహతా అన్నారు. ''మేం ఈ తీర్పును అధ్యయనం చేశాం, పేరా 21,24, 26లలో వ్యక్తం చేసిన అభిప్రాయాలు అమానవీయంగా ఉన్నాయి'' '' ధర్మాసనం పేర్కొంది.

## తప్పుదారి పట్టించే ప్రకటనలు సమాజానికి తీవ్ర హాని

### ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి

### రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ :** తప్పుదారి పట్టించే ప్రకటనలు సమాజానికి తీవ్ర హాని చేస్తాయని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ విషయానికి సంబంధించి ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. రెండు నెలల్లోగా ఈ మేరకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ యాక్టు1954 కింద నిషేధించిన ప్రకటనలకు సంబంధించి అభ్యంతరాలపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని రాష్ట్రాలు రూపొందించాలని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం పేర్కొంది. వీటిని రెండు నెలల్లో ఏర్పాటు చేయాలని, దీని గురించి ప్రచారం కూడా కల్పించాలని స్పష్టం చేసింది. 1954 చట్టంలోని నిబంధనల అమలుపై పోలీసులకు అవగాహన కల్పించాలని ఆదేశించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనల కట్టడికి సంబంధించి గతంలో పలు సూచనలు చేసిన న్యాయస్థానం.. ప్రకటనలు జారీ చేసే ముందు కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ రూల్ 1994 ప్రకారం స్వీయ ధ్రువీకరణ తీసుకోవాలని ఆదేశించింది. ఆధునిక వైద్యవిధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పతంజలి ఆయుర్వేద సంస్థపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. అసత్య, తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇవ్వొద్దని పేర్కొంటూ ఆ సంస్థను మందలించింది. అనంతరం పతంజలి ఆయుర్వేద సంస్థ కూడా సుప్రీం కోర్టుకు క్షమాపణలు తెలియజేసింది. ఈ నేపథ్యంలో ఇటువంటి ప్రకటనల కట్టడి చర్యల్లో భాగంగా సుప్రీం తాజా ఆదేశాలు జారీ చేసింది.

## ఆరుగురు మహిళలు సహా తొమ్మిది మంది నక్సలైట్ల లొంగుబాటు

**సుక్మా :** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో తొమ్మిది మంది నక్సలైట్లు లొంగిపోయారు. వారి తలలపై రూ.26 లక్షల సమిష్టి రివార్డును మోస్తున్నారని పోలీసులు తెలిపారు. లొంగిపోయిన నక్సలైట్లలో ఆరుగురు మహిళలు ఉన్నారని సుక్మా పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ తెలిపారు. భద్రతా దళాల ఒత్తిడి పెరగడం, అంతర్గత ప్రాంతాలలో పోలీసు శిబిరాలను ఏర్పాటు చేయడంతో నక్సలైట్లు వెనక్కి తగ్గుతున్నారని ఎస్పీ తెలిపారు. మారుమూల గ్రామాల అభివృద్ధిని సులభతరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'నియాద్ నెల్లనార్ (మీ మంచి గ్రామం)' పథకం ద్వారా లొంగిపోయిన నక్సలైట్లు కూడా ఆకట్టుకున్నారని చవాన్ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులలో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్‌జిఎ) కంపెనీ నంబర్ 2 సభ్యుడు బండు అలియాస్ బండి మద్కం (22) తలపై రూ.8 లక్షల రివార్డును ప్రకటించారని ఆయన చెప్పారు. 'ఏరియా కమిటీ సభ్యులు' మాసే అలియాస్ వెట్టి కన్ని (45), పదమ్ సమ్మి (32) ఒక్కొక్కరికి రూ.5 లక్షల రివార్డును ప్రకటించారు. ఒక మహిళ, ముగ్గురు పురుషుల కేడర్లకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల రివార్డును ప్రకటించారని ఆయన చెప్పారు. 2020లో సుక్మాలో జరిగిన మింపా ఆకస్మిక దాడిలో 17 మంది భద్రతా సిబ్బంది మరణించడంతో సహా వివిధ నక్సల్ దాడుల్లో బండు పాల్గొన్నాడని ఎస్‌పి తెలిపారు. లొంగిపోయిన ఇతర కేడర్లు భద్రతా దళాలపై బహుళ దాడుల్లో కూడా పాల్గొన్నారని ఆయన చెప్పారు. చింతల్నార్ పోలీస్ స్టేషన్, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్, సిఆర్‌పిఎఫ్, దాని ఎలైట్ యూనిట్ కోబ్రా సిబ్బంది వారి లొంగుబాటులో కీలక పాత్ర పోషించారని అధికారి తెలిపారు. లొంగిపోయిన నక్సలైట్లకు ఒక్కొక్కరికి రూ. 25,000 సహాయం అందించబడింది. ప్రభుత్వ విధానం ప్రకారం వారికి పునరావాసం కల్పించబడుతుంది. 2024లో, సుక్మాతో సహా ఏడు జిల్లాలను కలిగి ఉన్న రాష్ట్రంలోని బస్తర్ ప్రాంతంలో మొత్తం 792 మంది నక్సలైట్లు లొంగిపోయారు.

## అధికారాలు గుప్పిట బిగించడం తప్ప.. స్వయంప్రతిపత్తిపై బిజెపికి నమ్మకంలేదు

### లోక్‌సభలో ప్రతిపక్షాల విమర్శ



**న్యూఢిల్లీ :** అధికారాలను గుప్పిట బిగించడం తప్ప స్వయంపత్తి అవకాశాలు ఇవ్వడంపై బిజెపికి నమ్మకం లేదని బుధవారం లోక్‌సభలో ప్రతిపక్షాలు విమర్శించాయి. గుజరాత్ ఆనంద్‌లో ఉన్న త్రిభువన్ సహకారీ యూనివర్సిటీకి ప్రతిపాదిత స్వయంపత్తిని సమకూర్చదని తెలిసినప్పటికీ, ఆ మేరకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతున్నామని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. యూనివర్సిటీకి స్వయంప్రతిపత్తి ఇవ్వాలని కేంద్రాన్ని కోరాయి. కేంద్ర సహకార మంత్రి అమిత్ షా 'త్రిభువన్ సహకారి యూనివర్సిటీ బిల్లు'ను సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ప్రతిపక్ష ఎంపీలు పాల్గొన్నారు. ఆనంద్‌లో ఉన్న రూరల్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇనిస్టిట్యూట్‌ను పైవిధంగా పేరు మార్చి యూనివర్సిటీ ప్రతిపత్తిని కోరుతూ ఈ బిల్లును ప్రతిపాదించారు. ఈ సంస్థకు ఒక జాతీయ ప్రాధాన్యం ఉందని ప్రకటించాలని బిల్లులో పేర్కొన్నారు. టిఎంసి ఎంపి సౌగత రాయ్ చర్చలో పాల్గొంటూ బిజెపి ప్రభుత్వాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. బిజెపికి స్వయంప్రతిపత్తి అనే పదంపై విశ్వాసం లేదని, అధికారాలను కేంద్రీకృతం చేయడమే ఆ పార్టీకి తెలుసుననీ విమర్శించారు. ఐతే త్రిభువన్ దాస్ పటేల్ పేరుపెట్టి ఈ సంస్థను యూనివర్సిటీగా మార్చాలన్న ప్రతిపాదనపట్ల హర్షం ప్రకటించారు. త్రిభువన్ దేశ్ పటేల్‌ను దేశ సహకార ఉద్యమపితగా ఆయన పేర్కొన్నారు. ఈ విధమైన సంస్థకు అనుమతి ఇస్తే దానిని విద్యా,పరిపాలనా,నిర్వహణావిభాగాలలో పూర్తిగా స్వయంప్రతిపత్తిని సమకూర్చాలని కోరారు. త్రిభువన్ దాస్ పటేల్ కాంగ్రెస్ పార్టీ సభ్యుడనీ, బిజెపి సభ్యుడు కాదనీ, నెహ్రూ ద్వారా ఆయన పద్మశ్రీ అవార్డు పొందారనీ గుర్తుచేశారు. సమాజ్‌వాదీపార్టీ సభ్యుడు వీరేంద్ర సింగ్ మాట్లాడుతూ, ఈ బిల్లు ద్వారా స్వయంప్రతిపత్తి సంస్థలను బలహీనపరచే ప్రయత్నం చేస్తారన్న భయ సందేహాలు వ్యక్తం చేశారు. ఈ యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌ను, ఇతర బోర్డు డైరెక్టర్లు, సభ్యులను నియమించే విషయంపై కేంద్రం ఒక స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. కాంగ్రెస్ సభ్యుడు గనిబెన్ ఠాకూర్ మాట్లాడుతూ, ఈ బిల్లు తమ గుజరాత్ రాష్ట్రానికి ఎంతో గర్వకారణమని అన్నారు. ఆనంద్ నియోజకవర్గ బిజెపి ఎంపీ మితేశ్ పటేల్ మాట్లాడుతూ, తన నియోజకవర్గంలోనే దేశ క్షీరవిప్లవం త్రిభువన్ దాస్ పటేల్ సారథ్యంలో ప్రారంభమైందని గుర్తుచేశారు. ఈనాడు అమూల్ బ్రాండ్ ప్రపంచ సహకార రంగంలో అతిపెద్ద క్షీర ఉత్పత్తుల సంస్థగా ప్రసిద్ధి చెందిందన్నారు. ఈ యూనివర్సిటీకి త్రిభువన్‌దాస్ పేరుపెట్టడం తమకు ఎంతో గర్వకారణమన్నారు. అమూల్ మొదలైనప్పుడు రోజుకు కేవలం 250 లీటర్ల పాటు మాత్రమే ఉత్పత్తి అయ్యేవనీ, ఈనాడు 60 లక్షల టన్నుల స్థాయికి ఇది చేరిందన్నారు.

## యుపిలో ముస్లింలు అత్యంత సురక్షితం

### సిఎం యోగి ఆదిత్యనాథ్



**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మైనారిటీ కుటుంబాలు అత్యంత సురక్షితంగా ఉన్నారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. హిందువులు సురక్షితంగా ఉంటే.. ముస్లింలు కూడా సురక్షితంగా ఉంటారని చెప్పారు. తానొక యోగినని.. మనుషులంతా సంతోషంగా ఉండాలన్నదే తన అభిమతమని ఆయన వ్యాఖ్యానించారు. 'ఉత్తరప్రదేశ్‌లో ముస్లింలు అత్యంత సురక్షితంగా ఉన్నారు. హిందువులు సురక్షితంగా ఉంటే.. వారు కూడా సురక్షితంగా ఉంటారు. 2017కి ముందు యుపిలో అల్లర్లు జరిగితే హిందూ దుకాణాలు కాలిపోతుండేవి. అప్పుడు ముస్లిం దుకాణాలు కూడా కాలిపోయేవి. హిందువుల ఇళ్లు కాలిపోతే.. ముస్లింల ఇళ్లు కూడా కాలిపోయేవి. కానీ, 2017 తర్వాత అంతా మారిపోయింది. ఒక యోగిగా నేను అందరి ఆనందం కోరుకుంటాను. బిజెపి అధికారం చేపట్టాక రాష్ట్రంలో మతపరమైన అల్లర్లు ఆగిపోయాయి. 100 హిందూ ఇళ్లు ఉన్న ఏరియాలో ఒక ముస్లిం కుటుంబం సురక్షితంగా ఉంటోంది. 100 ముస్లిం కుటుంబాలు ఉన్న ప్రాంతంలో ఒక్క హిందూ కుటుంబం, లేదా 50 హిందూ కుటుంబాలు సురక్షితంగా ఉంటాయా..? లేదు కదా. ఇందుకు బంగ్లాదేశే ఓ ఉదాహరణ. పాకిస్థాన్ మరో ఉదాహరణ' అని సీఎం యోగి వ్యాఖ్యానించారు.

## గేమింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై రాష్ట్రాలు చట్టాలు చేయొచ్చు

### వాటి కట్టడికి కేంద్రం కూడా చర్యలు తీసుకుంటుంది

### లోక్‌సభలో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి



**న్యూఢిల్లీ :** గేమింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌పై రాష్ట్రాలు చట్టాలు చేయొచ్చని బుధవారం కేంద్రం వెల్లడించింది. అవి రాష్ట్ర పరిధిలోని అంశాలని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో వెల్లడించారు. వీటి కట్టడికి కేంద్రం కూడా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. డిఎంకె ఎంపి దయానిధి మారన్ అడిగిన ప్రశ్నకు ఈ మేరకు మంత్రి బదులిచ్చారు. తమిళనాడు ప్రభుత్వం ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధించిందని, దీనిపై చర్యలు తీసుకోవడంలో కేంద్రం తన నైతిక బాధ్యత నుంచి తప్పించుకుంటుందా..? అని మారన్ ఘాటుగా ప్రశ్నించారు. నిషేధం విధించడానికి ప్రభుత్వానికి ఎంత సమయం కావాలని అడిగారు. ఈప్రశ్నకు వైష్ణవ్ స్పందిస్తూ ప్రభుత్వ నైతికతను ప్రశ్నించే హక్కు లేదన్నారు. ఈ అంశంపై చట్టాలు రూపొందించేందుకు రాష్ట్రాలకు రాజ్యాంగం నైతిక, చట్టబద్ధ అధికారాన్ని ఇచ్చిందని గుర్తుచేశారు. దయచేసి సమాఖ్య నిర్మాణాన్ని అర్థం చేసుకోండి అని సూచనలు చేశారు. రాష్ట్రాల పరిధిలోని అంశమే అయినా.. తమకు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 1410 గేమింగ్ సైట్లను ఇప్పటికే నిషేధించామని వెల్లడించారు. ఇదిలా ఉంటే.. ఇటీవల కేంద్రం ఆన్‌లైన్ మనీ గేమింగ్ సంస్థలపై కొరడా ఝుళిపించి సంగతి తెలిసిందే. అక్రమంగా నిర్వహిస్తోన్న వందల వెబ్‌సైట్లను ఆర్థిక శాఖ పరిధిలోని డిజిజిఐ బ్లాక్ చేసింది. ఆ గేమింగ్ సంస్థలకు చెందిన 2400 బ్యాంక్ ఖాతాలు సీజ్ చేసి, రూ.126 కోట్లను ఫ్రీజ్ చేసింది. అలాగే మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌ల పట్ల అప్రమత్తం ఉండాలని, వాటిని ఎవరూ వాడొద్దని డిజిజిఐ హెచ్చరించింది. సంస్థలను నమోదు చేయకుండా, ఆదాయాలను దాచిపెడుతూ జిఎస్‌టి ఎగవేతలకు పాల్పడుతోన్న చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై చర్యలు తీసుకున్నాం. ఐటీశాఖ సమన్వయంతో ఆ వెబ్‌సైట్‌లను బ్లాక్ చేశాం అని కేంద్రం తెలిపింది.

## బెట్టింగ్ యాప్ కేసు..

## ఛత్తీస్‌గఢ్ మాజీ సిఎం ఇంట్లో సిబిఐ సోదాలు



**రాయ్‌పూర్ :** బెట్టింగ్ కేసు వ్యవహారం మరింత ముదురుతోంది. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినందుకు గాను రెండు తెలుగు రాష్ట్రాల్లో పలువురు సినీ, సోషల్ మీడియా సెలబ్రిటీల మీద కేసులు నమోదు చేయడమే కాక విచారిస్తున్నారు. తాజాగా ఈ బెట్టింగ్ కేసు వ్యవహారంలో కీలక మలుపు చోటు చేసుకుంది. బెట్టింగ్ కేసుకు సంబంధించి సిబిఐ అధికారులు.. ఓ మాజీ ముఖ్యమంత్రి ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్నారు. మహదేవ్ బెట్టింగ్ యాప్ కేసుకు సంబంధించి సిబిఐ బుధవారం ఉదయం కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ నివాసంలో సోదాలు నిర్వహిస్తోంది. రాయ్‌పూర్, భిలాయ్‌లోని బఘేల్ నివాసాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. బఘేల్‌తో పాటు ఆయనకు అత్యంత సన్నిహితుడైన ఓ సీనియర్ పోలీసు అధికారి ఇంట్లోనూ సోదాలు జరుగుతున్నాయి. దీనిపై బఘేల్ కార్యాలయం ట్వీట్ చేసింది. 'భూపేశ్ బఘేల్.. బుధవారం కాంగ్రెస్ డ్రాఫ్టింగ్ కమిటీ సమావేశానికి హాజరవ్వడ కోసం ఢిల్లీ వెళ్లాల్సి ఉండే. ఆయన ఆ ప్రయత్నాల్లో ఉన్న సమయంలోనే సిబిఐ రాయ్‌పూర్, బిలాయ్ నివాసాల్లో సోదాలు నిర్వహించేందుకు వచ్చింది' అంటూ ట్వీట్ చేసింది. మహదేవ్ బెట్టింగ్ యాప్ కేసు విచారణలో భాగంగా.. గతంలోనే ఇడి సుమారు 2,295 వేల కోట్ల రూపాయలను సీజ్ చేసి అటాచ్ చేసింది. ఇక ఇటీవల మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి బఘేల్, అతని కుమారుడు చైతన్య నివాసంలో ఇడి అధికారులు దాడులు చేశారు. ఈ సందర్భంగా వారు 30 లక్షల రూపాయల నగదు, పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఇక తాజాగా జరిగిన సోదాలపై అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అయితే మహదేవ్ బెట్టింగ్ యాప్ కేసుకు సంబంధించే ఈ తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. సుమారు 6 వేల కోట్ల రూపాయల విలువైన మహదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణం కేసులో బఘేల్‌పై రాష్ట్ర ఆర్థిక నేరాల విభాగం కేసు నమోదు చేసింది. 2023 ఛత్తీస్‌గఢ్ ఎన్నికలకు ముందు మహదేవ్ బెట్టింగ్ యాప్ స్కామ్ వెలుగులోకి వచ్చింది. భూపేశ్ సిఎంగా ఉన్న సమయంలో బెట్టింగ్ యాప్‌ను డిజైన్ చేసేందుకు ప్రోత్సాహించారని.. ఇందుకు గాను ఆయనకు రూ.508 కోట్లు చెల్లించినట్లు యాప్ యజమాని శుభమ్ సోనీ ఆరోపణలు చేశాడు. అయితే భూపేశ్.. ఈ ఆరోపణలను ఖండించారు.



# జనరల్

STATE & REGIONAL NEWS

## బిసి రిజర్వేషన్ల అమలుకు జీఓలు తేవాలి : గుజ్జ సత్యం



**ప్రజాపక్షం/ ఖైరతాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని, ఇందుకు జీఓలు జారీ చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. ఈ బిల్లును కేంద్రానికి పంపి, రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకోవాలని చూడటం సరికాదని పేర్కొన్నారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆయన మాట్లాడుతూ బీహార్, తమిళనాడులో రిజర్వేషన్లు పెంచినప్పుడు బిల్లులు పాస్ చేయడానికి చట్టాలు చేసినప్పుడు మొదట జీవోలిచ్చి, ఉద్యోగాలు భర్తీ చేశారని గుర్తుచేశారు. తర్వాత కొందరు సుప్రీంకోర్టుకెళ్లే రిజర్వేషన్లను కొట్టివేస్తే అప్పుడు తమిళనాడు ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాజ్యాంగ సవరణ చేసిందని తెలిపారు. 295 బిసి గురుకులాలకు స్వంత భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బిసి సంఘం నేతలు నీల వెంకటేశ్, అంజి, వేముల రామకృష్ణ, భాగ్యలక్ష్మి, జెల్ల నరేందర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నేరస్తులు ఎక్కడ ఉంటారో పోలీసులకు తెలుసు : అక్బరుద్దీన్ ఓవైసి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని గంజాయి లాంటి పలు మత్తు పదార్థాల విక్రయదారులు, నేరస్తులు ఎక్కడ ఉంటారో పోలీసులకు తెలుసని, అయినా వారినిపట్టుకోవడం లేదని ఎంఐఎం శాసన సభా పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసి అన్నారు. ట్రాఫిక్ పోలీసుల వద్ద ఉన్న కెమెరాలను స్వాధీనం చేసుకుని, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ''హోం, విద్యుత్, రెవెన్యూ, పౌరసరఫరాలు, నీటిపారుదల, గృహ నిర్మాణం, సమాచార, సాంకేతిక, ప్రణాళిక'' శాఖలకు చెందిన పద్దులపైన శాసనసభలో బుధవారం జరిగిన చర్చలో అక్బరుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు మామ్ముళ్లకు అలవాటుపడ్డారని, పోలీస్ స్టేషన్ నిర్మాణ నిమ్మితం పోలీసులు తనను ఆర్థిక సహాయం అడిగితే తాను తిరస్కరించానని వివరించారు. రాష్ట్రంలో 29.8 శాతం అత్యాచారాలు పెరిగాయని, అగ్నిమాపక శాఖ నిబంధనలను పాటించడం లేదని ఆరోపించారు.

## ప్రకటనల పేరిట బిఆర్‌ఎస్ ప్రభుత్వం దోపిడీ

రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజల సొమ్మును ప్రకటనల పేరుతో కొల్లగొట్టిందని, ఆ పార్టీ సొంత పత్రికలు, మీడియాకు ధారాదత్తం చేసిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శాసనసభలో బుధవారం సమాచార పౌరసంబంధాల శాఖ పద్దులపై జరిగిన చర్చకు మంత్రి సమాధానమిచ్చారు. గడిచిన పదేళ్లలో ప్రకటనల కోసం ఖర్చులలో బిఆర్‌ఎస్ సొంత మీడియా నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, టిన్యూస్‌లకు ఎంత ఖర్చు పెట్టారన్న దానిపై సమాచార శాఖ మంత్రిగా బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. గత ప్రభుత్వ పదేళ్ల హయాంలో రూ.564.40 కోట్లను తెలంగాణేతర రాష్ట్రాలలో ఖర్చు చేసి పేదల సొమ్మును సొంత ప్రచారానికి వాడుకుందని మంత్రి తెలిపారు. అంతేగాక వేలాది కోట్ల రూపాయిలను ఖర్చుచేసి సొంత మీడియాకు పంచిపెట్టిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కేవలం తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే 16 నెలల వ్యవధిలో సుమారు రూ.200 కోట్లు ఖర్చు చేసిందన్నారు. 2014లో ప్రారంభమైన నమస్తే తెలంగాణ పత్రికకు కాలం సెంటీ మీటర్‌కు రూ.875గా ఉండేదని, తర్వాత 2016లో అది రూ.1150 లకు చేరిందని, 2019లో రూ.1500 లకు పెంచేశారని తెలిపారు. ఇదే సమయంలో అత్యధిక సర్క్యులేషన్ కలిగిన ఈనాడు పత్రిక టారిఫ్ రూ.1500 లుగా ఉందని, దీనిని బట్టి ప్రజాధనం ఏవిధంగా గత ప్రభుత్వం సొంత పత్రికకు ఇచ్చిందో అర్థమవుతుందన్నారు. ఈనాడుకు నమస్తే తెలంగాణకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని మంత్రి అన్నారు. ఇక తెలంగాణ టుడే అనే బిఆర్‌ఎస్ సొంత ఆంగ్ల పత్రికకు 2017లో కాలం సెంటీమీటర్ రూ.1000 ఉండగా, కేవలం 2 ఏళ్ల వ్యవధిలో 2019లో ఈ రేటును రూ.2000 లకు పెంచారని, ఇదే సమయంలో టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక టారిఫ్ రూ.1000 మాత్రమేనని మంత్రి వివరించారు. ఇక్కడ కూడా ఎంత దోపిడీ జరిగిందో గమనించాలన్నారు. ఇక టీవీ ప్రకటనల విషయానికి వస్తే టిఛానల్‌కు సెకనుకు రూ.3000 లుగా రేటు నిర్ణయించారని అదే ఈటీవీకి రూ.2500 ఎన్‌టివికి రూ.3000 లుగా ఉందని తెలిపారు. ఈ రేట్లను గమనిస్తే ప్రజల సొమ్మును బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎలా దుర్వినియోగం చేసిందో సుస్పష్టమవుతుందన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు ఎనిమిదో.. ప్రపంచ వింత అని ప్రచారం చేయించారు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టును ఎనిమిదో ప్రపంచ వింతగా పెయిడ్ ప్రచారం చేయించారని, ఆ ప్రాజెక్టుకు బిఆర్‌ఎస్ అధినేత కెసిఆరే ఇంజనీర్ అని బిజెపి సభ్యులు పాల్వాయి హరీశ్ బాబు విమర్శించారు. శాసనసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. శాసనసభలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లూజ్ సాయిల్, లూజ్ ఫౌండేషన్ మీద కాళేశ్వరాన్ని నిర్మించడం పెద్ద తప్పని హరీశ్ బాబు అన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అప్పటి సిఎం, సాగునీటి పారుల శాఖమంత్రిపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ల స్థలాలు సమస్య పరిష్కరించాలని కోరారు. హెల్త్ ఇన్సూరెన్స్ ఉండేదని, హెల్త్ కార్డులు నిమ్స్‌లో తప్ప ఎక్కడ పనిచేయడం లేదన్నారు. క్యాష్ లెస్ హెల్త్ కార్డులు జర్నలిస్టులకు ఇవ్వాలని కోరారు.

**ధరణితో పేదల భూములు లాక్కున్న బిఆర్‌ఎస్ నేతలు :**

**డాక్టర్ సంజీవ్ రెడ్డి :** గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారని కాంగ్రెస్ సభ్యులు డాక్టర్ సంజీవ్ రెడ్డి అన్నారు. ధరణిలో ఉన్న భూమికంటే తక్కువ విస్తీర్ణంలో చూపిస్తుందన్నారు.

**ఎంఎంటిఎస్ అత్యాచారయత్నం నిందితున్ని అరెస్ట్ చేశాం :**

**మంత్రి పొన్నం ప్రభాకర్ :** ఎంఎంటిఎస్‌లో అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మీరు రాకముందు(బిఆర్‌ఎస్) పోలీసింగ్ నక్సలైట్ వ్యవస్థ శాంతి భద్రతల విషయంలో పకడ్బందీగా వ్యవహరించామన్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి లేవనెత్తిన అంశాలపై మంత్రి సమాధానం ఇచ్చారు. మీరు ప్రజా ఉద్యమాలను అణిచివేస్తూ తెలంగాణ ధర్నా చౌక్‌ను ఎత్తివేస్తూ నిర్బంధాలు, నియంతృత్వం చేశారని పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్, నేరస్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. పలు జిల్లాల్లో సెక్షన్ 30 పెట్టి నిర్బంధాలు చేశారన్నారు. 201423 మధ్య జరిగిన బదిలీలు, 2023 నుండి ఇప్పటి వరకు జరిగిన బదిలీలు సభ ముందు పెడుతామన్నారు.

## 2న ఢిల్లీలో బిసిల పోరుగర్జన

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** బిసిల హక్కుల సాధన, 42 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదానికి ఏప్రిల్ 2వ తేదీన ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో 'బిసిల పోరు గర్జన'ను నిర్వహించనున్నట్లు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ఈ పోరు గర్జనకు రాష్ట్రం నుంచి అన్ని రాజకీయ పార్టీలను, బిసి కుల సంఘాల నేతలను ఆహ్వానించామని తెలిపారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఢిల్లీ గడ్డ దద్దరిల్లేలా బిసిలు సమాయత్తం కావాలని కోరారు. బిసి కుల సంఘాల విస్తృతస్థాయి సమావేశం బిసి కుల సంఘాల జెఎసి ఛైర్మన్ కుందారపు గణేశ్‌చారి అధ్యక్షతన బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. సమావేశంలో కాంగ్రెస్ మాజీ ఎంపి వి.హనుమంత రావు, సంఘం కన్వీనర్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, వేముల వెంకటేశ్, ప్రొఫెసర్ భాగయ్యల తదితరులు పాల్గొన్నారు. జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ బిసి జాతి ప్రయోజనాల పరిరక్షణ కోసం రాజీపడబోమని స్పష్టం చేశారు. బిసి బిల్లులో ముస్లింలు ఉన్నందున దానిని ఆమోదించబోమని కేంద్రమంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించడాన్ని తప్పుపట్టారు. జనాభా దామాషా రిజర్వేషన్లు అందని ఒకే ఒక్క జాతి బిసి కులామేనన్నారు.

# ఏప్రిల్ నెలలో భూభారతి



గత ప్రభుత్వ భూలావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తాం

శాసనసభలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్రంలో గత పదేళ్లలో ముఖ్యంగా ధరణి పోర్టల్ ఆర్ఒఆర్ చట్టం 2020 ద్వారా తెలంగాణ ప్రజలు పడుతున్న కష్టాలు, బాధల నుంచి శాశ్వత విముక్తి కల్పించేలా దేశానికి రోల్ మోడల్‌గా ఉండేలా 'భూ భారతి' చట్టాన్ని అతి త్వరలో ఏప్రిల్ నెల నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. శాసనసభలో బుధవారం రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ పద్దులపై జరిగిన చర్చకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు కొత్త సమస్యలను తెచ్చిపెట్టిన ధరణిని అధికారంలోకి వస్తే బంగాళాఖాతంలో కలుపుతామని ఆనాడు తమ నాయకులు రాహుల్ గాంధీ, టిపిసిసి అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి, సిఎల్‌పి నాయకునిగా భట్టి విక్రమార్క ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుని మరి కొన్ని రోజుల్లో ధరణిని బంగాళాఖాతంలో వేసి, ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన భూభారతి చట్టాన్ని ఏప్రిల్ నెల నుంచి అమలులోకి తీసుకురానున్నామని తెలిపారు. అసెంబ్లీలో ఇచ్చిన మాట ప్రకారం భూభారతి చట్టం అసెంబ్లీ నుంచి గవర్నర్ ఆమోదం పొందిన మూడు నెలల్లోనే విధివిధానాలను రూపొందించి చట్టాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే తుది అంకానికి చేరిందన్నారు. సచివాలయంలో కూర్చొని రూల్స్ ఫ్రేమ్ చేయకుండా విస్తృత స్థాయిలో అధికారులు, మేధావులు, అనుభవజ్ఞుల సలహాలు సూచనలు తీసుకొని అందరి అభిప్రాయాలను క్రోడీకరించి పకడ్బందీగా భూ భారతి చట్టాన్ని తయారు చేసినట్టుగానే విధివిధానాలను కూడా రూపొందించామన్నారు. ఎలాంటి విధివిధానాలు తయారు చేయకుండానే 2020 ఆర్ఒఆర్ చట్టాన్ని ఆనాటి ప్రభుత్వం అమలులోకి తీసుకురావడంతో ఎదురైన ప్రతికూల పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని విధివిధానాలను రూపొందించామన్నారు. శాసనసభలో చెప్పిన విధంగా గత ప్రభుత్వంలో జరిగిన భూలావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ ను విధివిధానాలతో ప్రజల ముందుకు రానుందని మంత్రి చెప్పారు.

**గ్రామాలలో రెవెన్యూ సేవల పునరుద్ధరణకు చర్యలు :** గత ప్రభుత్వం అర్ధరాత్రి విఆర్ఒ, విఆర్ఎ వ్యవస్థను రద్దు చేసి వారిని రోడ్డుపాలు చేసి, గ్రామీణ ప్రాంతాలలో సామాన్యులకు రెవెన్యూ సేవలను దూరం చేసిందని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రెవెన్యూ వ్యవస్థను పటిష్టపరచడానికి గ్రామాలలో రెవెన్యూ సేవల పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో 10,954 రెవెన్యూ గ్రామాలలో రెవెన్యూ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు గ్రామ పాలన అధికారులను నియమించడానికి కార్యాచరణను రూపొందించామన్నారు. ఇప్పటికే ఈ పోస్టులను మంజూరు చేశామని, విఆర్ఓ , విఆర్ఎ వ్యవస్థలో ఇంటర్మీడియట్ ఆపైన చదివిన సుమారు 6000 మంది విఆర్ఒ, విఎఒ వ్యవస్థలోకి రావడానికి ఆప్షన్ ఇచ్చామని, వీరికి ఒక పరీక్ష నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

**పైలట్ కింద 70,122 ఇండ్లు మంజూరు :** పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 562 గ్రామాల్లో 70,122 ఇండ్లను 2025 జనవరి 26న ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశామని మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 6,131 ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయని, మిగిలిన ఇళ్ల గ్రౌండింగ్ పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. నాలుగు దశల్లో ఇందిరమ్మ ఇండ్లకు చెల్లింపులు జరుపుతామన్నారు. గత ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల దగ్గర కనీసం మౌలిక సదుపాయాలను విస్మరించిందని, నీళ్ళు ఉంటే కరెంట్ లేదు, కరెంట్ ఉంటే డ్రైనేజ్ లేదు ఇలా అన్నీ సమస్యలేనని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.196 కోట్లతో ఆ కాలనీలలో మౌలిక సదుపాయాలను కల్పించడానికి చర్యలు చేపట్టిందన్నారు.

**లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం :** ప్రతి మండలం, పట్టణంలో భూ విస్తరణ, భూ లావాదేవీలను బట్టి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5500 నుంచి 6000 లైసెన్స్‌డ్ సర్వేయర్లను అందుబాటులో ఉంచనున్నట్లు మంత్రి తెలిపారు. సర్వేయర్ల కోసం విఆర్ఓ, విఎఒల నుంచి స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకున్న దాదాపు 300 మందికి టెస్టు నిర్వహించి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

**సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునీకరణ :** రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు సమర్థవంతంగా సులువుగా, పారదర్శకంగా, అవినీతిరహితంగా మరింత మెరుగైన సేవలను అందించడానికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునీకరిస్తున్నామని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మొదటి దశలో పైలట్ ప్రాజెక్టు కింద సుమారు 17 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ కోసం 45 నిమిషాల నుంచి గంటకు పైగా సమయం పడుతుందని, ఎవరూ ఎదురు చూడవలసిన పరిస్థితి లేకుండా ప్రజల అమూల్యమైన సమయం వృధా కాకుండా ఈ స్లాట్ బుకింగ్ విధానంలో 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగుస్తుందన్నారు.

# సోలార్, విద్యుత్ ప్లాంట్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు

భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీటి పారుదల ప్రాజెక్టుల వద్ద ఖాళీగా ఉన్న స్థలాలతో పాటు, వాటర్ బాడీలో ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లను, సింగరేణి బొగ్గు బావుల్లో పంపుడ్ స్టోరేజ్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నామని డిప్యూటీ సిఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో ఊహించని రీతిలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ అవసరాలను తీర్చడానికి ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, పలు సంస్కరణలు చేపట్టేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. ప్రస్తుత ఏడాది మార్చి నెలలో 17,162 మెగావాట్ల విద్యుత్ పిక్ డిమాండ్‌కు పెరిగినప్పటికీ, ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కరెంటు ట్రిప్పు, కోతలు లేకుండా నిరంతరంగా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్నామని వివరించారు. విద్యుత్ పద్దుపైన శాసనసభలో బుధవారం జరిగిన చర్చలో పలువురు సభ్యులు ప్రస్తావించిన అంశాపైన భట్టి విక్రమార్క సమాధానమిచ్చారు. 2021 నాటికి 13,668 మెగావాట్ల పిక్ డిమాండ్ ఉండగా, 202122 నాటికి 14,160 మెగావాట్ల పిక్ డిమాండ్‌కు చేరుకున్నదని, 2022–23 నాటికి 15,497 మెగావాట్ల పిక్ డిమాండ్‌కు పెరిగిందని వివరించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్డు మధ్యన క్లస్టర్స్ ఏర్పాటు, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, హైటెక్ సిటీ పరిధిలో విస్తరిస్తున్న ఐటి సెక్టర్, రాష్ట్రానికి కొత్తగా వస్తున్న డేటా సెంటర్స్ ఏర్పాటుతో భవిష్యత్తులో రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు మరింత పెరుగనున్నాయని తెలిపారు. 2029–30 నాటికి గరిష్ట డిమాండ్ 24,215 మెగావాట్లు, 2034–35 నాటికి 31,809 మెగావాట్ల గరిష్ట డిమాండ్ పెరుగుతుందని, కేంద్ర అంచనాల మేరకు విద్యుత్ ఉత్పత్తి, ట్రాన్స్‌మిషన్, డిస్కంల బలోపేతానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రాజస్థాన్‌లో విద్యుత్ శక్తి ఉత్పత్తికి సింగరేణి ఆధ్వర్యంలో సోలార్, థర్మల్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయడానికి అక్కడి ప్రభుత్వంతో పరస్పర ఒప్పందం చేసుకున్నామని, అలాగే హైడల్ పవర్ ఉత్పత్తి చేయడానికి మరో పొరుగు రాష్ట్రంతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నదన్నారు. 2021 నాటికి యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి అందుబాటులోకి రావాల్సి ఉండగా పర్యావరణ అనుమతులు రాకపోవడంతో అనుకున్న సమయానికి ఉత్పత్తి రాలేదని, తాము అధికారంలోకి రాగానే పర్యావరణ అనుమతుల కోసం అక్కడి కలెక్టర్ ద్వారా పబ్లిక్ హియరింగ్ తీసుకొని పర్యావరణ అనుమతులు తెచ్చి యూనిట్ 2ను ప్రారంభించి, ఉత్పత్తిని అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. వైటిపిఎస్‌కు సింగరేణి నుంచి బొగ్గు రవాణా చేయడానికి కావాల్సిన వ్యవస్థ కూడా లేకపోవడంతో తాము అధికారంలోకి వచ్చిన తర్వాతనే క్యాలెండర్ ఫిక్స్ చేసి ప్రతివారం సమీక్ష చేసి, రైల్వే పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి, బొగ్గు సరఫరా చేసే రైలు ప్రారంభించామని గుర్తు చేశారు. శంకర్‌పల్లిలో బ్యాటరీ విద్యుత్ నిలువలు పెంచడానికి టెండర్లు ఆహ్వానించామని, 500 మెగావాట్లు బ్యాటరీ విద్యుత్ ఉత్పత్తి నిలువలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ తట్టుకునే విధంగా ట్రాన్స్‌మిషన్ సబ్ స్టేషన్‌లను బలోపేతం చేశామని, వాటిని అభివృద్ధి చేసుకోవడంతో ప్రస్తుతం ట్రిప్ కాకుండా కరెంటును నిరంతరంగా సరఫరా చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో ఒక కోటి 94 లక్షల 61వేల 511 విద్యుత్ కనెక్షన్లు ఉండగా 29 లక్షల 14 వేల 692 వ్యవసాయ కనెక్షన్లకు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని, ఇందుకు రూ. 11,500 కోట్లను డిస్కములకు చెల్లించామని భట్టి తెలిపారు. మహిళలకు వడ్డీ లేకుండా రుణాలు ఇవ్వడంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయడానికి కావాల్సిన సహకారం అందించి,వారు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేసి, ఆ లాభాలతో మహిళలు ఆర్థికంగా నిలుదొక్కుకునేలా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వం కుసుం పథకాన్ని వాడుకోకుండా నిర్లక్ష్యం చేసిందని, తాము అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాసి , ఈ పథకాన్ని వాడుకోవాలని ముందుకు వెళ్తున్నామని భట్టి తెలిపారు. పోడు సాగు చేసే గిరిజనులకు ఇందిరా గిరి వికాసం పథకాన్ని అమలు చేసేందుకు బడ్జెట్ లో రూ.12,500 కోట్లను కేటాయించామన్నారు. ఆదివాసీ, గిరిజనులు సాగు చేసుకునేందుకు వీలుగా వ్యవసాయ మోటార్లకు సోలార్‌ను ఏర్పాటు చేయబోతున్నామని, డ్రిప్స్, స్ప్రింకర్స్ ఇచ్చి హార్టికల్చరల్ పంటల సాగును ప్రోత్సహిస్తామని తెలిపారు.

## భూభారతిలో కాస్తు కాలం ఉండాల్సిందే

సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** ప్రభుత్వం కొత్తగా తీసుకువస్తున్న భూభారతిలో కాస్తు కాలం ఉండాల్సిందేనని సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు. శాసనసభలో బుధవారం రెవెన్యూ పద్దుపై జరిగిన చర్చపై ఆయన మాట్లాడుతూ ధరణి అనేది గతంలో తెలంగాణకు పట్టిన పేనుభూతమని, దాని వల్లే ఆ ప్రభుత్వం పడిపోయిందన్నారు. గతంలో ధరణిలో కాస్తు కాలం లేకపోవడం వల్లే పేదలకు తీవ్ర అన్యాయం జరిగిందని గుర్తు చేశారు. భూభారతిలో సైతం అనుభవదారుల కాలం ఉండకపోతే మళ్లీ ఆ హక్కులన్నీ జామిదార్లకు వెళ్లిపోతాయని, దీంతో రైతు భరోసా అన్ని వారి ఖాతాల్లోనే పడుతాయని, అందుకే భూ భారతిలో ఖచ్చితంగా కాస్తు కాలం ఉండాల్సిందేనన్నారు. సాదా బైనామాలకు సంబంధించి గత ప్రభుత్వం కొన్నింటిని క్రమబద్ధీకరించిందని, మిగితావి ఈ ప్రభుత్వం పూర్తి చేయాలన్నారు. కౌలు రైతులకు సంబంధించి రక్షణ చర్యలు తీసుకోవాలని, వారికి గతంలో మాదిరిగా కార్డులను అందజేయాలని కోరారు. ఎన్నికల సమయంలో బదిలీ చేసిన తహసిల్దార్లు, డిప్యూటీ తహసిల్దార్లను తిరిగి వారి స్థానాల్లోకి బదిలీ చేయాలని కూనంనేని సూచించారు. గిరిజనలకు సంబంధించిన భూమి సమస్యలను పరిష్కరించాలని, 58 జిఓ కింద పేదలకు ఉచితంగా 59 జిఓ కింద నామామాత్రం రుసుంతో భూములను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి ప్రాంతంలో 76 జిఓను త్వరితగతిన అమలు చేయాలని, పేదల అసైన్‌మెంట్ భూములను వారికి ఇవ్వాలని, ఇప్పటికే ఆ భూములను పేదలకు అమ్ముకుంటే వారికే చెందే విధంగా హక్కులు కల్పించాన్నారు. భర్తీ చేయనున్న 1000 డిప్యూటీ సర్వేయర్లు పోస్టులు అర్హులైన విఆర్ఓలను కేటాయించాలని, 61 ఏళ్ల దాటిన 3600 మంది విఆర్ఎ పిల్లలు పనిచేస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రేషన్‌కార్డు లబ్దిదారులకు సన్న బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులతో కూడిన కిట్‌ను అందజేయాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు. డిస్కామ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బకాయిలు చెల్లించాలని, లేకపోతే భవిష్యత్‌లో వాటి మనుగడ ప్రశార్థకం అవుతుందని కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో విద్యుత్ సంస్థలకు రూ.52వేల కోట్లు అప్పులు ఉన్నాయని చెప్పగా, ఇందులో ట్రాన్స్‌కోకు రూ.24,476 కోట్లు, జెన్‌కోకు రూ.53,963 కోట్లు, డిస్కామ్ రూ.59,132 కోట్ల ఆస్తులు కూడా ఉన్నాయన్నారు. అయితే ప్రభుత్వ వివిధ శాఖల నుంచి ,ఈ మూడు సంస్థలకు రూ. 60 వేల కోట్లు అప్పులు రావాల్సిండగా సింగరేణికి, జెన్‌కోకు రూ.30 వేలకోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. వీటిని క్లియర్ చేయడం ద్వారా ఈ సంస్థలు స్వయం సమృద్ధితో నడిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో గృహ నిర్మాణానికి సంబంధించి అర్హుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఉండాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇందుకు గ్రామ సభల ద్వారా ఎంపిక చేయడమే సరైన మార్గమని చెప్పారు. ఎంఎల్ఎలు సిఫార్సు చేసిన వారైన సరే గ్రామ సభల్లో పెట్టి వారు అర్హుల్లో కాదో తెల్చాల్సిన అవసరముందన్నారు. ఇటీవల జరిగిన సర్వేలో కొంత మంది భవనాలు ఉన్న వ్యక్తులు సైతం పూరి గుడిసెల ముందు నిలబడి ఫొటోలు దిగిన ఘటనలు కూడా ఉన్నాయని, నిజమైన అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు రావాలంటే గ్రామ సభల ద్వారా ఎంపిక చేయడం సరైన మార్గమని కూనంనేని సూచించారు.

చాలా చోట్ల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఉన్నాయని వాటిని గతంలో కేటాయించిన వారికి అందజేయాలన్నారు. జర్నలిస్టుల జీవన ప్రమాణాలపై అధ్యయనం చేసి నగరాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే జర్నలిసులకు ఇళ్లు, వారి పిల్లల చదువులు, ఆరోగ్యంకు సంబంధించి ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని కోరారు. పేదవాళ్లకు ఇచ్చే ఇళ్లలో జర్నలిస్టులకు ఇళ్లు ఇవ్వాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించిన నేపథ్యంలో జర్నలిస్టుల కోటాలో కాకుండా పేదలకు ఇస్తున్న మాదిరిగానే వారికి ఆ స్థలాలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.




## మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

ఎఐటియుసి డిమాండ్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** మిషన్ భగీరథ స్కీములో పనిచేస్తున్న దాదాపు 17వేల మంది కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఎఐటియుసి ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. హిమాయత్ నగర్ లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) సమావేశం రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదరిర్శ ఎం నరసింహ మాట్లాడుతూ.. మెగా కన్‌స్ట్రక్షన్, ఎల్ అండ్ టి కంపెనీ ఎలాంటి పెద్ద పెద్ద కంపెనీలు మిషన్ భగీరథ స్కీములో ఉన్నప్పటికీ వీరు రాష్ట్రంలో ఉన్నటువంటి ఏ కనీస వేతనాల జీవోను కూడా అమలు చేయకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఈ సంస్థలో పంప్ ఆపరేటర్లు, లైన్‌మెన్లు, హెల్పర్లు, పిట్టర్లు, ఎలక్ట్రిషన్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, వాచ్‌మెన్లు, స్వీపర్లు అతి తక్కువ వేతనాలకు పనిచేస్తున్నారని.. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 60 ప్రకారం వీరికి జీతాలు చెల్లించాలని గత అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నా కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్య ధోరణి వల్ల నేటికి కూడా కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడంలేదని వారు విమర్శించారు. మిషన్ భగీరథ స్కీం ప్రారంభమైనప్పుడు కన్‌స్ట్రక్షన్, మెయింటెనెన్స్ ప్రకారం జీతాలు ఇచ్చేవారని కన్‌స్ట్రక్షన్ పూర్తయినందున మెయింటెనెన్స్ మాత్రమే జరుగుతున్నందువలన కనీస వేతనాల జీవోలు అమలు చేయకుండా కేవలం కన్‌స్ట్రక్షన్ జీవోలను మాత్రమే అమలు చేస్తూ కార్మికులకు తక్కువ జీతాలు చెల్లిస్తున్నారని వారు తెలియజేశారు. కాంట్రాక్టు చట్టం ప్రకారం పండగ సెలవులు, జాతీయ సెలవులు, ఆర్జిత సెలవులు, వారాంతపు సెలవులు, పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్, గ్రాట్యుటీ లాంటి ఏ కార్మిక చట్టాలను కూడా అమలు చేయకుండా కాంట్రాక్టు సంస్థలు శ్రమదోపిడిని కొనసాగిస్తున్నాయని వారు అన్నారు. కార్మిక సమస్యలు పరిష్కారం కాకపోతే రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా వారు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఎం రఘు, సి.శేఖర్, టి సత్యనారాయణ, పి.శ్రీనివాస్, ఎం.ప్రభాకర్ రెడ్డి, ఎండి జానీ, ఎస్ రాంప్రసాద్, పాషా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వెయ్యి జన్మలు ఎత్తినా బిఆర్‌ఎస్ మరోసారి అధికారంలోనికి రాదు

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వెయ్యి జన్మలు ఎత్తినా బిఆర్‌ఎస్ మరోసారి అధికారంలోనికి రాదని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆరుగురు కాంగ్రెస్ ఎంఎల్‌ఎలను సభలో మాట్లాడనివ్వకుండా బయటికి పంపించారని,అప్పుడు బిఆర్‌ఎస్‌కు ప్రజాస్వామ్యం గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. ''హోం, ఇంధనం,''పద్దులపైన శాసనసభలో బుధవారం జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి మంచోడు కాబట్టే బిఆర్‌ఎస్ నాయకులు ఇంకా ప్రశాంతంగా ఫామ్ హౌజ్‌లో ఉన్నారని,లేదంటే.. నిన్నటి దాకా ఒక లెక్క ఇప్పటి నుంచి మరో లెక్క అనే పరిస్థితి ఉండేదని అన్నారు. బిఆర్‌ఎస్ పాలన అహంకారంతో సాగిందని,తప్పుడు నిర్ణయాలు తీసుకుని, రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ పదేళ్ల పాలన అధికార దుర్వినియోగానికి ఒక ఉదాహరణలాంటిదని చెప్పారు.

పోలీస్ అధికారులు కూడా బిఆర్‌ఎస్ అధికార దాహానికి బలయ్యారని, విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. తమ ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించారు. అప్పుడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి, రాష్ట్రంలో ప్రతిపక్షమే లేకుండా చేశారని, ఇప్పుడు వారు నీతులు చెబుతున్నారని దుయ్యబట్టారు. సైరన్ సప్పులకు బిఆర్‌ఎస్ నాయకులు బాగా అలవాటు పడ్డారని, ఆ సప్పుడు లేక వారికి ప్రస్తుతం నిద్ర పట్టడం లేదని ఎద్దేవా చేశారు.

## నూతన పరిశ్రమల మంజూరుకు చర్యలు



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: నూతన పరిశ్రమల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని గుర్తించి వారికి మంజూరి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిఐపిసి, టిఎస్ ఐపాస్ సమావేశం సంబంధిత అధికారులతో నిర్వహించారు. పలు పరిశ్రమల కు సంబంధించిన అనుమతుల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరి 1 నుండి నేటి వరకు 14 పరిశ్రమల కోసం దరఖాస్తులు అందాయని రూ. 109.30 కోట్ల పెట్టుబడులతో స్థాపించేం దుకు వివిధ శాఖల నుండి అనుమతుల కోరకు దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. వీటి ద్వారా 500 మందికి ఉపాధి కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఓ వివి అప్పారావు, డిపిఓ యాదగిరి, ఎంవిఐ ప్రకాష్ రెడ్డి, పిసిబి రామకృష్ణ, సిటిఓ యాదగిరి, ఎల్‌డిఎం బాపూజీ, పిడిఎస్‌సి కార్పొరేషన్ శ్రీనివాస్ నాయక్, డిటిసి శంకర్‌లు పాల్గొన్నారు.

## యుడిఐడి కార్డులపై అవగాహన



ప్రజాపక్షం/యాదాద్రి : జిల్లా మహిళా శిశు వికలాంగుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ , జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ల ఆధ్వర్యంలో దివ్యాంగులకు యుడిఐడి కార్డుల పై మినీ మీటింగ్ హాల్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరసింహ రావు మాట్లాడుతూ దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ కేవలం రాష్ట్ర స్థాయి పథకాలలో ప్రయోజనాలు అందుతున్నాయని ఇప్పుడు యుడిఐడి కార్డు తీసుకోవడం వల్ల కేంద్ర , రాష్ట్ర స్థాయి ఫలాలు అందుకోవచ్చు అని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా గ్రామీాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు యుడిఐడి కార్డుల పై సందేహాల మీద సమాధానాలు తెలియజేశారు. జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయ సూపరిండేంట్ శశికళ, యశోద, ఎపివో శ్రీనివాస్, రాజేశ్వ రి జిల్లా సంక్షేమ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## వేధింపులకు పాల్పడితే శిక్షలు తప్పవు

ప్రజాపక్షం/సూర్యాపేట: మహిళలు, బాలికల పట్ల వేదింపులకు పాల్పడితే ఎంతటివారికైన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి కె నర్సింహ హెచ్చరించారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ భరోసా సెంటర్, షీటీం కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ, బాలికల పట్ల ఎవరైన వేదింపులకు పాల్పడితే ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. భరోసా సెంటర్‌లో కౌన్సిలింగ్ నిర్వహించి వారికి తగిన సూచనలు, సలహాలు అందించారు. రికార్డులను పరిశీలించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో, పట్టణాలు, కాలనీల్లో భద్రత చట్టాల అమలు గురించి పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రద్దీ ప్రాంతాల్లో అకతాయిలపై నిఘా ఉంచాలన్నారు. లైంగిత దాడులకు గురైన మహిళలు, బాలికల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంరక్షణ చర్యలు సిబ్బందికి వివరించారు. ఎస్‌పి వెంట భరోసా సెంటర్ ఎస్‌ఐ మౌనిక, షీటీం ఎస్‌ఐ నీలిమా, ఎఎస్‌ఐలు సైదాబీ, సాలయ్య ఉన్నారు.

## ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరువు

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



ప్రజాపక్షం/చివ్వేంల: రాష్ట్రంలో వచ్చిన కరువు కాలం తెచ్చింది కాదని ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరువునే అని మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మొగ్గాయిగూడెంతో పాటు సమీపంలోని గిరిజన తండాల్లో ఆయన ఎండిపోయిన వరి పంటలను పరిశీలించారు. అక్కడ రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వ హాయాంలో కాళేశ్వరం ద్వారా సాగునీరు అందించడంతో ఈ ప్రాంత రైతులు పంటలు పండించుకొని అధిక దిగుబడి సాధించారన్నారు. మాజీ సిఎం కెసిఆర్‌పై ఉన్న కోపంతో రైతులపై కక్ష కట్టి అక్కడి నుండి నీరు అందించకుండా రైతుల పంట పొలాలు ఎండబెడుతున్నారని ఆరోపించారు. జిల్లాకు చెందిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎందుతున్న పంటలను కాపాడేందుకు ఇంకోక తడికైన నీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జీవన్ రెడ్డి, నాయకులు సత్యనారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

పదవ తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్‌పి



ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి: ఐజ పట్టణంలోని పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఉత్తనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలను సందర్శించి జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పరీక్షా సరళిని పరిశీలించారు. పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ కూడా ఏలాంటి లోపాలు లేకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, పరీక్షా సమయంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విద్యాశాఖ అధికారులతో పోలీసు అధికారులు సమన్వయం చేసుకుంటూ ఏలాంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షల నిర్వహణ ఉండాలని ఆదేశించారు. అలాగే పరీక్షా కేంద్రాలలోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకూడదని , దగ్గర్లో ఉన్న జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లను పరీక్ష పూర్తి అయ్యేంతవరకు మూసి ఉంచే విధంగా సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు.

## పరీక్షలలో ఇబ్బందులు రావొద్దు



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి : అధికారులు సమన్వయంగా కలిసి పనిచేసి పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టర్ కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్ష కేంద్రంను తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో పరీక్షా కేంద్రం చుట్టుపక్కల 144 సెక్షన్ అమలు చేసి, అన్ని జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలని ఎస్‌ఐ రామ్మూర్తికి సూచించారు. పరీక్షా కేంద్రంలో విద్యా ర్థులకు తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకేట్లు, ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేయాలని అన్నారు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ద్వారా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట దేవరకొండ ఏఎస్పి మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి, ఎంఈవో ఆర్ నాగేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

## దాతల దాతృత్వం వెలకట్టలేనిది



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: దాతల దాతృత్వం వెలకట్టలేనిదని విశ్వాస పరిచర్య ప్రార్థన మందిరం ఛైర్మన్, సామాజిక వేత్త, పాస్టర్ ధీరావత్ హన్యా నాయక్ కొనియాడారు. ఆశ్రమ చిన్నారులచే సేకరించిన 70బస్తాల బియ్యాన్ని వృద్ధులు, యాచకులు, పేదలు, వితంతువులు, వికలాంగులకు బుధవారం పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవసేవయే మాధవ సేవ అనే సూక్తిని ఆదర్శంగా తీసుకోని సమాజసేవకు శ్రీకారం చుట్టానన్నారు. సంఘ సంస్కర్తల సేవలను స్పూర్తిగా తీసుకోని తనవంతు బాధ్యతగా పేద వర్గాలకు చేయూతనందించడం జరుగుతుందన్నారు. ధనం అందరి వద్ద ఉంటుందని దాన్ని పదిమందికి పంచే గుణం కొందరికే ఉంటుందన్నారు. రమాబాయి, డేవిడ్, సుధారాణి తదితరులు ఉన్నారు.

## పండుగ వాతావరణంలో సన్నబియ్యం పంపిణీ

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: ఏప్రిల్ 1 నుండి ప్రతి పేదవారికి రేషన్ దుకాణం ద్వారా 6కిలోల నాణ్యమైన సన్న బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తుందని దీనిని ఆయా రేషన్ డీలర్లు పండుగ వాతావరణంలో పంపిణీ చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి సన్నబియ్యం పంపిణీపై రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పర్వదిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా హూజూర్‌నగర్‌లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. సూర్యాపేట రైతులు పండించిన పంట మిల్లుల్లో మర ఆడించి సన్న బియ్యంను పేదలకు పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గతంలో పంపిణీ చేసిన బియ్యంలో పోషక విలువలు తక్కువగా ఉండడంతో పాటు నాణ్యమైన బియ్యాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో 10 నుండి 15రకాల దొడ్డు బియ్యంను పండించి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి సూర్యాపేట ఎదిగిందన్నారు. ఈ ఏర్పాట్లపై పౌర సరఫరాల శాఖ అధికారులు సమీక్షించాలన్నారు. ఏప్రిల్ 1 నుండి 15తేదీ వరకు ఉదయం 8గంటల నుండి 11 గంటల వరకు సాయంత్రం 5 గంటల నుండి 8 గంటల వరకు సమయపాలన పాటిస్తూ బియ్యాన్ని పంపిణీ చేయాలని అదనపు కలెక్టర్ పి రాంబాబు డీలర్లకు సూచించారు. పంపిణీలో ఏలాంటి అవకతవకలకు పాల్పడ్డ క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్‌లు, డిటిలు, విజిలెన్స్ , టాస్క్ ఫోర్స్ అధికారులు ఆకస్మీక తనిఖీలు చేస్తారని చెప్పారు. ఈఈ కార్యక్రమంలో డిఎస్‌ఓ రాజేశ్వర్, డిఎం ప్రసాద్, సూర్యాపేట ఆర్‌డిఓ వేణుమాధవరావు, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

చక్రయ్య గౌడ్ హత్య కేసులో నిర్లక్ష్యం వహించారంటూ

## సూర్యాపేట డిఎస్‌పి రవి, తుంగతుర్తి సిఐ శ్రీను నాయక్‌పై వేటు





ప్రజాపక్షం/సూర్యాపేట: నూతనకల్ మండలం మిర్యాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు మెంచు చక్రయ్య గౌడ్ హత్య కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై సూర్యాపేట డిఎస్‌పి జి రవి, తుంగతుర్తి సిఐ శ్రీను నాయక్‌లపై ప్రభుత్వం వేటు వేసింది. నూతనకల్ ఎస్‌ఐ మహేంద్రనాథ్‌కు మెమో జారీ చేసింది. సూర్యాపేట డిఎస్‌పి రవిని రాష్ట్ర డిజిపి కార్యాలయానికి ఎటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తుంగతుర్తి సిఐ శ్రీను నాయక్‌ను ఎస్‌పి కార్యాలయానికి ఎటాచ్ చేశారు. మెంచు చక్రయ్య గౌడ్ హత్యలో కొంత మంది అధికార పార్టీ నాయకుల హస్తంతో పాటు సూర్యాపేట డిఎస్‌పి రవి, తుంగతుర్తి సిఐ శ్రీను నాయక్‌లపై ఆయన కుటుంబ సభ్యులు మొదటి నుండి తీవ్రమైన ఆరోపణలు చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం మల్టీజోన్2 ఐజి సత్యనారాయణను విచారణ చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఆయన గత వారం రోజుల క్రితం మిర్యాల గ్రామాన్ని సందర్శించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలను సేకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన చక్రయ్య గౌడ్ హత్య కేసులో తమ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని దీనిపై పూర్తి విచారణ చేసి వారిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అతను మీడియాకు చెప్పినట్లుగా వీరిపై వేటు పడింది.

## నీటి ఎద్దడి నివారణకు చర్యలు

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/చింతపల్లి : గ్రామాలలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులకు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ త్రిపాఠి బుధవారం మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. మండల కేంద్రంలో ఉన్నా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ఓపి రిజిస్టర్, సిబ్బంది హాజరు రిజిస్టర్, ఇన్, ఔట్ పేషెంట్లు, మందులు ఇతర స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించి, డాక్టర్ శ్రీదేవిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీల కాన్పు వివరాలు అడిగి, సరైన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. వంట గది సరిగ్గా లేక పోవడంతో డిఇఓ వెంటనే మాట్లాడారు. నిధులు మంజూరు చేయించి బాగు చేయిస్తామని ఆమె తెలిపారు. ఎంపిడిఓ కార్యాలయంలో తాగునీటి సరఫరా, తదితర అంశాలపై ఆర్‌డిఓ రమణారెడ్డితో కలసి అధికారులతో మాట్లాడారు. హరిజనాపురం గ్రామంలో వాటర్‌ట్యాంక్ పాతబడి పోయిందని, కుర్మపల్లి, కుర్మేడు గేటు వద్ద సమస్యలు ఉండగా ఇదివరకే డిఎంఎఫ్టి ద్వారా జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు అయ్యాయని, పనులు మొదలు పెడుతున్నామని ఏఈ తెలిపారు. హరిజనాపురం గ్రామానికి కొత్త వాటర్ ట్యాంక్ మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అప్పటి వరకు కొత్త బోరు వేసుకునేందుకు కలెక్టర్ అనుమతి ఇచ్చారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఓ రమణారెడ్డి, తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, ఎంపిడిఓ సుజాత, మిషన్‌భగీరథ ఏఈలు ఉన్నారు.

## ప్రభుత్వ వైఫల్యంతోనే ఎండుతున్న పంటలు

మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి: ప్రభుత్వ వైఫల్యంతోనే గ్రామాల్లో పంటలు ఎండిపోయాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గద్వాల నియోజకవర్గం కేటీదొడ్డి మండలం కొండాపురం, వెంకటాపురం, ఉమీత్యాల గ్రామాలకు ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి 104 ప్యాకేజ్ కింద సాగునీరు రాక ఎండిన వరి పొలాలను గద్వాల నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ నాయకులు బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో మాజీ వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరిశీలించి రైతులతో మాట్లాడి, జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, ఎస్.ఈ.రహీముద్దీన్ తో ఫోన్లో లో మాట్లాడారు. అనంతరం జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నీరు సరఫరాలో ప్రస్తుత ప్రభుత్వం రైతాంగానికి ఇబ్బందులు కల్గించడం వల్ల పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగర్‌దొడ్డి వెంకటరాములు, మాజీ గ్రంథాలయ చైర్మన్ పటేల్, విష్ణువర్ధన్ రెడ్డి, మోనేష్ అంగడి బస్వరాజు, పటేల్ జనార్ధన్‌రెడ్డి, డి.శేఖర్ నాయుడు, ఎస్.రాము నాయుడు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమమే జెండా.. ఎజెండా

టియుడబ్ల్యూజే (ఐజెయు ) రాష్ట్ర అధ్యక్షులు కె. విరహత్ అలీ



ప్రజాపక్షం/చండూరు : జర్నలిస్టుల సంక్షేమమే జెండా ఎజెండా అని టియు డబ్ల్యూ జే (ఐజెయు ) రాష్ట్ర అధ్యక్షులు కే. విరహత్ అలీ అన్నారు. బుధవారం స్థానిక రాజశ్రీ బ్యాంక్ ట్ హాల్లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేసే జర్నలిస్టులు నిత్యం ఒత్తిడి, సవాళ్లను ఎదర్కోవాల్సి ఉంటుందన్నారు. వారికి ఆరోగ్య రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విలేకరుల ఇళ్ల స్థలాల విషయమై నివేదికలు అందించినట్లు తెలిపారు. భారతదేశంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం 70 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏకైక సంఘం టియుడబ్ల్యూజే ఐజేయు అన్నారు. సంఘం ఆవిర్భవించిందే జర్నలిస్టుల సంక్షేమం కోసం అని, నాటి నుండి నేటి వరకు జర్నలిస్టులకు ఎన్నో సంక్షేమ ఫలాలు అందించడం కోసం రాజీలేని పోరాటాలు చేసిన మొనగాని సంఘముగా నేడు ఈ సంఘం ఉన్నదన్నారు. నేడు జర్నలిస్టులకు అందుతున్న అక్రిడేషన్, ఆరోగ్య భీమా, ఇండ్ల స్థలాలు మొదలైన సంక్షేమ ఫలాలు కేవలం టియుడబ్ల్యూజే ఐజేయు పోరాటాల ఫలితమేనని ఆయన తెలిపారు. ఇంకా పూర్తిగా జర్నలిస్టులకు , వారి కుటుంబాలకు యాజమాన్యాల నుండి రక్షణ లేకున్నా తమ సంఘం పోరాటాల ద్వారా జర్నలిస్టులను అన్ని విధాలుగా ఆదుకునే విధంగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటాల కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలియజేశారు. తమ సంఘం ఇచ్చే పిలుపులో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, అన్ని రకాల కమిటీలు బాధ్యతాయుతంగా పనిచేయాలని అందుకు రాష్ట్ర సంఘం నుండి అన్నివేళలా అండదండలు ఉంటాయని ఆయన తెలిపారు. జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణా రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ,జిల్లా ప్రధాన కార్యదర్శి కలిమల నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్న, దోటి శ్రీనివాసులు, జిల్లా సహాయ కార్యదర్శి కేసాని శ్రీధర్ రెడ్డి, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు యం .యాదగిరి, ప్రధాన కార్యదర్శి డి శ్రీనివాస్ రెడ్డి, నల్లగొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా యాదయ్య,వి చంద్రశేఖర్ రెడ్డి, వి వెంకట్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా నియోజకవర్గ అధ్యక్షులు ఎరుకల వంశీ, రాపోలు ప్రభాకర్, సంగేపు మల్లికార్జున్, నల్ల స్వామి, ఆడెపు శంకర్, సంగేపు మల్లేష్, రవీంద్ర చారి, ఆకుల రఘుమయ్య,కార్నాటి వెంకటేష్, ముత్యాలు, ముదుపు శ్యామ్ రెడ్డి, మహేశ్వరం సతీష్, వెంకన్న, నక్క శ్రీనివాస్, ఇడం గణేష్, జక్కల నాగరాజు, దోటి లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సరఫరా,విక్రేతలపై ఉక్కుపాదం

ఎసిపి మధుసూదన్ రెడ్డి




ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : యువత నిషేధిత గంజాయి, మాదకద్రవ్యాల బారిన పడి బానిసలై కుటుంబాలను అధోగతి పాలు చేసుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని లా అండ్ ఆర్డర్ చౌటుప్పల్ ఏసిపి మధుసూదన్ రెడ్డి యువతకు హితవు పలికారు. యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జలాల్ పురం గ్రామంలోని చెరువు కట్ట ప్రమాద మలుపు వద్ద వరుసగా జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో ఇరు మలుపుల వద్ద బుధవారం ఆయన శుభ ఫర్టిలిటీ ఎల్బీనగర్ ,మేనేజింగ్ డైరెక్టర్ గోరంటి వినయ్ కుమార్ రెడ్డి ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేసిన ప్రమాద హెచ్చరిక సూచిక బోర్డులు రెడ్ సిగ్నల్ సోలార్ బ్లింకర్స్ లైట్స్ ప్రారంభించారు. జలాల్ పురం గ్రామ బస్టాప్ వద్ద రోడ్డు డివైడర్ గా స్టాపర్స్ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రమాదాల మలుపు వద్ద చాలామంది యువకులు మద్యం డ్రగ్స్ మత్తులో నిర్లక్ష్యంగా అతివేగంతో డ్రైవ్ చేస్తూ వాహనాలు అదుపుతప్పి చెరువులో పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల నుంచి రక్త నమూనాలను సేకరించి రిపోర్టుల ఆధారంగా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొని జైలుకు పంపుతామని హెచ్చరించారు. చైల్డ్ పోర్న్ వీడియోలు డౌన్‌లోడ్ ట్రాన్స్మిట్ చేసిన ఏ వయసు వారైనా నేరమని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నాన్ బెయిలబుల్ వారెంట్ ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. అపరిచిత ఫోన్ కాల్స్‌కు స్పందించి బ్యాంకు తదితర ఓటిపి వివరాలను ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దని కోరారు. అత్యాశతో షేర్ మార్కెట్ వ్యక్తులతో పరిచయాలు చేసుకొని అధిక వడ్డీలకు ఆశ పడి భారీ ఎత్తున డబ్బులు పోగొట్టుకొని మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ట్రాఫిక్ ఏసిపి ఎం.ప్రభాకర్ రెడ్డి, సిఐ రాములు, ట్రాఫిక్ సిఐ విజయమోహన్ పోచంపల్లి ఎస్‌హెచ్‌ఓ భాస్కర్ రెడ్డి, ఎస్‌ఐ వంశీ, ఏఎస్‌ఐ సైదిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్స్ శంకర్ నాయక్, గోరంటి ప్రదీప్ రెడ్డి, పెట్టే శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## ట్యాంక్‌బండ్‌పై ధర్మభిక్షం విగ్రహం

వర్ధంతి సభలో వక్తల డిమాండ్







ప్రజాపక్షం/నల్లగొండ: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అమరజీవి బొమ్మ గాని ధర్మ బిక్షం ఆశయ సాధన కొరకు ఉద్యమించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్ పిలుపునిచ్చారు. బొమ్మగాని ధర్మభిక్షం 14వ వర్ధంతి సందర్భంగా నల్లగొండ మగ్దుమ్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభు త్వం ప్రారంభించే స్కిల్ యూనివర్సిటీలో గీత పరిమారులకు శిక్షణ నివ్వాలని ఆయన కోరారు. ధర్మంభిక్షం విగ్రహాన్ని హైదరాబాదులోని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గాదపాక రమేష్, వీ. లెనిన్ ఎం ము త్యాలు, కె ఎస్ రెడ్డి, వీరన్న,అక్కలయ్య, రామకోటి మహిళా సమాఖ్య నాయకులు పి.సుజాత, కౌసల్య, విజయ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు స్వాతంత్ర సమర యోధులు మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ ధర్మభిక్షంగారి 14వ వర్ధంతిని మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం యాదగిరిగుట్ట నందు నిర్వహించారు. వారి చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మలు మాట్లాడుతూ పేద ప్రజల యొక్క సమస్యలపై రాజులేని పోరాటాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, సిపిఐ పట్టణ కార్యదర్శి గోపగాని రాజు, మహిళా సమాఖ్య మండల కార్యదర్శి ఆరే పుష్ప పాల్గొన్నారు.

ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ మండల కేంద్రంలో ధర్మబిక్షం 14వ వర్ధంతి సిపిఐ మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధులు భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ పార్లమెంటు సభ్యులు కామ్రేడ్ బొమ్మగాని ధర్మ బిక్షం సాయిధ పోరాటంలో చురుకైన పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, బీసీ సంఘం జిల్లా నాయకులు సాయిని యాదగిరి, గీతా పనివారల సంఘం నాయకులు బొడిగె సుదర్శన్, ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సుద్దాల సాయికుమార్, మారోజు నరసిమాచారి, ఏనుగుల రాములు, మంద రాములు, భీమ గాని యాదయ్య పాల్గొన్నారు.



## విరామమెరగని విప్లవ కెరటం ధర్మబిక్షం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి

ప్రజాపక్షం/దేవరకొండ: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపి, ఎంఎల్ఏ , ప్రజల మనిషి, అనునిత్యం పేద ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి, గీతా కార్మికుల గొంతుకై నినదించిన విరామమేరుగని విప్లవ కేరటం కామ్రేడ్ ధర్మ బిక్షం అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం ధర్మబిక్షం 14వ వర్ధంతి సందర్భంగా దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో సిపిఐ, గీతా పనివారుల సంఘం ఆధ్వర్యంలో ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ గీతా పనివారల సంఘం ఏర్పాటు చేసి దున్నేవాడికి భూమి గీసేవాడికి చెట్లు కావాలని పోరాడి ఐదు ఏళ్లు జైలు జీవితం గడిపారని, కల్లు గీత కార్మికుల యొక్క అభ్యున్నతికి పాటు పడడటమేకాక బడుగు బలహీన వర్గాల కు ఎనలేని సేవలుచేసి ప్రజల్లో మార్పు తెచ్చిన చరిత్రకారుడు ధర్మభిక్షం అని కొనియాడారు. ధర్మబిక్షం యొక్క త్యాగాలు సేవలు నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారి ఆశయాలను కొనసాగించడానికి నేటి యువత కంకణ బద్ధులై ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో గీత పనివారులసంఘం డివిజన్ అధ్యక్షులు కుంభం జయరాములు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి రామస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, సిపిఐ పట్టణ కార్యదర్శి వెంకట్రాములు, ఏఐటీయూసీ డివిజన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాయకులు మైనోద్దీన్, బుచ్చయ్య, మల్లేష్, జ్యోతిబస్, వెంకటయ్య, రాజమల్లయ్య, జాకీర్, శ్రీను, బక్కయ్య, పోల్క తదితరులు పాల్గొన్నారు.



## ఉత్సవాల ఏర్పాటు పనులకు అంకురార్పన

ప్రజాపక్షం/కల్వకుర్తి : పట్టణంలోగల శ్రీసీతారామాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ దేవాలయం కమిటిసభ్యులు ఉగాది, శ్రీరామన వమి, హనుమాన్‌జయంతి ఉత్సవాలకు బుధవారం భూమిపూజచేసి పను లను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్‌మాజీచైర్మన్లు రాచోటి శ్రీశైలం,సత్యం, పిఎసిఎస్‌చైర్మన్ తలసానిజనార్దన్‌రెడ్డి, దాచేపల్లి రమేష్, రాంచందర్‌సింగ్, చెన్నారం వెంకటయ్య, బాల్‌సాయిలు, బృంగిప్రవీణ్, వెంకటేష్, శ్రీరాములు, గోవిందు, నరేష్, సాయిలు, సత్యం, కిష్టయ్య, బాల్‌నర్సింహ్మ పాల్గొన్నారు



## ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాపక్షం / కొత్తకోట : కొత్తకోట పట్టణంలో నిర్మిస్తున్న శ్రీ హరిహర పుత్ర ధర్మ శాస్త్ర అయ్యప్ప క్షేత్రం ఆలయ నిర్మాణానికి కొత్తకోట పట్టణ వాస్తవ్యులు గుడి బండ విమల నారోత్తమ్ రెడ్డి దంపతులు ఆలయ నిర్మాణంలో భాగంగా గర్భా లయ పిల్లర్ దాతగా రూ. 2,51,16 విరాలాన్ని ప్రకటించి అయ్యప్ప సేవా సమితి సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమితి సభ్యులు దూపం నాగరాజు, బలిజ లింగేశ్వర్ , విశ్వనాథం గంగాధర్ , వేముల సుధాకర్ రెడ్డి, సత్యంసాగర్ , లక్ష్మీ నారాయణయాదవ్ , నరేష్ యాదవ్ , వేముల సంతోష్ రెడ్డి, భీమ కిషోర్ వారికి ధన్యవాదములు తెలిపారు.

## పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి
# అధికారులకు శిక్షణ ఇస్తాం




### సీతక్కకు ఇస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్ : సుమారు నాలుగు దశాబ్దా ల క్రితం హైదరాబాద్‌లో స్థాపించబడిన ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా(ఇస్కీ) ద్వారా దేశంలోని వివిధ శాఖల్లో వివిధ విభాగాల్లో పని చేస్తున్న వేలాది మంది ఇంజనీర్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామని డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు అన్నారు. ఇటీవలే ఆంధ్ర ప్రదే శ్, అరుణాచల్ ప్రదేశ్, ఛత్తీస్ ఘర్, కేరళ, మధ్య ప్రదేశ్, మణిపూర్, రాష్ట్రాలకు చెందిన పంచాయతీ రాజ్, గ్రామీ ణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల్లోని కమ్యూనిటీ లెవెల్ ట్రైనింగ్ లెవెల్ 3 అధికారులకు కూడా శిక్షణ ఇచ్చామని, ప్రభుత్వం అంగీకరిస్తే తెలంగాణ రాష్ట్రంలో ని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సర ఫరా శాఖలోని మిషన్ భగీరథలో పని చేస్తున్న అధికారు లకు కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన వినతి పత్రాన్ని రాష్ట్ర మంత్రి ధనసరి అన సూయ సీతక్కకు అందజేశారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలే జీలోని సెంచనరీ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జరి గిన స్త్రీనిధి 12వ సర్వ సభ్య సమావేశానికి ముఖ్య అతిథి గా హాజరైన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మ హిళా శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్కకు సమర్పించిన వినతిపత్రంలో భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ జల్ శక్తి లోని జాతీయ జల్ జీవన్ మిషన్ ప్రధాన శిక్షణా కేం ద్రంగా ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా(ఈస్కీ) రిజిస్టర్ అయి ఉన్నందున తెలంగాణ లోని పంచాయతీ రాజ్, గ్రామీణాభి వృద్ధి శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగంతో పాటుగా జిల్లా పరిషత్, మండల పరిషత్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పని చేస్తున్న ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ అభ్యర్థుల కు నిపుణులతో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ తెలి పారు. 2025–26 సంవత్సరానికి తెలంగాణలో మొద టి దశ కింద 20 జిల్లాల్లో బ్యాచ్ కు 60 మంది చొప్పున ఒక్కో జిల్లాలో అయిదు ట్రైనింగ్స్ నిర్వహించడం వలన ఏడాదికి రూ.12 కోట్లు ఖర్చు అవుతాయని, ఈ విధంగా రాష్ట్రం మొత్తంలో కేవలం ఒక ఏడాది కాలంలో వేలాది మంది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న సిబ్బం దికి శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రికి డైరెక్టర్ ఇచ్చిన వినతి పత్రంలో వివరించారు. ఇందుకు మంత్రి సానుకూలం గా స్పందించినట్లు డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రా వు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని డైరెక్టర్ శాలువాతో సన్మానించారు. వినతిపత్రం సమర్పించిన బృందంలో డైరెక్టర్‌తో పాటుగా అధికారులు ఎం.రాజశేఖర రెడ్డి, అనిత అగర్వాల్, డాక్టర్ చంద్రకళ, శ్రీధర్ బాబు, లక్ష్మి కాంత రావు, డాక్టర్ పి. రాజారావు పద్మావతి, కవిత, జయ నరేష్ తదితరులు ఉన్నారు.

## నవోదయలో ప్రవేశ పరీక్ష ఫలితాల వెల్లడి

ప్రజాపక్షం/బిజినేపల్లి : వట్టెం జవహర్ నవోదయ విద్యాలయాలో ఆరు, తొమ్మిదవ తరగతులలో ప్రవేశానికి గాను ఇటీవల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన ఎంపికైన విద్యా ర్థుల ఫలితాలను నవోదయ విద్యాలయ సమితి విడుదల చేసినట్లు ప్రిన్సి పాల్ పి.భాస్కర్ కుమార్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఆరవ తర గతిలో ప్రవేశానికి ఎంపికైన 75 మంది విద్యార్థులు. 9వ తరగతి ప్రవేశానికి ఎంపికైన13 మంది విద్యార్థులు, ఫలితాల వివరాలను నవోదయ వెబ్సైట్లో ఉంచినట్లు ఎంపికైన విద్యార్థులకు వారి వ్యక్తిగత ఫోన్ నెంబర్లకు, చిరునా మాకు వాట్సప్ మెసేజ్‌ల ద్వారా, పోస్టు ద్వారా సమాచారాన్ని అందించి సంబంధిత ఫారములను పంపుతున్నట్లు ఆయన చెప్పారు. ఎంపికైన విద్యా ర్థులు వారి తల్లిదండ్రులు నవోదయ విద్యాలయానికి ప్రత్యక్షంగా రావలసిన అవసరం లేదని ఎంపికైన వారందరికి వ్యక్తిగతంగా సమాచారము అందించి ధ్రువపత్రాలను సేకరిస్తామని, అన్ని వివరాలను ఎంపికైన వారందరికి తెలు పుతామని ఆయన తెలిపారు.

## వరి కోనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

ప్రజాపక్షం/ మక్తల్ : మాజీ ఎంపిటిసి జి.బలరాం రెడ్డి. కృష్ణా నది పరివా హక ప్రాంతమైన మక్తల్ నియోజకవర్గంలో రబీ సీజన్‌కు సంబంధించిన వరి పంట కోతలు ఇప్పటికే విరివిగా కొనసాగుతున్నాయని, దీన్ని దృష్టిలో ఉం చుకొని తక్షణమే వరి కోనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయడం తో పాటు రైతుల నుండి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మాజీ ఎంపి టిసి జి.బలరాం రెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో మక్తల్ నియోజకవర్గంలోని మక్తల్, కృష్ణ, మాగనూరు, నర్వ, అమరచింత, అత్మ కూరు మండలాలల్లో వేలాది ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేయడం జరిగిందన్నారు. వరి కోతలు ప్రారంభమైనప్పటికీ ధాన్యం కొనేవారు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. గత ఎన్నికల సమ యంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు వరి ధాన్యం కొనుగోలుకు బోనస్ అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత వానకాలం సీజన్లో పంట కొనుగోలు చేసినప్పటికీ ఇప్పటివరకు రైతులకు బోనస్ డబ్బులు అందజేయ లేదని ఆయన అన్నారు. తక్షణమే బోనస్ కు సంబంధించిన నగదును రైతు ల ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఘనంగా షబే కదర్ వేడుకలు



ప్రజాపక్షం/బిజినేపల్లి : పవిత్ర రంజాన్ మాసం చివరి రోజుల్లో భాగంగా షబ్ కదర్ వేడుకలు బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండ లంలోని గుడ్ల గుడ్ల నర్వా గ్రామంలో షబే కదేర్ వేడుకలు కర్నూల దర్గ పీఠా ధిపతి శిష్యులు శిష్యులతో పాటు మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ ఖిజర్ వజిత్ మైను బుజ్జి షఫీ మహమ్మద్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## మక్తల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం



ప్రజాపక్షం/ మక్తల్ : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కాంగ్రెస్ నేతలు అన్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశాల మేర కు టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఏ.రవి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన మున్సిపా లిటీ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో సీనియర్ నేతలు కట్టా.సురేష్ కుమార్ గుప్తా, మండల అధ్యక్షులు గణేష్ కుమార్, బి. చంద్రకాంత్ గౌడ్ ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మక్తల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని, మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని హస్తగతం చేసుకోవాలని, అందుకు తగినట్లుగా కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు , శ్రేణులు ఇప్పటినుంచి సంసిద్ధం కావా లని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమ పథ కాలు, అభివృద్ధి పనుల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూ చించారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనట్టుగా అన్ని వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందేందుకు చర్యలు చేపడుతుందన్నారు. గత పదేళ్ళలో కనీసం రేషన్ కార్డులు ఇవ్వలేదని, ప్రస్తుతం ధరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క రికి రేషన్ కార్డులు అందాయని తెలిపారు. ప్రతి బూత్ లోనూ కాంగ్రెస్ ప్ర భుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించి, పార్టీని బలోపేతం దిశగా కృషి చేసి, రాబోయే ఎన్నికల్లో మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరవేసే వి ధంగా సమిష్టి కృషి చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించడం జరి గింది. ఈ కార్యక్రమంలో నాయకలు, రవికుమార్ అధ్యక్షులు మక్తల్ పట్టన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైస్‌మిల్ అసోసియేషన్ తాలుకా అధ్యక్షుడిగా బీచని బాలకృష్ణ

ప్రజాపక్షం/కల్వకుర్తి : కల్వకుర్తి రైస్‌మిల్ ఆసోసియేషన్ తాలుకా అధ్య క్షుని ఎన్నికల్లో బీచనిబాలకృష్ణ గెలుపొందారు. బుధవారం పట్టణంలోని స్వాతిమినీఫంక్షన్‌హాలులో నిర్వహించిన ఉత్కంఠభరితంగాసాగిన కల్వకుర్తి రైస్‌మిల్ ఆసోసియేషన్ తాలుకా అధ్యక్షుని ఎన్నికల్లో మొత్తం 58ఓట్లకు గాను 57 ఓట్లు పోలయ్యాయి. బాలకృష్ణకు 31ఓట్లురాగా, పాపిశెట్టిశ్రీనివా స్‌కు 26ఓట్లురావడంతో 5ఓట్ల మెజారిటితో బాలకృష్ణ గెలుపొందినట్లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన విజయభాస్కర్, వెంకట్‌రెడ్డిలు ప్రక టించారు. విజయం సాధించిన బాలకృష్ణను నాగర్‌కర్నూల్ జిల్లా రైస్‌మి ల్లర్స్ ఆసోసియేషన్, కల్వకుర్తి రైస్‌మిల్లర్స్ ఆసోసియేషన్ సభ్యులు పూలమా లలు, శాలువాలతో ఘనంగా సత్కరించి, మిఠాయిలు తినిపించారు. తనవి జయంకోసం కృషిచేసినవారితోపాటు ప్రతి ఒక్కరికి బాలకృష్ణ కృతజ్ఞతలు చెప్పారు. పెద్దల సహకారంతో మిల్లర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు.



# సహాయక చర్యలు వేగవంతం



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి: ఎస్ఎల్‌బిసి టన్నెల్లో మృతిచెందిన 8మందిలో ఇద్దరు మృత దేహాలు లభించగా మిగిలిన ఆరుగురికోసం సహా యక చర్యలను వేగవంతం చేయడంతో పాటు, మట్టి తవ్వకాలు, ఊటనీటి పంపింగ్ ప్రక్రియ ని రంతరాయంగా కొనసాగుతున్నాయని డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవిం ద్ కుమార్ తెలిపారు. బుధవారం ఎస్ఎల్‌బిసి ట న్నెల్ ఆఫీసు వద్ద టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యలపై డిజాస్టర్‌అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్‌చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, ఎస్ఎల్‌బి సిటన్నెల్ ప్రమాదంపై సహాయక చర్యల పర్యవేక్ష ణకొరకు నియమించబడిన ప్రత్యేక అధికారి శివ శంకర్‌లోతేటి ఉన్నతాధికారుల తో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఫిబ్రవరి 22న ఎస్ఎల్‌బిసి టన్నెల్లో జరిగిన ప్రమాదంలో మొత్తం 8మంది కార్మికులు టన్నెల్‌లో చిక్కుకోగా, ఇద్దరి మృతదే హాలను గుర్తించివారి కుటుంబసభ్యులకు అప్ప గించినట్లు, మిగిలిన ఆరుగురికోసం సహాయక చర్యలను వేగవంతం చేయడానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న ట్లు తెలిపారు. ఎ స్ఎల్‌బిసి టన్నెల్‌లోపల సహాయకబృందాలు ని రంతరం పూర్తిస్థాయిలో సహాయక చర్యలు కొన సాగిస్తున్నట్లు, నాలుగు ఎస్కవేటర్లతో మట్టి తవ్వ కాలు కొనసాగిస్తూ , మట్టిని కన్వేయర్ బెల్టుద్వా రా బయటికి తరలిస్తున్నట్లు , మట్టి తవ్వకాలకు అడ్డుపడుతున్న టిబిఎం భాగాలను తొలగిస్తూ సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నట్లు వివరిం చారు. నిరంతరాయంగా వస్తున్న ఊటనీటిని ట న్నెల్ లోపల 2.5 కిలోమీటర్లకు ఒకటిచొ ప్పున 150హెచ్‌పి సామర్థ్యంగల ఐదు పంపింగ్‌స్టేషన్‌లద్వారా నిమిషానికి 3600 లీటర్ నీటిని కృష్ణానదిలోకి పంపు తున్నట్లు తెలియజేశారు. ఉన్నతస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ సహా యక బృందాలకు అవసరమైన సూచన లు, సలహాలు ఇస్తూ సహాయక చర్యల ను కొనసాగిస్తున్న ట్లు వివరించారు. టన్నె ల్‌లో చిక్కుకు న్న వారి ఆ చూకి తెలుసుకునేందు కు 24గంటలపాటు నిరంతరం సహాయక బృం దాలు శ్రమిస్తున్నాయని, మట్టి తవ్వకాల అనంత రం లోకోట్రాక్‌ను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. ఈసమీక్ష సమావేశంలో ఆర్మీ అధికారి వికాస్ సింగ్, ఎన్‌డిఆర్ఎఫ్ అధికారులు డాక్టర్ హరీష్, సింగరేణిమైన్స్‌రెస్క్యూ జనరల్ మేనేజర్‌బైద్య, నా గర్‌కర్నూల్ ఆర్‌డిఓ సురేష్, ఎస్‌డిఆర్ఎఫ్, హై డ్రా దక్షిణమధ్యరైల్వే అధికారులు, ఇరిగేషన్ ఇఇ శ్రీనివాస్, జెపికంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మాస్‌కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



ప్రజాపక్షం/వెల్దండ : విద్యార్థులు మాస్‌కాఫియింగ్‌కు పాల్పడితే కఠిన చర్య లు తీసుకుంటామని డిఇఒ రమేష్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పదోతరగతి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించాలని సూచించారు. విద్యార్థులకోసం ఏర్పా ట్లను పరిశీలించారు. చూచిరాతలకు అస్కారం లేకుండా పరీక్షలు పకడ్బందీ గా ప్రశాంతంగా నిర్వహించాలని ఆదేశించారు. వెల్దండ మోడల్‌స్కూల్ పరీ క్షాకేంద్రంలోఓ 210మంది విద్యార్థులకు వందశాతం హాజరయ్యారు. వెల్దం డ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 144మంది విద్యార్థులకుగాను ఒక విద్యా ర్థినేటి గణిత సబ్జెక్టుపరీక్షకు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షాకేంద్రాలవద్ద 144సెక్షన్ అమల్లో ఉన్నందున ఇతరులను ఎవరిని అనుమతించొద్దని పోలీ స్‌సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన వెల్దండ పోలీస్‌స్టేషన్ నుండి సెట్1 గణితసబ్జెక్టు ప్రశ్నపత్రాల తరలింపు ప్రక్రియను పరిశీలించారు. ఆయా పరీక్షకేంద్రాలు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులు భౌజే శ్వర్, శ్రవణ్‌కుమార్, రవీందర్, రవికిరణ్ పాల్గొన్నారు.

# ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లిస్తాం

### డిసిహెచ్ఎస్ డా.చంద్రకళ



ప్రజాపక్షం/జడ్చర్ల: జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులకు చెల్లించా ల్సిన ఐదు నెలల పెండింగు వేతనాలు రేపటి లో గా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని డిసి హెచ్ఎస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. చంద్రకళ అన్నారు. జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆ సుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పే షెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులకు ఐదు నెలల పెండింగు వేతనాల చెల్లింపులో తీవ్రమైన నిర్లక్ష్య జాప్యాన్ని నిరసిస్తూ కాంట్రాక్టు కార్మికులు మెరు పు సమ్మెకు దిగిన నేపథ్యంలో బుధవారం డిసిహె చ్ఎస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.చంద్రక ళ, ఆసుపత్రి ఆర్ఎంఓ డా.హరినాథ్, శ్రీ శాంతి ఏజెన్సీ కాంట్రాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, మెడికల్ కాం ట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్, కార్మికులు ఆసుపత్రి ఛాంబ ర్‌లో చర్చలు జరిపారు. చర్చలు సఫలం కావడం తో ఆసుపత్రి కార్మికులు ఆందోళన విరమించా రు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ ప్ర భుత్వ ఆసుపత్రిలో రోగులు, వారి వెంట ఉన్న సహాయకుల మలమూత్రాలు ఎత్తిపోస్తు వెల్లకట్ట లేని సేవలందిస్తున్న కార్మికులు కాంట్రాక్టు పద్ద తుల్లో థర్డ్ పార్టీ ఏజెన్సీ కింద ఎలాంటి హక్కులు కనీస వేతనాలు, ఇతర ప్రయోజనాలు లేకుండా వెట్టి చాకిరికి గురవుతున్నారని అన్నారు.ఏజెన్సీ కాంట్రాక్టర ర్ల తప్పిదాలపై ఎప్పటికప్పుడు ఫిర్యా దులు అందజేస్తున్న ఎందుకు చర్యలు తీసుకో వడం లేదని ప్రశ్నించారు. బాలనగర్ సిహెచ్‌సిలో కేవలం రూ.9000 మాత్రమే జీతం చెల్లిస్తున్నా రని 14 మంది కార్మికులకు కేవలం 7 మంది మాత్రమే కార్మికులను పెట్టుకుని మిగతా ఏడుగురి వేతనా లు కాంట్రాక్టర్ స్వాహా చేస్తున్నా డన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం రాష్ట్రంలో ఎక్కడ ఏ ఏజెన్సీ కాంట్రాక్టర్ వేత నాలు చెల్లించడం లేదని వీటిపై అనేక పర్యా యాలు కార్మికులు ఆందోళనలు చేసి న కూడ కార్మికుల వేతనాల్లో అవకతవకలు జరుగుతున్నా యని తెలిసి కూడా వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో చోద్యం చూడడం హాస్యా స్పదమన్నారు. కార్మికులకు ప్రభుత్వం నుంచి బడ్జెట్ వచ్చిన రాకున్నా ప్రతి నెల ఐదవ తేదీ లోపు వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకో వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆసు పత్రి బ్రాంచ్ యూనియన్ నాయకులు కార్మి కులు నరసింహ, నవీన్, రాజేష్, పేర్మల, రామకృ ష్ణ, రవి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ మతసామరస్యాన్ని పెంపొందిస్తుంది

### ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి



ప్రజాపక్షం/కల్వకుర్తి : పవిత్రమైన రంజాన్‌మాసంలో ముస్లింలు నిష్టతో కఠి న ఉపవాసాన్ని ఆచరించి తమ భక్తినిచాటుకుంటారని , ఈ రంజాన్ మాసం ప్రజల మధ్య మతసామరస్యాన్ని సంతోషాన్ని పెంపొందిస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని అబూబ్‌కర్‌ఫంక్షన్‌హాలులో ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఏర్పాటుచేశారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరె డ్డి నారాయణరెడ్డి, మాజీ జడ్‌పి వైస్‌చైర్మన్ ఠాగూర్ బాలాజిసింగ్‌లు ముఖ్య అతిథులుగా ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ ముస్లింలకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి వారి సంక్షే మం కోసం తోడ్పడుతుందన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరె డ్డి చేతుల మీదుగా అందజేశారు. పట్టణంలోని ఈద్గాలను మాజీసర్పంచ్ ఆనంద్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇబ్ర హీం, ప్రభుత్వవైద్యులు శివరాం, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ మాధవరెడ్డి, జిల్లెల్ల మాజీసర్పంచ్ జిల్లెల్లరాములు, కాంగ్రెస్‌నాయకులు మట్టవెంకటయ్య గౌడ్ పాల్గొన్నారు.

# బిసిలకు రిజర్వేషన్లు కల్పించాకే డిలిమిటేషన్ ప్రక్రియ

### బిసి జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్



ప్రజాపక్షం/జడ్చర్ల : జడ్చర్ల పట్టణంలోని మండ ల విద్యావనరుల కేంద్రం ఆవరణలో బిసి జాగృ తి సేన ముఖ్యనాయకుల సమావేశంలో బిసి జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ చట్టసభలలో రిజర్వేషన్‌ల సాధనకై ఉద్యమ కారులు మేధావులు, విద్యావం తులు శాబ్దాలుగా పోరాడుతున్నా కేంద్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా పట్టించుకు న్న పాపాన పోలేదు ప్రజాస్వామ్య దేశంలో మె జార్టీ ప్రజలకు, చట్టసభలతో పాటు, విద్యా ఉద్యో గాలలో, రిజర్వేషన్లు లేకపోవడం సామాజిక న్యా యస్ఫూర్తికి గొడ్డలి పెట్టని ఆవేదన వ్యక్తం చేశా రు. బిసిలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు వేసి యంత్రాలుగా, సం పద సృష్టించే మర మనుష లుగా చూస్తున్నారు. తప్ప మనుషులుగా గుర్తిం చడం లేదన్నారు. మో డీ ప్రభుత్వం, త్వరలో చేప ట్టబోయే దేశ జనాభా గణనలో బిసి కులాల గణన చేపట్టి చట్టసభలలో బిసి రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి, బిల్లు ఆమోదించి జనాభా దా మాషా నిష్పత్తిన, చట్టసభలతో పాటు, విద్యా, ఉద్యోగ ఆర్థిక, పారిశ్రామిక, సాంస్కృతిక, ప్రైవేటు రం గాలలో రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే దేశంలో పార్లమెంటు స్థా నాలతో పాటు, వివిధ రాష్ట్రాలలో అసెంబ్లీ స్థానాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వా న్ని డి మాండు చేశారు. ఈ కార్యక్రమంలో బిసి జాగృతి సేన మండల అధ్యక్షులు బొల్లెమోని ని రంజన్, ప్రధాన కార్యదర్శి గౌడుగు నర్సిములు, నియోజ కవర్గం ప్రధాన కార్యదర్శి లింగంపేట్ శేఖర్, కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సురభి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

ప్రజాపక్షం / పెబ్బేరు : పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. అల్లే శ్రీనివాసులు తనిఖీ నిర్వహించి పలు రికార్డు లను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న జనరల్ ఓపి రిజి స్టర్, డెలివరీ రిజిస్టర్, ఇన్ పేషెంట్ రిజిస్టర్ హాజరు రిజిస్టర్ తనిఖీ చేశా రు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. ప్రసవాల గదిలో ఫ్యాన్లు, బల్బులు, ప్లంబర్ వర్క్ వెంటనే రిపేర్ చేయించాలని అక్కడ ఉన్న వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన డా. చంద్ర శేఖర్ , హెల్త్ సూపర్ వైజర్లు లీలమ్మా, పార్వతి, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్ , ఫార్మా సిస్ట్ కుమారి, డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్ , స్టాఫ్ నర్స్ విజ యలక్ష్మి , ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# లక్ష్యం మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తి

### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : ప్రభుత్వ సం క్షేమ పథకాలు లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశిం చారు. బుధవారం జిల్లా కలెక్టర్ మిడ్జిల్ మండలంలో పర్యటించారు. తొలుత పదవ తరగతి పరీక్షా కేంద్రాల ను తనిఖీ చేసిన తర్వాత తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, మిషన్ భగీరథ, వ్యవసాయ శాఖ, పంచాయతీ అధికారులు, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య శాఖ, ఉపాధి హామీ ఎన్‌జిఒ లతో వివిధ అభివృద్ధి పథకాలు సమీక్షిం చారు. మండలంలో తాగు నీటి సరఫరా, విద్యుత్ సరఫ రా సమీక్షించారు. వేసవి కాలంలో తాగు నీటి ఎద్దడి లే కుండా గ్రామాల్లో పర్యవేక్షించాలన్నారు. పిహెచ్‌సి వైద్య సిబ్బంది వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ప్రజల కు వడ దెబ్బ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కలిగించాలని, ఓఆర్ఎస్ పాకెట్‌లు సిద్ధం గా ఉంచాలని సూచించారు. మండలంలో ఎంపిక చేసిన గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిన వాటిని గ్రైండింగ్ చేయాలని, మంజూరు కాని వాటిని మంజూరు చేయాలన్నారు. మండలంలో ప్రభుత్వ పనులకు కొత్త పల్లి రీచ్, అయ్యవారి పల్లి శాండ్ డంప్ నుండి ఇసుకను ఇందిరమ్మ ఇండ్లకు, సిసి రోడ్లు నిర్మాణం, రోడ్లుకు ప్రభుత్వ పనులకు ఇసుక సరఫరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఉపాధి హామీ పనులు మార్చిలోగా పూర్తి చేయాలన్నారు. తహశీల్దార్, ఎంపిడి ఒ కార్యాలయాల ఆ వరణలో ఉన్న డబ్బాలు, షాప్‌లు తొలిగించాలని, కాం పౌండ్ నిర్మాణంకు ప్రతిపాదనలు పంపాలని కోరారు. సమావేశంలో తహశీల్దార్ రాజు, ఎండిఓ గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

#### ఈ నెలాఖరు వరకు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు తుది గడువువ

ఎల్ఆర్ఎస్ ఈ నెలాఖరు వరకు మాత్రమే గడుపు మిగిలి ఉందని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. 2020లో దరఖాస్తు చేసుకున్న లేఅవుట్ యజమానులు, డెవలపర్లు, ప్లాట్ల యజమానులు ఈ నెలాఖరు మార్చి 31 లోగా ఫీజు చెల్లించి ప్రభుత్వం కల్పిస్తున్న 25 శాతం రాయితీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గడుపు పొడిగింపు ఉండదని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. నిషే ధిత స్థలం లేదా చెరువు, కుంట కింద లేకుంటే ప్లాట్ల య జమాని ఫోన్‌కు నేరుగా ఎంత డబ్బులు కట్టాలో సమా చారం వెళుతుందన్నారు. ఎల్.ఆర్.ఎస్ ఉంటే ప్లాటుకు రక్షణ ఉంటుందని, ఎవరు అక్రమించుకోవడానికి అవ కాశం ఉండదని అదేవిధంగాలే అవుట్ ప్లాట్ల ప్రాంతాన్ని మున్సిపాలిటీ ద్వారా అభివృద్ధి చేసే అవకాశం ఉంటుం దన్నారు. భవిష్యత్తులో ప్లాటు అమ్ముకోవాలనుకున్న ఎల్ఆర్ఎస్ ఉన్న ప్లాటుకు మంచి డిమాండ్ ఉంటుందని తెలియజేశారు.

#### పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీగా భద్రత

పదో తరగతి పరీక్షలలో భాగంగా మిడ్జిల్ మండల కేంద్రంలోని చైతన్య భారతి హై స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బో యి తనిఖీ చేశారు. ఈ కేంద్రాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు, పరీక్షకు హాజరైన విద్యార్థు ల వివరాలు అన్నింటిని చీఫ్ సూపరింటెండెంట్ ల ద్వా రా అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద భద్రత ను పకడ్బందీగా నిర్వహించాలని ఎట్టి పరిస్థితులలో ఇత రులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించవద్దని, పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్లు అనుమతి లేదని చెప్పారు. ఎప్ప టికప్పుడు అప్రమత్తంగా ఉండి పరీక్షలు సవ్యంగా జరి గేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# షో కేస్ కళారంగం

## వసంతాగమన వేడుకలకు దేశం సిద్ధం


ఆలింగ్

దేశంలోని వివిధ ప్రాంతాల్లో వసంతాగమన వేడుగలు ఘనంగా జరగనున్నాయి. సాధారణంగా ఏప్రిల్ మాసంలో వచ్చే వసంతాన్ని కొత్త జీవితానికి సంకేతంగా పేర్కొంటారు. చాలా మందికి, వసంతకాలం వినోద కాలం. వేడి, కఠినమైన శీతాకాలం తర్వాత చెట్లు, మొక్కలు, జంతువులు, కీటకాలు కూడా కొత్త జీవితాన్ని ఆరంభిస్తాయి. ప్రకృతిలోని శక్తిని ప్రతి ఒక్కరికీ అనుభవపూర్వకగా తెలుస్తుంది. కేవలం మన దేశంలోనేకాదు.. ప్రపంచవ్యాప్తంగా కూడా ప్రజలు వసంత సెలవులతో ఈ సమయాన్ని ఎంతో ఆస్వాదిస్తారు. మన దేశంలో ఎప్పటి మాదిరిగానే ఈసారి కూడా వివిధ ప్రాంతాలు, రకరకాల సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలకు సిద్ధమయ్యాయి. వీటిలో ప్రధానమైనది ఆలింగ్ పండుగ. ఏప్రిల్ ఒకటి నుంచి 6వ తేదీ వరకూ నాగాలాండ్‌లో ఈ వేడకను కొన్యాక్ తెగ గిరిజనులు జరుపుకుంటారు. ఈ పండుగ వసంతకాలం ప్రారంభాన్ని సూచిస్తుంది. మంచి పంటను రైతులు ఆశిస్తారు. ఈ పండుగ గిరిజన ప్రజల నూతన సంవత్సరంలో వస్తుంది. పర్యాటకులు గిరిజన గ్రామాలను సందర్శిస్తారు. వారితోపాటు అనేక సాంస్కృతిత కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ పండుగ సమయంలో ఆనందించడానికి ప్రధాన కార్యకలాపాలుగా నృత్య, సంగీత ప్రదర్శనలను చెప్పుకోవాలి. విందులు, పురాతన ఆచారాలు కూడా పర్యాటకులను ఆకట్టుకుంటాయి. అరుణాచల్ ప్రదేశ్‌లో మోపిన్ ఫెస్టివల్ ఏప్రిల్ 5 జరుగుతుంది. ఆకర్షణీయమైన ఈశాన్య భారతీయుల కథలను మీరు లెక్కలేనన్ని చదివి ఉండవచ్చు. కానీ ప్రతిసారీ కొత్త కథ ఊహించలేని సాహసాలను ఈ పండుగు మీకోసం తెస్తుంది. అలాంగ్‌బసర్‌బామే ప్రజలు మోపిన్‌ను పంట పండుగగా మరియు దుష్టశక్తులను దూరంగా ఉంచడానికి ఒక చర్యగా జరుపుకుంటారు. ఇందులో కొంత మంది చాలా నైపుణ్యం కలిగిన స్థానిక తెగల మహిళలు ప్రదర్శించే జానపద నృత్యం 'పోపిర్' ఉంటుంది. పండుగ సమయంలో స్థానికంగా తయారుచేసిన బియ్యం వైన్ (అపోంగ్) ప్రత్యేక ఆకర్షణ.



## సృజనాత్మకతకు అపూర్వ వేదిక థియేటర్ ఆర్ట్స్

నాటక రంగం లేదా థియోటర్ వేదికగా పలువురు నటులు, నటీమణులు, ఇతర కళాకారుల సహకార సృజనాత్మకత కళలను ప్రదర్శనలు ఇవ్వడం జరుగుతున్నది. నాటకశాల వేదికపై ప్రత్యక్షంగా కళాకారులు తమ నిజమైన లేదా ఊహాత్మక పాత్రలకు జీవం పోస్తూ ప్రేక్షకుల మన్ననలు పొందడం అనాదిగా కొనసాగుతున్నది. నాటకరంగ కళాకారులు తమ నటన ప్రావీణ్యాలతో ముఖకవలికలు, సంభాషణలు, గీతాలాపనలు, సంగీతం, నాట్యాలు లాంటి పలు అంశాలకు ప్రేక్షకుల కరతాళధ్వనుల మధ్య నిర్వహిస్తూ సమాజంలో జరుగుతున్న పోకడలు, విజ్ఞాన వినోదాలు, ప్రభుత్వ పాలనలు, రాజకీయ నాయకుల పోకడలు, వ్యవస్థలో లోపాల వెలికితీతలు, సూచనలు, చైతన్య కార్యక్రమాలు లాంటివి నాటక రంగంలో సుసాధ్యం అవుతున్నాయి. ఆధునిక నాటక రంగం కూడా డిజిటల్ రంగులు అదుకుని పలు వినూత్న



మార్పులకు ఊపిరి పోస్తున్నది. నటులు తమ నటనతో పాటు పాత్రకు తగిన వేషధారణలు, వేదిక వెనుక సందర్భోచిత పరదాలు, ఆధునిక సాంకేతిక ప్రదర్శనలు, మైమిం గ్, ఏకపాత్రాభినయాలు, తోలు బొమ్మలాటలు, సర్కస్, ఒపేరా, డిజిటల్ మీడియా లాంటివి అద్భుత రీతిలో అందం గా, వినోదాత్మకంగా, విజ్ఞానదాయకంగా, సానుకూల మార్పుల దిశగా,కళ్లు తెరిపించే విధంగా వేదికను సుసంపన్నం చేస్తూనే ఉన్నారు. 1961లో అంతర్జాతీయ నాటకరంగ సంస్థ చొరవతో ప్రతి ఏటా 27 మార్చిన ప్రపంచ నాటకరంగ దినోత్సవం (వరల్డ్ థియేటర్ డే) పాటించుట 1962 నుంచి ఆనవాయితీగా మారింది. 2025 ప్రపంచ నాటక దినోత్సవం ఇతివృత్తంగా నాటకరంగం సాంస్కృతిక సృజనతో ప్రపంచ శాంతి స్థాపన అనబడే అంశాన్ని తీసుకున్నారు. ఒకరి పాత్రలో మరొకరు నటిస్తూ ప్రేక్షకులను అలరించడం లేదా ఒక అంశాన్ని ప్రజల కళ్ల ముందుంచడం, సమాజ విపరీత పోకడలను వేలెత్తి చూపడం,



సకారాత్మక మార్పులను సూచించడం, విద్య వినోదాల విందులు ఆరబోయడం నాటక రంగ ప్రత్యేకతల్ని తెలుసు కోవాలి. డిజిటల్ యుగంలో స్మార్ట్ ఫోన్స్, టీవీలు ఇంటింటా వెలగడంతో సినిమా హాళ్లు కూడా ఖాళీగా కనిపిస్తున్నాయి. నాటక రంగం రానురాను తెర వెనక్కి వెళుతూ కళాకారుల, ప్రజల ఆదరాభిమానాలు పలుచబడుతున్నాయి. నాటక ప్రదర్శనలు అరుదై పోయాయి. నటులు, నటీమణులు మరో మార్గం లేక నటనకు స్వస్తి పలకడం లేదా సినిమా రంగంలోకి వెళ్లే ప్రయత్నాలు చేయడం కొనసాగుతున్నది. నాటక రంగ కళాకారులు అంటే పరిహాసం అయిపోవడం అత్యంత బాధాకరం. నాటకరంగానికి నిధుల కొరత, ప్రభుత్వాల నిరాదరణ, కొరవడిన కళాకారులకు ప్రోత్సాహాలు, డిజిటల్ వేదికలకు పెరిగిన ఆదరణ, ప్రజల ఆసక్తి తగ్గడం లాంటి అంశాలు థియేటర్ ఆర్ట్ రంగానికి శాపంగా మారుతున్నాయి. నాటక రంగం వైపు యువత చూపులు తగ్గడం, నాటకరంగ కళాకారులను చిన్న చూపు చూడడం, కళాపోషకులు తగ్గడం, కళాభిమానులు పలుచబడడం, థియేటక్ ప్రదర్శనలకు ప్రేక్షకులు తగ్గడం లాంటివి థియేటర్ ఆర్ట్స్‌కు విఘాతాలుగా మారడం విచారకరం. మనదైన పూర్వపు నాటక కళకు డిజిటల్ రంగులు అద్ది కళాకారుల ప్రదర్శనలను ఆదరిద్దాం, విజ్ఞాన వినోద, చైతన్యాలను పొందుదాం.

## ఇదీ రికార్డే!

కొన్ని ఎవరూ కోరుకోని రికార్డులు కూడా నమోదవుతుంటాయి. అలాంటి రికార్డే 'ది ఇంటిమేట్ రివ్యూ' నాటకానికి కూడా ఉంది. ప్రపంచ నాటక రంగంలో అతి తక్కువ సమ యం ప్రదర్శితనమైన నాటకంగా దీనిని పేర్కోవాలి. ప్రపంచ రంగస్థలంపై అత్యధిక కాలంగా ప్రదర్శిస్తున్న నాటకం 'ది మౌస్‌ట్రాప్'. 1952 నవంబర్‌లో, లండన్‌లోని అంబాసిడర్ థియేటర్‌లో మొదలైన ఈ నాటక ప్రదర్శనను, 1974 మార్చిలో సెయింట్ మార్టిన్ థియేటర్‌కు మార్చారు. వేదిక మార్పు జరిగిందే తప్ప, ఈ నాటక ప్రదర్శనకు ఎలాంటి అంతరాయం కలగలేదు. ఇప్పటికీ ప్రతి రోజూ ఈ నాటక ప్రదర్శన జరుగుతునే ఉంది. అయితే, 'ది ఇంటిమేట్ రివ్యూ' నాటకానికి ఇందుకు పూర్తి భిన్నం. 1930 లో డచెస్ థియేటర్‌లో ఈ నాటకాన్ని ప్రదర్శన మొదలైంది. అయితే, నాటకం పూర్తికాకముందే నిలిచిపోయింది. వేదిక మొత్తం చిందరవందరగా ఉండడం, ఫలితంగా, ఒక్కో సన్నివేశం మార్చడానికి కనీసం 20 నుంచి 30 నిమిషాల సమయం పట్టడం ప్రేక్షకులను అసహనానికి గురిచేసింది. అంతేగాక, థియేటర్ చాలా చిన్నదిగా ఉండడంతో, వెనుకనున్న తెర పక్కన కూర్చొని స్టేజ్ బ్యాండ్ వాయించే వారు కూడా ప్రేక్షకులకు కనిపిస్తుండడంతో, నిర్వాహకులపై ప్రేక్షకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే సమయంలో, ఇద్దరు నటీనటులకు దస్తులు మార్చుకోవడం సాధ్యపడలేదు. తాము వేసుకున్న దుస్తులు ఎంతకూ విప్పడానికి రాకపోవడంతో, వారు లేకుండానే నాటకాన్ని ప్రదర్శించాలని నిర్మాతలు అనుకున్నారు. అందుకు తగినట్టు అనేక సన్నివేశాలను తొలగించారు. దీనితో, నాటకం ఎవరికీ అర్థం కాకుండా పోయింది. ప్రేక్షకులు లేచివెళ్లిపోవడంతో, నాటకాన్ని అర్థాంతరంగా నిలిపివేశారు. ఈ సమస్యలను పరిష్కరించి, తిరిగి నాటక ప్రదర్శనను త్వరలోనే మొదలు పెడతామని నిర్వాహకులు ప్రకటించినప్పటికీ, అది కార్యరూపం దాల్చలేదు. ఆ నాటకం మళ్లీ ప్రదర్శనకు నోచుకోలేదు. దీనితో, అతి తక్కువ సమయం నడిచిన నాటకంగా 'ది ఇంటిమేట్ రివ్యూ' రికార్డు పుస్తకాల్లోకి ఎక్కింది.

## ఆకట్టుకుంటున్న తులిప్ పండుగ

జమ్మూకశ్మీర్ సంప్రదాయబద్ధంగా జరుపుకునే తులిప్ పండుగ ఎప్పటి మాదిరిగానే ఈసారి కూడా ఎంతో మంది పర్యాటకులను ఆకట్టుకుంటున్నది. శ్రీనగర్ ఇందరిగా గాంధీ మెమోరియల్ గార్డెన్స్ వేదికగా ఈ నెల మొదటివారంలో ప్రారంభమైన తులిప్ పండుగ ఏప్రిల్ నెలాఖరుకు ముగుస్తుంది. తులిప్ పూలకు అత్యంత ప్రసిద్ధమైన ఆమ్‌స్టర్‌డామ్‌తో పోటీపడుతూ శ్రీనగర్ కూడా అందాలను పంచడం విశేషం. కశ్మీర్ సహజ అందానికి తులిప్ వనం అదనపు ఆకర్షణ. శ్రీనగర్ పర్యటనకు వెళ్లడానికి, వార్షిక తులిప్ పండుగ కూడా ఒక కారణం. తులిప్ పూలు కేవలం రెండు వారాల పాటు మాత్రమే వికసిస్తాయి కాబట్టి, భూతల స్వర్గంగా పేర్కొనే శ్రీనగర్‌లో ఈ వనాన్ని చూసి గొప్ప అనుభూతిని పొందచవ్చు. ఐదు హెక్టార్లలో విస్తరించి ఉన్న ఈ ఉద్యానవనం ప్రఖ్యాత దాల్ సరస్సు పక్కనే ఉంది. ఒకవైపు తులిప్ పుష్పాలు, మరోవైపు దాల్ సరస్సు అందాలు పర్యాటకులను కట్టిపడేస్తాయి. ఈ సందర్భంగా నిర్వహించే పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఆకట్టుకుంటాయి. మొత్తానికి శ్రీనగర్‌లో ఇప్పుడు పండుగ వాతావరణం నెలకొంది.



## శ్రమ దోపిడీకి గురవుతున్న ఉపాధిహామీ కూలీలు : కొయ్యడ సృజన్

రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఉపాధి హామీ కూలీలు రోజువారీ పనికి సరైన కూలీ రావడం లేదని, శ్రమ దోపిడీకి గురవుతున్నారని, రోజువారీ కూలీ 600 రూపాయలు ఇవ్వాలని బికెఎంయు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పని కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకోవాలనే ఉపాధి హామీ పథకం లక్ష్యం నెరవేరడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని, కూలీలకు కొలతలు పెట్టి పని చేయించడం ద్వారా పని ప్రదేశాల్లో భూములు గట్టి పడడం వల్ల రోజు వారీ కూలీ కేవలం వంద రూపాయలు పడుతున్నాయని, దీంతో కూలీలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొలతలు నిబంధనలు లేకుండా ప్రతి రోజు కూలీ 600 రూపాయలు చెల్లించాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు అయిన తాగునీరు, నీడ సౌకర్యం, ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పని ప్రదేశం కిలోమీటర్ దూరం దాటితే రవాణా సౌకర్యం కల్పించాలని, పార, గడ్డపార పదును చేయడానికి డబ్బులు చెల్లించాలని, 200 రోజులు పని కల్పించాలని, ఉపాధి కూలీలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, పని గ్యారంటీ చట్టాన్ని అమలు చేయాలని సృజన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ శ్రీనివాస్, రాజయ్య, మల్లేశం, రజిత, కవిత, రాజేశ్వరి, విజయ, కనుకవ్వ, లక్ష్మి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## 1-టౌన్ సిఐపై చర్యలు తీసుకోండి

సిపికి ఫిర్యాదు చేసిన ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** గోదావరి ఖని పారిశ్రామిక ప్రాంతంలోని గోదావరి ఖని 1టౌన్ సిఐని వెంటనే సస్పెండ్ చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణిగుంట్ల ప్రీతం అన్నారు. బుధవారం రోజున రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ సిపికి వినతి పత్రం అందజేసిన అనంతరం ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ బాధితుల పక్షాన సమస్య ఉందని సిఐ దృష్టికి తీసుకెళ్తే సమస్యను పరిష్కరించకుండా అసభ్యకరమైన పదజాలంతో తిడుతూ, నువ్వు ఎవడు, నువ్వు ఎందుకు వచ్చావు, నీ సమస్యనా, నీకు ఏం అవసరం, సమస్యను పరిష్కరించం, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ, నన్ను బయటికి గెంటేయ్యండి అంటూ, నా అసలైన రూపం నీకు తెలువదు అంటూ హెచ్చరించడం జరిగింది. మొన్నటికి మొన్న మహిళా కార్పొరేటర్స్‌పై, యువ న్యాయవాదిపై , దురుసుగా ప్రవర్తించిన ఘటన మరువకముందే మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృత్తం చేస్తు, బాధితుల సమస్యలను పరిష్కరించకుండా బెదిరింపులే తన లక్ష్యంగా పెట్టుకొని, బాధితుల పక్షాన వెళ్ళిన ప్రతి ఒక్కరితో దురుసుగా ప్రవర్తిస్తున్న సిఐపై చర్యలు తీసుకోవాలని రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ సిపిని కోరడం జరిగింది. సిపి సానుకూలంగా స్పందించి సిఐపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటానని సిపి హామీ ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నగర కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు ధనాల ఉదయ్, సాయి చరణ్, శివ, దీపక్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# దేశాన్ని కాపాడింది కమ్యూనిస్టులే..


హుజూర్‌నగర్‌లో...


చింతలపాలెం మండల కేంద్రంలో...


నేరేడుచర్లలో...

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** దేశాన్ని స్వాతంత్ర్యంనకు పూర్వం ఆనాడు స్వాతంత్ర్యం తరువాత ఈనాడు పేద ప్రజలకు రక్షణగా నిలిచి దేశాన్ని కాపాడింది కమ్యూనిస్టులేనని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అధ్యక్షతన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా గన్నా చంద్రశేఖర్ మాట్లాడుతూ నిరంకుశ పాలనపై, పేద ప్రజల సమస్యలపై ధర్మభిక్షం రాజీ పడని పోరాటం చేశారన్నారు. ఆయన నాయకత్వంలో త్యాగం సమాజసేవ అలుపెరుగని పోరాటం నేటి యువతకు ఆదర్శమన్నారు. రెండు సార్లు పార్లమెంట్ సభ్యుడిగా, మూడుసార్లు రాష్ట్ర శాసనసభ సభ్యుడిగా పనిచేసి ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గీతకార్మికుల కోసం,ట్రేడ్ యూనియన్ల కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిదని ఆయన్ను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంతగాని సత్యనారాయణ, యల్లావుల రమేష్,జడ వెంకన్న,మామిడి వెంకయ్య, చక్రాల వెంకన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### ధర్మబిక్షం ఆశయాలను ముందుకు తీసుకపోవాలి

**చింతలపాలెం :** కామ్రేడ్ ధర్మబిక్షం ఆశయాలను యువత ముందుకు తీసుకపోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మహిళ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఉస్తేల సృజనలు అన్నారు. బుధవారం చింతలపాలెం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం, సోమిరెడ్డి వెంకటరెడ్డి భవనంలో ధర్మబిక్షం 14వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గుండె వెంకటేశ్వర్లు, శ్రీఉ, గోని అంకయ్య, భూరెడ్డి హైమావతి, ఉస్తేల చిన్నకొండారెడ్డి, ఉసిరికాయల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం పేరు పెట్టాలి

**నేరేడుచర్ల:** సూర్యాపేట జిల్లాకు తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు, మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ ధర్మభిక్షం పేరు పెట్టాలని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కేంద్రంలో కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం 14వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి కోదమగుంట్ల నరేష్, బిఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకులు రాపోలు నవీన్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను, గీత పనివారుల సంఘం నాయకులు కొప్పుల లక్ష్మీనారాయణ, దోరేపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

### కమ్యూనిస్టు సిద్ధాంత ఆచరణీయుడు...

**మహబూబ్‌నగర్ ప్రతినిధి :** కమ్యూనిస్టు సిద్ధాంత ఆచరణీయుడు కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం అని సిపిఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ సిపిఐ కార్యాలయంలో బొమ్మగాని ధర్మాభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, సిపిఐ సీనియర్ నాయకులు మంగ ఊరు మాజీ సర్పంచు బి.వెంకటయ్య, ఆర్.బాలరాజు, రాఘవేందర్ గౌడ్, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

### గీత కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన మహనీయుడు

**నిజామాబాద్ ప్రతినిధి :** గీత కార్మికులపై సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన మహానీయుడు కా॥ ధర్మబిక్షం అని రాష్ట్ర గీతా పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ. విఠల్‌గౌడ్, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మాధవ్‌నగర్ బిఎల్‌ఎన్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర గీతా పనివారాల సంఘం వ్యవస్థాపకులు అమరజీవి ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఓమయ్య, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు రామమూర్తి, సంతోష్‌గౌడ్, నవీన్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.


మహబూబ్‌నగర్‌లో...



నిజామాబాద్‌లో...


గుండాల మండలంలో...

### ధర్మ భిక్షానికి ఘన నివాళి

**గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామంలో బుధవారం సిపిఐ యాదా ద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు స్వాతం త్ర్య సమరయోధుడు మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రే డ్ ధర్మబిక్షం 14వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామ శాఖ సమావేశానికి సభా అధ్యక్షులుగా బొంగు పుల్లయ్య అధ్యక్షత వహింగా ముఖ్య అతిధులుగా గోద శ్రీరాములు హాజరై మాట్లాడుతూ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. మండలానికి సాగు నీరు అందించాలంటే నవాబుపేట రిజర్వాయర్ ద్వారానే సాగు నీరు అందించాలని అసంపూర్తిగా వదిలేసిన కాలువలను పూర్తి చేయాలని, షరతులు లేకుండా రెండు లక్షలకు పైబడిన రుణలు ఉన్న వారికి రుణమాఫీ చేయాలని కోరారు. నూతన రేషన్ కార్డులను అర్హులైన వారందరికి ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు అందించాలని, ధరణీ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు హరిచంద్ర, మండల కార్యదర్శి రామచంద్రయ్య, శాఖ కార్యదర్శి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## మతాల పేరుతో రాజకీయాలు చేయొద్దు : సాబీర్ పాషా



**ప్రజాపక్షం/సుజాతనగర్ :** భారతదేశం సర్వ మతాల సమ్మేళనం అని హిందూ, ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, జైనులు అయినా మనమంతా మనుషులమేనని ఒకటే అనే భావన కలగాలని భద్రాద్రి కొత్తగూడెం ఎస్‌కె. సాబీర్ పాషా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రజబ్ అలీ భవన్‌లో టిఎన్‌ఆర్ మొహమ్మద్ ఖాజిమ్ అలీ సహకారంతో ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సాబీర్ పాషా మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరా వు ఆధ్వర్యంలో అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని సుజాతనగర్ కార్పొరేషన్‌గా త్వరలో రూపు దిద్దుకుంటుందని తద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కులాలు, మతాలు వేరైనా ఎవరి ఆచార సంప్రదాయాలు వారు పా టిస్తూ కలిసి మెలిసి జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి నారాటి ప్రసాద్, ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు నయీ మ్ ఖురేషి, టిఎన్‌ఆర్ బాధ్యులు తాండ్ర బుచ్చిబాబు, కుదుమూరు పుల్లారావు, సిపిఐ మండల కార్యదర్శి భూక్య దసురు, సిపిఐ జిల్లా సమితి స భ్యులు కుమారి హనుమంతరావు, జక్కుల రాము లు, తాళ్ల వెంకటేశ్వరు తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఇటుక ట్రాక్టర్ బోల్తా..కూలీ మృతి



**ప్రజాపక్షం/కొందుర్గు:** ఇటుక ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కూలీ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం జిల్లేడు చౌదరిగూడ మండలం చెన్నారెడ్డిగూడ గ్రామంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. బుధవారం జకారం ఇటుక బట్టి నుండి ఎల్కగూడకు లోడ్‌తో వెళ్తున్న ఇటుక ట్రాక్టర్ ప్రమాదవశాత్తు చెన్నారెడ్డిగూడ స్కూల్ వద్దకు రాగానే బోల్తా పడటంతో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సంతను పోరియ (40) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య దేవకి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జిల్లేడు చౌదరిగూడ పోలీసులు తెలిపారు.

## భవన నిర్మాణ కార్మికులకు లేబర్ అడ్డాల వద్ద మౌలిక సదుపాయాలు

సిపిఐ రాష్ట్ర నేత పానుగంటి పర్వాతాలు డిమాండ్



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి/గండిపేట :** భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. బుధవారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కన్యగారి నరసింహారెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభలు ఏప్రిల్ 21, 22 తేదీలలో శంషాబాద్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు పని ప్రదేశాల్లో ఏదైనా ప్రమాదం సంభవిస్తే వారిlr అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేబర్ అడ్డాల వద్ద మౌలిక సదుపాయాలు లేక మహిళ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే లెబర్ అడ్డాల వద్ద బాత్రూంలను నిర్మించాలని, అన్నపూర్ణ క్యాంటీన్‌లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధానకార్యదర్శి కన్యగారి నరసింహారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.యాదగిరి, కార్యదర్శి నర్రా గిరి, అన్యపు ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు పనులు.. సకాలంలో డబ్బులు చెల్లించాలి : సిపిఐ



**ప్రజాపక్షం/కొందుర్గు:** ఉపాధి కూలీలకు పనులే కాకుండా సకాలంలో డబ్బులు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి జిల్లెల వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లెల వెంకటేష్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కూలీలు పనులు చేస్తున్నారు కానీ..సకాలంలో డబ్బులు చెల్లించడం లేదని, దాంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఎండలను సైతం లెక్కచేయకుండా పనులు చేస్తుంటే వారికి కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సకాలంలో బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.700 కూలీ చెల్లించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. రెండు వందల రోజులు పనిదినాలు కల్పించడంతోపాటు పనిముట్లు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బికెఎంయు జిల్లా కోశాధికారి ఎం.కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రంగయ్య, బుచ్చయ్య, అంతయ్య, యాదయ్యలు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనలో విఫలం

శేరిలింగంపల్లి సిపిఐ కార్యదర్శి రామకృష్ణ




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** మౌలిక వసతులు కల్పించడంలో జిహెచ్‌ఎంసి అధికారులు విఫలమైనారని శేరిలింగంపల్లి సిపిఐ కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి సిపిఐ కార్యదర్శి రామకృష్ణ , సిపిఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు చందు యాదవ్‌లు జిహెచ్‌ఎంసి చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారులకు ప్రాపర్టీ టాక్స్ వసూళ్ళు చేయడంలో ఉన్న శ్రద్ధ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై చెత్త ఎక్కడిది అక్కడే ఉంటుందని, బస్తీలలో రోడ్లు ఉడవడం లేదని తెలిపారు. రోడ్లన్ని చెత్త చెదారంతో నిండి ఉండడంతో రోగాలు ప్రభావిలే ప్రమాదం ఉందని, ఇప్పటికైన అధికారులు పట్టించుకొని కాలనీలలో చెత్తను శుభ్రపరిచి దోమల పాగింగ్ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎఐటియుసి మండల అధ్యక్షులు తుపాకుల రాములు, నాయకులు జట్టి శ్రీనివాస్, నారయణ, రఘు, కొండలయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ

ఎల్‌బి నగర్‌లో క్రైస్తవ సంఘాల నిరసన




**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి సమీపంలో అదివారం రాత్రి జరిగిన పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్ అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఎల్‌బినగర్ క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో ఎల్‌బినగర్ చౌరస్తాలోని అంబెద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. క్రైస్తవ సంఘాల నాయకుడు అర్చ్ బిషప్ దయానంద్ మాట్లాడుతూ ప్రవీణ్‌కుమార్ మృతి పట్ల క్రైస్తవ సంఘాల నాయకులకు, క్రైస్తవులకు అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. దీనిపై వెంటనే ఆంధ్రపదేశ్ ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ప్రవీణ్ కుమార్ కుటుంబానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు అండగా ఉండాలని వారు కోరారు.

## మేయర్ విజయలక్ష్మి ని కలిసిన.. ఇండియనా ప్రతినిధుల బృందం






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసితో అమెరికా దేశానికి చెందిన ఇండియనా స్టేట్‌తో 2010 సిస్టర్ సిటీ ఒప్పందం చేసుకున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ఆ చెందిన ప్రతినిధి బృందం హైదరాబాద్ వచ్చిన సందర్భంగా బుధవారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బృందాన్ని సాదరంగా ఆహ్వానించి ధన్యవాదాలు తెలిపారు. సిస్టర్ సిటీ ఒప్పందంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ఇండియనా ప్రతినిధులు మేయర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం హైదరాబాద్ గతంలో కంటే అభివృద్ధి చెందినట్లు తెలిపారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ పరిధిని పెంచి గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్ చుట్టూ త్రిబుల్ ఆర్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు, ఉత్తరం వైపు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. నగరంలో పాఠశాల విద్యా అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ప్రతినిధులను మేయర్ కోరగా సానుకూలంగా స్పందించి, అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఇండియానా పోలీస్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ డియాగో మోరల్స్, చింతాల రాజు, చీఫ్ అడ్వైసర్ ఆఫ్ గ్రోత్ అండ్ స్ట్రాటజీ పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాస దీక్షల విరమణ సందర్భంగా బుధవారం బంజారాహిల్స్ రేనోవ ఆస్పత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు. పలువురికి ఖర్జూర పండ్లు అందచేసి, దీక్ష విరమింప చేశారు. ముస్లిం సోదరులకు మేయర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

## విశ్వవిద్యాలయ భూముల పరిరక్షణకు కృషి : నెల్లికంటి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని విద్యార్థి సంఘాల నాయకులు సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో విద్యార్థి సంఘ నాయకులు సత్యంతో సమావేశమయ్యారు. సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిఎస్ఐఐసి) శేరిలింగంపల్లి మండల పరిధిలో సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించి 400 ఎకరాల భూములను వేలం వేయనున్నట్లు ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం విద్యాసంస్థల భూములు అమ్మకానికి పెట్టడం బాధాకరమన్నారు. ఆ భూమి భవిష్యత్తులో విద్యార్థుల శ్రేయస్సు కోసం, వారి పరిశోధనలు జరుపుకోవడానికి ఉపయోగపడేల కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే విధంగా చొరవ చూపాలని వారు విజ్ఞప్తి చేశారు. నెల్లికంటి సత్యం స్పందిస్తూ ప్రభుత్వ విశ్వవిద్యాలయ భూముల అమ్మకాన్ని సిపిఐ వ్యతిరేకిస్తుందన్నారు. ప్రభుత్వ ఆలోచనను విరమింపజేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం అధ్యక్షులు ఉమేష్, ఉపాధ్యక్షులు ఆకాష్, పంకజ్, రమేష్, మోహిత్, సుభాషిణి పాల్గొన్నారు.



## 317 జిఒ నెపంతో జరిగిన అక్రమ పోస్టింగులు రద్దు చేయాలి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** జిల్లాలో 317 జిఒ నెపంతో జరిగిన అక్రమ ఉపాధ్యాయ పోస్టింగులు రద్దు చేయించాలని బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ ఆధ్వర్యంలో సేవ్ టీచర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల మధుకర్ రెడ్డి, తలారి సురేష్ కుమార్‌లు బుధవారం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఉపాధ్యాయ పోస్టింగులు అన్నింటి పైన న్యాయ విచారణ జరిపించేటట్లు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని వస్తానని హామీ ఇచ్చారు. రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఉపాధ్యాయ అక్రమ పోస్టింగులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయి నష్టపోయిన నిరుద్యోగ యువకులకు న్యాయం జరిగే వరకు మద్దతుగా ఉంటానని తెలిపారు.

## ఉద్యోగుల జెఎసి బలోపేతం

రంగారెడ్డి జిల్లా ఉద్యోగ సంఘాల జెఎసి అధ్యక్షుడు లక్ష్మణ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** జిల్లాలో ఉద్యోగుల జెఎసిని బలోపేతం చేయాలని రంగారెడ్డి జిల్లా ఉద్యోగ సంఘాల జెఎసి అధ్యక్షుడు కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని తెలంగాణ నాన్ గెజిటెడ్ సంఘ భవనం(టిఎన్జీవోస్)భవనంలో తెలంగాణ ఉద్యోగుల(జెఎసి) స్టీరింగ్ కమిటీ జిల్లాలోని అన్ని సంఘాల భాగాస్వామ్యులతో ఏర్పాటు చేయడం జరిగింది. ఉద్యోగ సంఘాల జెఎసి చైర్మన్ లక్ష్మణ్ అధ్యక్షతన, కన్వీనర్ డాక్టర్ కె.రామారావు నేతృత్వంలో తెలంగాణ ఉద్యోగుల జెఎసి స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముప్పై ఉద్యోగ సంఘాలతో రంగారెడ్డి జిల్లా జెఎసి స్టీరింగ్ కమిటీ ఏర్పటైంది. జెఎసి ఏర్పాటును జిల్లాలోని అన్ని సంఘాలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగుల జెఎసిని బలోపేతం చేయాలని, అన్ని డివిజినల్‌లలోని ఉద్యోగులను కలిసి భవిష్యత్తులో జరిగే కార్యక్రమాలలో పాల్గొనేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో జరిగే వివిధ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని లక్ష్మణ్ కోరారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని స్టీరింగ్ కమిటీ తీర్మానించనట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా తెలంగాణ ఉద్యోగుల జె ఎసి కన్వీనర్ డాక్టర్ కె.రామారావు మాట్లాడుతూ గత 10 సంవత్సరాలనుండి ఈ జెఎసి నిద్రాణంగా ఉందని, ఇప్పుడు మరల కొత్తగా తిరిగి జేఏసీ ఏర్పడటం ఆనందంగా ఉందన్నారు. అన్ని సంఘాలు కలిసికట్టుగా పనిచేస్తే తప్పక మన హక్కులను సాధించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టిఎన్‌జిఓస్ సెక్రటరీ శ్రీనేష్ కుమార్ నోరి, నాయకులు విజయకుమార్, ప్రవీణ్, గోపాల్ నాయక్, ఇస్మాయిల్, నూతనపటి వెంకట్ పాల్గొన్నారు.

## సహకార సంఘం అభివృద్ధికి రైతులు సహకరించాలి



**ప్రజాపక్షం/యాచారం :** సహకార సంఘం అభివృద్ధికి రైతులుసహకరించాలని సహకార సంఘం చైర్మన్ తొటిరెడ్డి రాజేంధర్‌రెడ్డి కోరారు. బుధవారం యాచారం మండల కేంద్రంలోని రైతు వేధికలో సహకార సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి అయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. సంఘాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకపోవడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామన్నారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే మిగతా రైతులకు రణాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో యాచారం మండలం సహకార సంఘం రుణాల వసూళ్ళలో ముందుందన్నారు. ఇప్పటికి వరకు 40 శాతం వసూలు చేశామన్నారు. పంటలను పిచికారి చేయడానికి రైతులు ఒప్పుకుంటే డ్రోన్ మిషన్ తెస్తామన్నారు. రైతులకు సహకార సంఘంలో ఎరువులు విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచతున్నామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మక్కపల్లి స్వరూప శ్రీనివాస్, మద్దెల శశికళ, కంబాలపల్లి మల్లారెడ్డి, అంబొజి లక్ష్మ య్య, ఇబ్రహింపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మస్కు నర్సింహ్మా, అక్బర్, సిఇఒ నాగరాజు పాల్గొన్నారు.

## వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆధ్మాత్మిక శోభ వెల్లివిరిసింది. బుధవారం నందిగామ మండల కేంద్రం సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో స్వామివారి ప్రతిమతోపాటు విఘ్నేశ్వర స్వామి, అమ్మవారు, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ప్రతిష్టాపన మహోత్సవానికి శరబరిమల ఆలయ ప్రధాన పూజారి బ్రహ్మశ్రీ కంఠారు రాజీవారు తాంత్రి, గిరిష్ సతీష్‌నాయర్ స్వాములు హాజరై కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, వై.అంజయ్య యాదవ్ పాల్గొన్నారు. మండలాల నుండి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. దేవాలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బదులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అయ్యప్ప నామస్మరణ చేస్తూ పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, ఏపి మిథున్‌రెడ్డి, వి.నారాయణరెడ్డి, కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, కడెంపల్లి శ్రీనివాస్, పట్వారి శ్రావణ్‌కుమార్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, హరిజీవన్ స్వామి పాల్గొన్నారు.



## పశుసంపదతో రైతుకు ఆదాయం




**ప్రజాపక్షం/గండిపేట్ :** పశువైద్య విస్తరణ విభాగం, పశు వైద్య కళాశాల రాజేంద్రనగర్ వారి ఆధ్వర్యంలో పాడిపశువుల రంగంలో ఐసిఆర్ పివి నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం వారు రూపొందించిన వివిధ ఆవిష్కరణలపై ఒక రోజు వర్క్ షాప్ బుధవారం నిర్వహించారు. ఈ వర్క్ షాప్ లో పాడి పశువుల పెంపకంలో క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, వాటిని అధిగమించడానికి ఐసిఆర్, పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం వారు రూపొందించిన వివిధ ఆవిష్కరణలపై కులంకుశంగా చర్చించి వాటిని రైతులకు ఏ విధంగా చేరవేర్చాలో రోడ్ మ్యాప్ ప్రిపేర్ చేశారు.ఇంటర్నెట్ ను ఉపయోగించి పశుసంపద గురించి కావలసిన సమాచారాన్ని రైతులకు చేరవేర్చడానికి రూపొందించిన వివిధ మోడ్యుల్స్ ని గురించి కూడా చర్చించారు. పాడి, పశుసంపదతో రైతుకు ఆదాయం వస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రర్ డాక్టర్ శరత్ చంద్ర గారు,డీన్ ఆఫ్ ఫ్యాకల్టీ డాక్టర్ ఉదయ్ కుమార్ ,పరిశోధక సంచాలకులు డాక్టర్ సిహెచ్ హరికృష్ణ , విస్తరణ సంచాలకులు డాక్టర్ కిషన్ కుమార్, పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధురి,ఈ కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ సిహెచ్ సత్యనారాయణ, వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

## హక్కుల కోసం పోరాడిన యోధుడు ధర్మభిక్షం

సిపిఐ రాష్ట నాయకుడు రవీంద్రాచారి





**ప్రజాపక్షం/అబ్దులాపూర్‌మెట్ :** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, జీవితకాలం అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం చేసినా మహనీయుడు ధర్మ భిక్షం అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి అన్నారు. సిపిఐ అబ్దులాపూర్‌మెట్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ధర్మభిక్షం 14వ వర్ధంతిని నిర్వహించారు. మండల కేంద్రంలోని కూడలిలో ఉన్న ధర్మభిక్షం విగ్రహానికి సిపిఐ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రాచారి మాట్లాడుతూ భూ పోరాటం ద్వారా వందలాది ఎకరాల సాగు భూమిని పేదలకు పంచినా ఘనత ధర్మభిక్షంకు దక్కుతుందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో జైలు జీవితం అనుభవించారని తెలిపారు. పేద విద్యార్థుల చదువుకునేందుకు అప్పట్లలోనే స్వచ్ఛందంగా హాస్టళ్లను ఏర్పాటు చేశారన్నారు. ఆయన అశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. ధర్మభిక్షం వర్ధంతి సందర్భంగా ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, మాజీ కౌన్సిలర్ పబ్బతి లక్షణ్, నాయకులు అజ్మీర్ హరిసింగ్ నాయక్, కేతరాజు నర్సింహ్మా, అరుణ, నవనీత, మధు, యాదగిరి, వెంకన్న, రాములు, తదితరులు పాల్గొన్నారు.

**ఎల్బీ నగర్ :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, కమ్యూనిస్టు నాయకుడు బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతిని హయత్ నగర్ మండల సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి, ఎల్బీ నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి బాతరాజు నర్సింహ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దున్నేవాడికే భూమి, గీసేవాడికే చెట్టు నినాదంతో గీత కార్మికుల హక్కుల కోసం పోరాడిన ప్రజల మనిషి ధర్మభిక్షం అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమన్నారు. భవిష్యత్ తరాలకు ధర్మభిక్షం మార్గదర్శకమని తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి రమావత్ శక్రు నాయక్, మండల కృష్ణ, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు అలివేణి, శివజ్యోతి, సరిత, సౌజన్య, రాములు,శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## సిసి రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్



**ప్రజాపక్షం/అల్వాల్ :** మచ్చ బొల్లారం డివిజన్ సాయి సూర్య కాలనీ లప్పం గోదాం దగ్గర రూ. 38 లక్షలతో సిసి రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలలో, బస్తీలలో ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలను అందిస్తూ దశలవారీగా ప్రణాళికాబద్ధంగా డివిజన్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు అశోక్ రెడ్డి, సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్, నర్సింగ్, నవీన్, కాలనీ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## అందుబాటులోకి నూతన పోస్ట్ ఆఫీస్

### మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** చాలాకాలం నుండి ప్రజలు ఎదురుచూస్తున్న నూతన పోస్ట్ ఆఫీసును ఎట్టకేలకు ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలోని అవుషాపూర్ గ్రామంలో పోస్ట్ ఆఫీసర్ ఐఎఎస్ సుబ్రహ్మణ్యం, మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఏనుగు కావేరి మచ్చేందర్ రెడ్డిలు కలిసి నూతనపోస్ట్ ఆఫీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డిలు మాట్లాడుతూ అవుషాపూర్ గ్రామంలో నూతన పోస్ట్ ఆఫీసు ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషకరమైన విషయం అని వృద్ధులకు పెన్షన్ కోసం దూరంగా వెళ్లవలసిన అవసరం లేకుండా ఉంటుందని అన్నారు. సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ ఖాతా 60 సంవత్సరాలు పైబడిన భారతీయ నివాసితులకు అందించే పొదుపు పరికరం ప్రజలు ఖాతా తెరిచిన తేదీ నుండి 5 సంవత్సరాల తర్వాత డిపాజిట్ పొద్దవచ్చని పెట్టుబడిదారుడు అదనంగా 3 సంవత్సరాలు ఒకసారి పొడిగించవచ్చు, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ అనేది భారత ప్రభుత్వం ప్రకటించిన దీర్ఘకాలిక పెట్టుబడి పథకం సురక్షితమైన పోస్ట్ ఆఫీస్ డిపాజిట్ పథకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కడుపోల్ల మల్లేష్, కుతాడి రవీందర్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కోరుబోతు నాగరాజు ముదిరాజ్, డీసీసీ కార్యదర్శి ఉల్లి ఆంజనేయులు యాదవ్, కావాడి మాధవ్ రెడ్డి, యూత్ అధ్యక్షులు బొక్క సంజీవ రెడ్డి,డోంకెన్ శంకర్ గౌడ్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్టు తండ్రికి నివాళి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి సీనియర్ జర్నలిస్టు కడియాల రమేష్ తండ్రి గారైన సీనియర్ నాయకులు కడియాల పోచయ్య మంగళవారం మృతి చెందారు.బుధవారం ఆయన నివాసంలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ ఎంఎల్‌ఎ ఎన్‌వి ఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవిలు పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగారం మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, నాయకులు రుద్రగోని రాంచందర్‌గౌడ్, కె నర్సింగ్‌రావు, డి నాథం, తదితరులు పాల్గొన్నారు.



## భద్రాద్రి సీతారాముల తలంబ్రాలు ఇంటికే

### హకింపేట డిపో మేనేజర్ భవభూతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** భద్రాచలంలో నిర్వహించే శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవ తలంబ్రాలు ఇంటికి చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (ఆర్‌టిసి) పూర్తి చర్యలు తీసుకుంటుందని హాకింపేట డిపో మేనేజర్ భవభూతి అన్నారు. బుధవారం తూంకుంట మున్సిపాలిటీలోని హాకింపేట డిపోలో శ్రీసీతారాముల తలాంబ్రాల వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ భవభూతి మాట్లాడుతూ భద్రాచలంలో నిర్వహించే శ్రీసీతారాముల కల్యాణానికి వెళ్లలేని భక్తుల సౌకర్యా ర్థం తలాంబ్రాలను నేరుగా ఇంటికే పంపించుటకు ఆర్‌టిసి అవకాశం కల్పిస్తుందన్నారు. కేవలం రూ.151 చెల్లించి తలాంబ్రాలను బుక్ చేసుకుని రసీదు పొందగలరని తెలిపారు. ఇట్టి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయ్‌కుమార్, సంజీవ, ఎడిసి సుబాను, శ్రీనివాస్, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జెఎస్ రెడ్డి, కౌంటర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/బంట్వారం :** బంట్వారం మండల పరిధిలో ఉన్న యాచారం గ్రామంలో వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకున్న ఆత్మహత్య ఘటన స్థానిక పోలీస్టేషన్‌లో చోటు చేసుకుంది. స్థానికులు పోలిసులు తెలిపిన వివరాల ప్రకారం యాచారం గ్రామానికి చెందిన సుడే మహిపాల్ రెడ్డి (35) మంగళవారం రాత్రి మద్యం ఇంట్లో నుండి వెళ్లి పోయి ప్రాథమిక పాఠశాలలోని చెట్టుకు ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం పాఠశాలలో ఎవ్వరో ఉరి వేసుకున్నారని గ్రామస్తులకు విద్యార్థులు సమాచారం ఇవ్వడంతో దాంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చారు.పోలీసులు అక్కడికి చేరుకోని భార్య మీనాక్షి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ శ్రీశైలం పేర్కొన్నారు. మృతిడికి ఇద్దరు కూమారులు ఒక కూమార్తె ఉన్నారు. శవ పరీక్ష అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

## జాతీయ రహదారుల పనులు వేగవంతం

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు ప్రాంతంలోని రోడ్ల సమస్యలపై తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి మరోమారు అసెంబ్లీ సమావేశంలో గళమెత్తారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి తాండూరు ప్రాంతంలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, రోడ్ల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని కోరారు. వికారాబాద్ జిల్లాలోని తాండూరు రోడ్లకు రాజయోగం కల్పించాలని కోరారు. తాండూరులో గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో మంజూరైన బైపాస్ రోడ్డు ఇంకా పూర్తి కాలేదని సభాదృష్టికి తీసుకవచ్చారు. ఏండ్లు గడుస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు నత్తనడక సాగుతున్నాయని వివరించారు. మహబూబ్‌నగ్ నుంచి తాండూరు మీదుగా చించోల్లి వరకు చేపడుతున్న జాతీయ రహదారుల పరిస్థితి ముందుకు సాగడం లేదని అన్నారు. ఈ సమస్యసలపై ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందిస్తూ మనోహర్‌రెడ్డి సూచించిన రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## కమ్యూనిస్టు సిద్ధాంత ఆచరణీయుడు

# కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** కమ్యూనిస్టు సిద్ధాంత ఆచరణీయుడు కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం ఆశయాల మేరకు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్ అన్నారు. ధర్మభిక్షం 14వ వర్ధంతి సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దున్నే వాడికి భూమి, గీసే వాడికే చెట్టు అన్న నినాదంతో గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేసారన్నారు. తెలంగాణా సాయధ, రైతాంగ పోరాట యోధులైన ఆయన చివరి శ్వాసవరకు ప్రజల కోసమే నిర్విరామంగా పోరాటం చేసిన మహనీయులు ధర్మభిక్షం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జి.దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ శంకరరావు, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, పార్టీ నియోజకవర్గ నేతలు నారా నర్సింహ, లక్ష్మణ్, మురహరి, రాములు తదితరులు పాల్గొన్నారు. నాగోల్‌లో సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయంలో ఎస్ఎ డాంగే భవన్‌లో ఉదుతల మల్లేష్ ఆధ్వర్యంలో జరిగిన ధర్మభిక్షం వర్ధంతి కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా సమితి సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ ఘనంగా నివాళులర్పించారు. సమాజంలోని అసమానతలను తొలగించేందుకు స్వచ్ఛందంగా విద్యా సంస్థలు ఏర్పాటు చేసి యువతకు ఆయన ఎనలేని సేవలం దించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ప్రదీప్ కుమార్, రవి కుమార్, ఆమని, అఖిల, నాగభూషణం, జగన్, తదితరులు పాల్గొన్నారు. **శామీర్‌పేటలో :** ప్రజల మనిషి బొమ్మగాని ధర్మ భిక్షం మాజి ఎంపి 14వ వర్ధంతిని మూడుచింతలపల్లి మండల కేశవరంలో బుధవారం నిర్వహించారు. ధర్మబిక్షం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ధర్మ బిక్షం ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు సిపిఐ నాయకులు రాములుగౌడ్, వెంకటేష్ యాదవ్, యాదగిరిగౌడ్, వీర స్వామి, తదితరులు పాల్గొన్నారు.







## కామ్రేడ్ సూర్యనారాయణ మృతి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** తిరిప్రసాద్ నగర్ జవహర్‌నగర్ మున్సిపాలిటి ప్రసాద్‌నగర్ కాలనీకి చెందిన కామ్రేడ్ సూర్యనారాయణ మంగళవారం తుదిశ్వాస విడిచారు. కమ్యూనిస్టు ఉద్యమాల్లో పాల్గొన్న ఆయన ప్రజా సమస్యల కోసం విశేష కృషి చేసారంటూ కామ్రేడ్ తోటపల్లి శంకర్, ఎంపిటిసి మండల కార్యదర్శి మోతే రాజేశ్వరి, ఎఐటియుసి మండల అధ్యక్షులు ఎల్లయ్య, సహాయ కార్యదర్శి కొండ సత్యం, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప, నాయక్, మహిళా సమైక్య నాయకురాలు కొత్తపల్లి కవిత అనసూయ, మల్లికలు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.



## డంపింగ్ యార్డును పరిశీలించిన హైడ్రా ఇన్‌స్పెక్టర్

**ప్రజాపక్షం/అల్వాల్ :** మచ్చ బొల్లారం డివిజన్ లోని హిందూ స్మశాన వాటికను కాపాడాలి డంపింగ్ యార్డ్ ను ఎత్తివేయాలని గత కొద్ది రోజులనుండి 50 కాలనీల ప్రజలు నిరసనలు దీక్షలు కొనసాగుతున్నాయి. డంపింగ్ యార్డ్ ఎత్తివేయాలని పై అధికారులకు వినతి పత్రం అందజేయడం జరిగింది. అల్వాల్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి హైడ్రా తహసిల్దార్ హేమమాలిని రెవెన్యూ ఇన్స్పెక్టర్లు తో కలిసి హైడ్రా ఇన్స్పెక్టర్ ఆదిత్య గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మచ్చ బొల్లారంలో ఉన్న డంపింగ్ యార్డ్ పై అధికారుల తో మాట్లాడి సర్వే నిర్వహించి ప్రజలకు న్యాయం చేసే విధంగా చూస్తార ని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, కాలనీల జేఏసీ నాయకులు సుధాకర్ ఉదయ ప్రకాష్ కవిత స్థానిక నాయకులు నార్ల సురేష్, డోలి రమేష్, అనిల్ కిషోర్ గౌడ్, ఢిల్లీ పరమేష్, పవన్, చరణ్ గిరి, తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులకు ప్రభుత్వ నిధుల పంపిణీ



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందులకు గాను ప్రభుత్వ పరంగా మల్లాపూర్ డివిజన్‌లోని ఆరు మసీదులకు ఒక్కో మసీదుకు మంజూరైన రూ.2లక్షల చెక్కులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డిలు బుధవారం పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు బాషిత్ ఖాన్, ఎండి అల్లాఫ్, ఎండి మునీర్, ఉస్మాన్, గని మజీద్ అధ్యక్షులు జాకీర్ అలీ, జమాల్ అధ్యక్షుడు నయీమ్, జమా మజీద్ అధ్యక్షుడు హబీబ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలి

### మంత్రి సీతక్కకు వినతిపత్రం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని పంచాయతిరాజ్ మంత్రి సీతక్కకు ఐఎఫ్‌టియు నాయకుల ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం సమర్పించారు. మున్సిపాలిటీలో గత 5 నెలలుగా జీతాలు రావడం లేదని అలాగే పంచాయతిలో గత 3 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని మంత్రి సీతక్క దృష్టికి తీసుకవచ్చారు. మంత్రి సానుకూలంగా స్పందించారని వేతనాలు చెల్లించేలా త్వరలో నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐఎఫ్‌టియు నాయకులు శ్రీనివాస్, శివబాబు, అనురాధ, యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, మండల నాయకులు నాగరాజు, వెంకటేష్, బాలయ్య, శారద, శామీర్‌పేట, కీసర మండలాల పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తులు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువవికాస పథకానికి అర్హులైన వారు సమీప మీసేవా కేంద్రాల్లో ఏప్రిల్ 5 లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని శామీర్‌పేట ఎంపిడిఒ మమతా బాయి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 వేలలోపు ఆదాయం ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ ఈబిసి/ఇడబ్ల్యుఎస్ కమ్యూనిటికి చెందిన వారు వయస్సు వ్యవసాయేతర పథకాలకు 21 నుంచి 55 లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాల పథకాలకు 21 నుంచి 60 లోపు వయస్సుగల అభ్యర్థులు అర్హులని తెలిపారు. మీసేవలో దరఖాస్తు చేసుకున్న తర్వాత ఒరిజినల్ దరఖాస్తులను ఎంపిడిఒ కార్యాలయంలో సమర్పించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

# అమెజాన్ గోదాంలపై బిఐఎస్ అధికారుల దాడులు

* రూ.50 లక్షల విలువైన 2783 ఉత్పత్తులు స్వాధీనం
* కేర్ యాప్ ద్వారా వస్తువుల నాణ్యతను పరిశీలించండి : బిఐఎస్ అధికారి శ్రీకాంత్





**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అమెజాన్‌లో భారీగా నకిలీ వస్తువులు, ఉపకరణాలు పట్టుబడటం నగరంలో కలకలం సృష్టించింది. ఐఎస్ఐ మార్కు, రిజిస్ట్రేషన్ మార్కు లేని ఉత్పత్తులను నిల్వ చేశారన్న సమాచారంతో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) హైదరాబాద్ శాఖ అధికారులు బుధవారం అమెజాన్ గోదాములపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పెద్ద ఎత్తున బిఐఎస్ ధ్రువీకరణ పొందని గృహోపకరణాలు, సాంకేతిక ఉపకరణాలను గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ బిఐఎస్ అధికారి పివి శ్రీకాంత్ ఆదేశాలతో హైదరాబాద్ పరిధిలోని ఎయిర్‌పోర్ట్ సిటీలో ఉన్న అమెజాన్ గోదాంలో మంగళవారం బిఐఎస్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా దాదాపు రూ. 50లక్షల పైగా విలువైన 2783 ఉత్పత్తులకు బిఐఎస్ ధ్రువీకరణ లేదని గుర్తించినట్లు తెలిపారు.

ఐఎస్ఐ మార్క్, రిజిస్ట్రేషన్ మార్కులేని ఉత్పత్తులను జప్తు చేసినట్లు వెల్లడించారు.150 స్మార్ట్ వాచీలు, 15 ఎలక్ట్రిక్ వాటర్ హీటర్లు, 30 సిసిటీవీ కెమెరాలు, 16 మిక్సర్లు, 10 ప్రెజర్ కుక్కర్లు, 1937 స్టెయిన్ లెస్ స్టీల్ వాటర్ బాటిళ్లు, 326 వైర్లెస్ ఇయర్ బడ్స్, 170 మొబైల్ ఛార్జర్లు, ఇతర గృహోపకరణాల ను జప్తు చేసి కేసు నమోదు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. బిఐఎస్ చట్టం 2016లోని పలు సెక్షన్ 17 ప్రకారం భారత ప్రభుత్వం బిఐఎస్ ధ్రువీకరణ తప్పనిసరి చేసిన ఉత్పత్తులేవీ ఐఎస్ఐ మార్కు, ఎలక్ట్రానిక్ వస్తువులకు రిజిస్ట్రేషన్ మార్కు లేకుండా, బిఐఎస్ అనుమతి పొందకుండా తయారు చేసినా, విక్రయించినా, నిల్వ చేసినా రెండేళ్ల జైలు శిక్ష, రూ.2లక్షల జరిమానా మొదటిసారి..ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5లక్షల వరకూ జరిమానా రెండోసారి.. తదుపరి దీనికి పదిరెట్ల వరకూ శిక్ష పడే అవకాశం ఉంది. ఇప్పటివరకు భారత ప్రభుత్వం 679 ఉత్పత్తులను తప్పనిసరి చేస్తూ పలు క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్లు విడుదల చేసింది. వీటిని ఎవరు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని శ్రీకాంత్ వెల్లడించారు. భారతీయ ప్రమాణాలపై ప్రతీ ఒక్క వినియోగదారుడూ అవగాహన కలిగి ఉండాలని, బిఐఎస్ కేర్ యాప్ ద్వారా వస్తువుల నాణ్యతా ప్రమాణాలను గుర్తించాలని, ఉల్లంఘనలను గుర్తిస్తే అదే యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ దాడుల్లో బిఐఎస్ హైదరాబాద్ శాఖ జాయింట్ డైరెక్టర్ రాకేశ్ తన్నీరు, డిప్యూటీ డైరెక్టర్ కెవిన్, ఎస్‌పిఒ అభిసాయి ఇట్ట, జేఎస్ఏ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ భూముల కబ్జాకు యత్నం

### గిరిజన మనోభావాలను దెబ్బతీస్తున్న కార్పొరేట్ శక్తులు ఎల్‌హెచ్‌పిఎస్ జాతీయ కోశాధికారి హన్మంతు నాయక్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నానక్‌రామగూడలోని కాళీ మాత దేవాలయం మాన్యం భూము లను కబ్జా చేసే ప్రయత్నం జరుగుతున్నదని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పిఎస్) జాతీయ కోశాధికారి, తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జి సభావత్ హన్మంతు నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ రాజకీయ పార్టీలు, సంస్థలకు చెందిన నాయకులు ఈ ఆలయాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. నానక్‌రామగూడలో స్వయం భూవుగా వెలిసిన కాళీమాత ఆలయంతో పాటు శివుడు, వినాయకుడు, హనుమాన్ తదితర ఆలయాలు కూడా ఉన్నాయని తెలిపారు. అయితే ఆలయం ఉన్న ప్రాంతంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలన్నీ తాము కొనుగోలు చేసినట్లు ఒక కార్పొరేట్ సంస్థకు చెందిన ప్రతినిధులు చెబుతున్నారని, ఈ క్రమంలో ఆలయాన్ని పాక్షికంగా లేదా పూర్తిగా ధ్వంసం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. వాస్తవానికి ఈ ఆలయంలో నానక్‌రామగూడ తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు కొన్ని తరాలుగా పూజలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గిరిజనులు భక్తిగా కొలుచుకునే కాళీమాత ఆలయానికి విఘా తం కల్పించడం, అన్యాక్రాంతం చేయడానికి పెద్ద ఎత్తున కుట్రలు జరగడం ఆందోళన కలిగిస్తున్నాయని హన్మంతు నాయక్ అన్నారు. ఆలయ పరిరక్షణ బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కాళీమాత ఆలయానికి చెందిన ఒక్క గజం భూమి కూడా కబ్జాకు గురైనా సహించబోమని ఆయన స్పష్టం చేశారు. కాళీమాత ఆలయ పూజారి, సంరక్షకుడు కైలాష్‌సింగ్ మాట్లాడుతూ శతాబ్దాల చరిత్ర ఉన్న ఆలయాన్ని పడగొట్టే కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ భూమి సంరక్షించు కోవాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వపరంగా తమకు సహాయ సహకారాలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకు ముందు ఆలయం వద్ద సుమారు 150 మంది గిరిజనులు, స్థానికులు కబ్జాయత్నాలకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనలో బీజేపీతో పాటు వివిధ రాజకీయాల పార్టీలు, సంస్థలు, ఎల్హెచ్‌పిఎస్ నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు విడుదల

### కలెక్టర్ ప్రతీక్‌జైన్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** తెలంగాణ ప్రజా ప్రభుత్వం ద్వారా మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఇందిరా మహిళా శక్తి పథకం అమలు చేస్తూ మహిళా అభ్యునతికి అనేక రకాల కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది అందులో భాగంగా మహిళా సంఘులకు వడ్డీ లేని ఋణాలు అందిస్తుంది.

మన వికారాబాద్ జిల్లాలో 10805 మ మహిళా సంఘాలకు ఏప్రిల్ 2024నుండి జనవరి వరకు బ్యాంకు లింకేజి, స్త్రీనిధి ఋణాలకు రూ.20.35కోట్ల రూపాయలు మంజురు చేయడం జరిగింది అని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రిన సీతక్కు ప్రత్యేకమైన ధన్యవాదములు తెలపడ జరిగింది .అలాగే గ్రామిణజిల్లా అభివృద్ధి సంస్థకు జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలియజేసినారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలుకు చర్యలు : అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 202425 రబి సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రబీ లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. రబీ వరి కొనుగోలు ప్రణాళిక ప్రకారం ముందస్తు చర్యలు తీసుకోవాలని ,మిల్లులకు తేమ లేకుండా కేంద్రాలకు తీసుకురావలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలసిన బాద్యత మన అందరిపై ఉందని అన్నారు. జిల్లాలో 128 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ,ప్రతి కొనుగోలు కేంద్ర దగ్గర ఏర్పాటు చేసి ధరలు తేమ శాతం తదితర వివరాలు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర దగ్గర క్లీనింగ్ మిషన్ తేమ శాతం కొలిచే పరికరాలు ,త్రాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం దగ్గర ఎఐఓలు ఇచ్చే టోకెన్లు ప్రకారము రైతులు వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని మద్దత్తు ధర ఎగ్రేడ్ 2320 మరియు సన్న రకానిక అదనంగా క్వింటాంకుకు రూ500లు బోనస్ ఇవ్వడం జరుగుతుంది అని సాధారణ 2300 ప్రతి క్వింటంలుకు ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు. ఈ సమావేశంలో డియస్ఓ మోహన్‌బాబు, వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారి గోపాల్ , తదితరులు పాల్గోన్నారు.

# క్రీడ

# రాజస్థాన్‌పై కెకెఆర్ ఘన విజయం!

## క్వింటన్ డికాక్ విధ్వంసం..







ఐపిఎల్ 2025 సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్(కేకేఆర్) ఎట్టకేలకు బోణీ చేసింది. ఓటమితో ఈ సీజన్ ప్రారంభించిన కేకేఆర్.. రాజస్థాన్ రాయల్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించి 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. క్వింటన్ డికాక్(61 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లతో 97 నాటౌట్) అసాధారణ బ్యాటింగ్‌తో కేకేఆర్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 151 పరుగులు చేసింది. ధ్రువ్ జురెల్(28 బంతుల్లో 5 ఫోర్లతో 33), యశస్వి జైస్వాల్(24 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 29) టాప్ స్కోరర్లుగా నిలిచారు. కేకేఆర్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి(2/17), మోయిన్ అలీ(2/23), హర్షిత్ రాణా(2/36), వైభవ్ అరోరా(2/33) రెండేసి వికెట్లు తీయగా.. స్పెన్సర్ జాన్సన్ ఓ వికెట్ పడగొట్టాడు.

కేకేఆర్ 17.3 ఓవర్లలో 2 వికెట్లకు 153 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. క్వింటన్ డికాక్‌తో పాటు, అంగ్‌క్రిష్ రఘువంశీ(17 బంతుల్లో 2 ఫోర్లతో 22 నాటౌట్) రాణించాడు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో వానిందు హసరంగా ఒక్కడే వికెట్ తీసాడు. రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ చెత్త కెప్టెన్సీ ఆ జట్టు కొంప ముంచింది. బౌలర్లను రియాన్ పరాగ్ సరిగ్గా ఉపయోగించుకోలేకపోయాడు. రాజస్థాన్ రాయల్స్‌కు ఇది వరుసగా రెండో పరాజయం.

## అప్పుడు శ్రేయస్.. తర్వాతి ప్లేయర్ సీఫెర్ట్



పాకిస్థాన్ తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లోని చివరి మ్యాచ్‌లో టిమ్ సీఫెర్ట్ తన విధ్వంసకర బ్యాటింగ్ తో సంచలనం సృష్టించాడు. సిరీస్‌లోని చివరి మ్యాచ్ లో టిమ్ సీఫెర్ట్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి అజేయంగా 97 పరుగులు చేశాడు. తన ఇన్నింగ్స్‌లో సీఫెర్ట్ 10 సిక్సర్లు, 8 ఫోర్లు కూడా కొట్టాడు. న్యూజిలాండ తరఫున సీఫెర్ట్ తన సెంచరీని కోల్పోయి ఉండవచ్చు కానీ తన బ్యాటింగ్ తో ఇప్పటికీ సంచలనం సృష్టించాడు. టిమ్ సీఫెర్ట్ 38 బంతుల్లో 97 పరుగులు చేసి మ్యాచ్‌ను గెలిపించాడు. 24 గంటల్లో ఒక ఆటగాడు సెంచరీకి తక్కువ దూరంలో ఉన్నప్పటికీ తన జట్టును విజయపథంలో నడిపించడం ఇది రెండో సారి. టిమ్ సీఫెర్ట్ కంటే ముందు ఐపీఎల్ లో గుజరాత్ టైటాన్స్‌పై శ్రేయస్ అయ్యర్ సెంచరీ చేయకుండా 97 పరుగులు చేసి జట్టును విజయపథంలో నడిపించాడు. శ్రేయస్ అయ్యర్ కు సెంచరీ పూర్తి చేసే అవకాశం వచ్చింది. కానీ శ్రేయస్ అయ్యర్ జట్టు విజయాన్ని ఎంచుకున్నాడు.

## ఇది క్రికెట్ కాదు.. రబడా సంచలన వ్యాఖ్యలు!



ఐపీఎల్ 2025 సీజన్ సాగుతున్న తీరుపై గుజరాత్ టైటాన్స్ పేసర్, సౌతాఫ్రికా స్టార్ క్రికెటర్ కగిసో రబడా అసహనం వ్యక్తం చేశాడు. బ్యాటర్లే పూర్తి ఆధిపత్యం చెలాయిస్తుండటంపై తనదైన శైలిలో మండిపడ్డాడు. అసలు ఇది క్రికెట్ అంటారా? అని ప్రశ్నించాడు. ఇది ఏ మాత్రం క్రికెట్ కాదని, ఈ ఆటను బ్యాటింగ్ అని పిలవాలని సెటైర్లు పేల్చాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లు జరగ్గా.. నాలుగు మ్యాచ్‌ల్లో భారీ స్కోర్లు నమోదయ్యాయి. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌లపై సునాయసంగా 250 ప్లస్ రన్స్ నమోదవుతున్నాయి. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ కూడా బౌలర్ల పాలిట శాపంగా మారింది. గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్ మధ్య మంగళవారం జరిగిన మ్యాచ్‌లోనూ భారీ స్కోర్లే నమోదయ్యాయి. దాంతో లీగ్ జరుగుతున్న తీరు.. బ్యాటర్ల ఆధిపత్యంపై రబడా అసహనం వ్యక్తం చేశాడు.

# రీల్




## ఆర్‌సి16 మెగా ట్రీట్‌కు టైమ్ ఫిక్స్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఆర్‌సి16 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోంది. ఈ సినిమాను దర్శకుడు బుచ్చిబాబు సానా డైరెక్ట్ చేస్తుండగా స్పోర్ట్స్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇక ఈ సినిమా నుంచి సాలిడ్ అప్డేట్ అయితే మేకర్స్ తాజాగా ఇచ్చారు. రామ్ చరణ్ బర్త్ డే సందర్భంగా ఆర్‌సి16 ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు టైటిల్‌ను మార్చి 27న ఉదయం 9.09 గంటలకు అనౌన్స్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. ఈ మేరకు ఓ ప్రీలుక్ పోస్టర్ ద్వారా ఈ విషయాన్ని రివీల్ చేశారు. ఇక ఈ సినిమాలో రామ్ చరణ్ పాత్ర ఎంత రగడ్‌గా ఉండబోతుందో ప్రీలుక్ పోస్టర్ చూస్తే అర్థమవుతోంది. దీంతో ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ఎలాంటి ఇంపాక్ట్ చేయబోతుందా అని మెగా ఫ్యాన్స్ ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఇక ఈ సినిమాలో అందాల భామ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా కన్నడ స్టార్ హీరో శివ రాజ్‌కుమార్, జగపతి బాబు తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఏఆర్.రెహమాన్ సంగీతం అందిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లు సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నాయి.



## ఈ ఓటిటిలోకి వచ్చేసిన మహేష్ 'ముఫాసా'

మన టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా నటించిన లాస్ట్ చిత్రం గుంటూరు కారం. మరి ఈ సినిమా తర్వాత కొన్నేళ్లు పాటుగా మహేష్ నుంచి కొత్త సినిమాలు ఏవి లేవని అందరికీ తెలుసు. కానీ మధ్యలో మహేష్ పాత సినిమాలే రీరిలీజ్ కి తెచ్చుకున్నారు అభిమానులు. కానీ ఈ సినిమాలు కాకుండా మహేష్ నుంచి ఓ కంప్లీట్ కొత్త సినిమా ట్రీట్ ఇచ్చింది. ఆ సినిమానే ముఫాసా – ది లయన్ కింగ్. హాలీవుడ్ కి చెందిన చిత్రం డిస్నీ సంస్థ నుంచి వచ్చిన ఈ లైవ్ యానిమేటె చిత్రం మంచి హిట్ అయ్యింది. ఇక ఈ సినిమా తెలుగు వెర్షన్ కి మహేష్ బాబు ముఫాసాగా డబ్బింగ్ చెప్పిన ఈ చిత్రం తెలుగులో మంచి మైలేజ్ ఇచ్చింది. ఇలా థియేటర్స్ లో పిల్లలు పెద్దలని అలరించిన ఈ చిత్రం ఇపుడు ఓటిటిలో సందడి చేసేందుకు వచ్చేసింది. ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు జియో హాట్ స్టార్ వారు సొంతం చేసుకోగా నేడు మార్చ్ 26 నుంచి ఈ చిత్రం అందుబాటులోకి వచ్చేసింది. ఇంగ్లీష్ సహా మన తెలుగులో కూడా ఈ చిత్రం అందుబాటులో ఉంది. సో అప్పుడు మిస్ అయ్యినవారు ఇపుడు చూడొచ్చు.




## బుకింగ్స్‌లో ఎంపురాన్ సెన్సేషన్!

మళయాళ సినిమా బిగ్గెస్ట్ స్టార్స్ లో ఒకరైన మోహన్ లాల్ హీరోగా పృథ్వీరాజ్ సుకుమారన్ నటుడుగా అలాగే దర్శకునిగా కూడా చేసిన లేటెస్ట్ సాలిడ్ చిత్రమే ఎంపురాన్. తమ బిగ్గెస్ట్ హిట్ లూసిఫర్ కి సీక్వెల్ గా ఎల్ 2 ఈ ఎంపురాన్ పేరిట తెరకెక్కించిన ఈ సినిమాపై మళయాళ సినిమాలో ఏ చిత్రానికి లేని భారీ హైప్ నెలకొంది.ఇలా బుకింగ్ ఓపెన్ చేసుకున్న ఈ చిత్రం కేవలం వీటితో రికార్డులు స్టార్ట్ చేసింది. గంటలో సహా డే 1 కి కూడా ఆల్ టైం హైయెస్ట్ నంబర్స్ సెట్ చేసిన ఈ చిత్రం ఇపుడు వీకేండ కి ఏకంగా 70 కోట్ల రేంజ్ బుకింగ్స్ ని వరల్డ్ వైడ గా నమోదు చేసుకున్నట్టు తెలుస్తుంది. దీనితో పాటుగా రిలీజ్ కి ముందు కూడా బుక్ మై షోలో 1 మిలియన్ కి పైగా బుకింగ్స్ ని నమోదు చేసిన తక్కువ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఇలా మొత్తానికి ఎంపురాన్ హవా ఓ రేంజ్ లో ఉందని చెప్పాలి

## విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాలి

### కొత్తగూడెంలో మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు

### శాసనమండలిలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ప్రక్షాళన మొదలు పెట్టాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనమండలిలో బుధవారం 'తెలంగాణలో విద్య' అంశంపై స్వల్పకాలిక చర్చకు ముఖ్యమంత్రి సమాధానమిచ్చారు. విద్యా వ్యవస్థలో ప్రక్షాళన మొదలు పెడదామంటే రాజకీయ పార్టీలు రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని రేవంత్‌రెడ్డి అన్నారు. రాజకీయ కోణంలో ఆలోచన చేసినన్ని రోజులు ప్రక్షాళన చేయలేమని సిఎం స్పష్టం చేశారు. సమాజంలో అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థుల్లో నైపుణ్యం కొరవడుతుందని, అందుకే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. మన విద్యా ప్రమాణాలు పడిపోవడంపై కేవలం ప్రభుత్వమే కాదు.. తెలంగాణ సమాజం కూడా బాధ్యత వహించాలన్నారు. కొత్తగూడెంలో మైనింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని సిఎం వెల్లడించారు. విద్యావ్యవస్థపై 2021లో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే జరిగిందని, ఈ సర్వేలో మూడో తరగతి, ఐదో తరగతి చదివే వారిలో 75 శాతం మంది విద్యార్థులు ఏ సబ్జెక్టులో కనీస ప్రాథమిక సామర్థ్యం కూడా చూపలేదని తేలిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సబ్జెక్టుల వారీగా దేశంలో 37 ర్యాంకుల్లో తెలంగాణ ఏ స్థానంలో ఉందో గమనిస్తే మూడో, ఐదో తరగతులకు సంబంధించి తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో తెలంగాణది 36వ ర్యాంకుగా, గణితంలో 35గా ర్యాంకు, ఇవిఎస్‌లో 36వ ర్యాంకు ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక సంఖ్య 6.50 లక్షలు తగ్గిందని సిఎం పేర్కొన్నారు. దాదాపు 10 వేల టీచర్ల ఉద్యోగాలు భర్తీ చేశామని, 36 వేల మంది టీచర్ల బదిలీలు ఎలాంటి ఆరోపణలు లేకుండా పూర్తి చేశామని అన్నారు. రాష్ట్రంలో 26,100 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో డే స్కాలర్ విద్యార్థిపై ప్రభుత్వం రూ.1,8000 ఖర్చు పెడుతుందన్నారు. మొత్తం 98000 రెసిడెన్షియల్ స్కూల్స్‌లో చదివే ఒక్కో విద్యార్థిపై కూడా ఖర్చు పెడుతున్నాం. మరి ప్రభుత్వం ఎక్కడ విఫలమైందో చెప్పండి? అని సిఎం సభ్యులను ప్రశ్నించారు.

**ఏప్రిల్ 1 నుంచి ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు**

ఏప్రిల్ 1 నుంచి మార్చి 31, 2026 లోగా 12 వాయిదాలలో గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సమయానుగుణంగా ఎప్పటికప్పుడు చెల్లిస్తామన్నారు. కొందరు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్ పెట్టి, రిటైర్డ్ లైఫ్ హ్యాపీగా ఎంజాయ్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రిటైరైన వారి లయబిలిటీస్‌ను తీసుకుని బకాయిలు చెల్లించే బాధ్యత తమదేనన్నారు. పాలమూరు రంగారెడ్డికి గతంలో ఏ పేరు లేదని, అందుకే పాలమూరు ఎత్తిపోతలకు జైపాల్‌రెడ్డి పేరు పెట్టామని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన పేరును పాలమూరు ఎత్తిపోతలకు పెట్టుకోవడం సహేతుకమన్నారు. తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన వ్యక్తి జైపాల్‌రెడ్డి ఉత్తమ పార్లమెంటేరియన్ అయిన ఆయన సేవలు మరువలేమన్నారు.

## స్ఫూర్తినిచ్చిన నేత

(మొదటి పేజీ తరువాయి)



పేరు మీద మండల కేంద్రాలలో స్మారక మందిరాలు నిర్మించాలని సాంబశివరావు అన్నారు. బొమ్మగాని ధర్మభిక్షం 14వ వర్ధంతి సందర్భంగా బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ధర్మభిక్షం చిత్రపటానికి ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంతో కలిసి సాంబశివరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గీత పనివారల సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షత వహించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.జి.సాయిల్ గౌడ్, అదిలాబాద్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రమావత్ అంజయ నాయక్, ప్రజా సంఘాల నాయకులు ఎం.అనిల్‌కుమార్ (డిహెచ్‌పిఎస్), పుట్ట లక్ష్మణ్ (ఎఐఎస్‌ఎఫ్) మర్రి శ్రీమాన్ (ఎఐవైఎఫ్) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో క్రియాశీల పాత్ర, సైద్ధాంతిక మద్దతు ఇచ్చి కార్యకర్తలను తయారు చేసి యుద్ధరంగంలోకి పంపిన గొప్ప నాయకుడు ధర్మభిక్షమని అన్నారు. నల్లగొండ కేంద్రంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన నాయకుడని అన్నారు. హైదరాబాద్ లోని రెడ్డి హాస్టల్ ప్రేరణతో సూర్యాపేట కేంద్రంగా తెలుగు భాష, విద్య ప్రాథమిక అవసరాన్ని గుర్తించి చాలా మందిని విద్యారంగానికి ఆకర్షించే విధంగా సూర్యాపేట కేంద్రంగా హాస్టల్‌ను నెలకొల్పిన గొప్ప వ్యక్తి అని అన్నారు.

**అన్ని రాజకీయ పార్టీల నాయకుల మన్ననలు పొందిన ధర్మభిక్షం: పల్లా వెంకటరెడ్డి**

బొమ్మగాని ధర్మభిక్షం జాతీయ స్థాయిలో గీత పనివారల సంఘం ఏర్పాటు చేసి గీత కార్మికుల సంక్షేమం కోసం పనిచేశారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాలో కమ్యూనిస్టు నిర్మాణంతోపాటు గీత పనివారల సంఘం నిర్మించారన్నారు. అనేక మందిని చైతన్య పరిచిన గొప్ప సాయుధ పోరాట, స్వాతంత్ర్య సమరయోధులు అని అన్నారు. సూర్యాపేటలో అన్ని రాజకీయ పార్టీల నాయకుల మన్ననలు పొందిన గొప్ప వ్యక్తి ధర్మభిక్షం అన్నారు. ఒక చేతితో విరాళాలు సేకరించి హాస్టల్ నడుపుతూ మరో చేతితో దానం చేస్తుంటే రాజబహదూర్ వెంకట రామారెడ్డి ఆయనకు ధర్మభిక్షం పేరు పెట్టారని గుర్తు చేశారు. ధర్మభిక్షం అజాతశత్రువని పల్లా వెంకటరెడ్డి కొనియాడారు.

**ధర్మభిక్షం ఆశయసాధన కోసం పునరంకితం కావాలి: నెల్లికంటి సత్యం**

రైతులు, కార్మికులు, బడుగుబలహీన వర్గాల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి బొమ్మగాని ధర్మభిక్షం అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. గీత కార్మికుల హక్కుల కోసం సంఘాన్ని నెలకొల్పారని అన్నారు. నల్లగొండ జిల్లాలలో సాగునీటి ప్రాజెక్టుల కోసం, నాగార్జునసాగర్, ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రాజక్టుల కోసం ఉద్యమాలు నిర్వహించిన యోధుడు ధర్మభిక్షం అన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుల కోసం బలమైనవాణిని వినిపించారని, ఆయన ఆశయ సాధన కోసం పునరంకితం కావాలని అన్నారు.



## సూర్యాపేటకు ధర్మభిక్షం జిల్లాగా నామకరణం చేయాలి జగదీష్ రెడ్డి

స్వాతంత్ర సమరయోధు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపి కామ్రేడ్ ధర్మభిక్షం పేరును సూర్యాపేట జిల్లాకు నామకరణం చేయాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎంఎల్‌ఎ గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని ఆయన విగ్రహం వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్‌లు అధ్యక్షతన నిర్వహించిన 14వ వర్ధంతి సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రెండు పర్యాయాలు పార్లమెంట్ సభ్యునిగా, మూడు పర్యాయాలు సూర్యాపేట శాసన సభ్యుడిగా పని చేసిన కామ్రేడ్ ధర్మభిక్షం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలపై రాజీలేని పోరాటం చేశారన్నారు. గీత పనివారుల సంఘాన్ని ఏర్పాటు చేసి కల్లుగీత కార్మికుల హక్కుల సాధనకు ఎనలేని కృషి చేశారని చెప్పారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ మాట్లాడుతూ నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన వీరోచిత పోరాటాల్లో కామ్రేడ్ ధర్మభిక్షం పాత్ర చెరగని ముద్ర అన్నారు. ఆ మహనీయుడు జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు బొమ్మగాని నాగభూషణం, అనంతుల మల్లేశ్వరి, పార్టీ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, నాయకులు దొరేపల్లి శంకర్ బొమ్మగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రక్షాళన చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

పద్ధతులపై ఆధారపడి ఉన్నాం అని పేర్కొన్నారు. అమెరికా ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి ఉద్దేశించిన కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేస్తూ ట్రంప్ భారత్‌తోపాటు బ్రెజిల్‌ను కూడా ఒక ఉదాహరణగా చూపించారు. ఈ రెండు దేశాలు ఓటరు గుర్తింపు కార్డును, ఆధార్ కార్డుతో అనుసంధానం చేస్తున్నాయనీ, అమెరికా దేశం స్వయంప్రతిపత్తిదేశంగా సొంత ప్రభుత్వాన్ని నడుపుకుంటున్నప్పటీ ఇప్పటికీ మౌలికమైన, అత్యవసరమైన ఎన్నికల రక్షణలను అమలు చేయడంలో విఫలమైందని, అభివృద్ధిచెందిన, చెందుతున్న దేశాల తరహాలో మనం చేయలేకపోయామని ట్రంప్ ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. "ఓట్లకు సంబంధించి జర్మనీ,కెనడాలు ఇప్పటికీ పేపర్ బ్యాలెట్ విధానం అమలు చేస్తున్నాయి, స్థానిక అధికారుల ద్వారా బహిరంగ ప్రదేశాల్లో లెక్కిస్తున్నారు, దీనివల్ల అసంఖ్యాక వివాదాలు తగ్గిపోతాయి, అమెరికా వ్యవస్థతో పోల్చి చూస్తే, మన ఓటింగ్ విధానంలో ఎన్నో వివాదాలు చెలరేగుతున్నాయి అని పేర్కొన్నారు. డెన్మార్, స్వీడన్ దేశాలో వ్యక్తులు వ్యక్తిగతంగా వచ్చి ఓటు వేయడానికి అవకాశం లేకపోతే చాలా సింపుల్‌గా మెయిల్ చేయడం ద్వారా ఓటు వేసే పద్ధతి ప్రవేశపెట్టారు, నిర్ణీత తేదీ ప్రకారం ఈ మెయిల్ అందకపోతే ఆ ఓట్లను లెక్కించకుండా పక్కనపెట్టేస్తారు, దీనివల్ల లెక్కింలో ఆలస్యం ఉండదు, ఆలస్యంగా ఓట్లు మనవద్దకు చేరవు, అమెరికాలో ఎన్నికల్లో ఇప్పుడు మెయిల్ ద్వారా సామూహిక ఓటింగ్ జరుగుతోంది, చాలామంది అధికారులు ఓట్లను నిర్ణీత తేదీ ప్రకారం, గడువు ప్రకారం వచ్చాయో లేదో చూడకుండానే లెక్కించేస్తున్నారు, ఎన్నికల మరునాడు వచ్చినాకూడా వాటిని లెక్కిస్తున్నారు" అని తన ఉత్తర్వులో ట్రంప్ వ్యవస్థలో ఉన్న లొసుగులను ప్రస్తావించారు.

భారతదేశంలో ఎన్నికలసంఘం ఓటరుకార్డును, ఆధార్‌కార్డును అనుసంధానం చేసే మార్గాలను, దాని లోటుపాట్లను ముందుగా తెలుసుకునే అన్వేషణలో ఉంది, సరైనా మార్గాలను పరిశీలిస్తోంది. ఓటరు కార్డును, ఆధార్‌కార్డును అనుసంధానం చేయడానికి సంబంధించిన సాంకేతిక పరమైన సంప్రదింపులు త్వరలో ప్రారంభం అవుతాయని భారత ఎన్నికల సంఘం ఈనెల 18వ తేదీన ప్రకటించింది. భారత పౌరులకు మాత్రమే ఓటుహక్కును ఇస్తామని, రాజ్యాంగంలోని 326వ అధికరణ ప్రకారం ఆధార్‌కార్డు ఉండాలని, అది వ్యక్తి గుర్తింపు కాబట్టి దాని ప్రకారం ఓటర్లు కార్డు ఇస్తారని పేర్కొంది.

## సైనిక చర్యలకు స్వస్తి

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా వేరువేరుగా ముమ్మరంగా మధ్యవర్తిత్వ చర్చలు జరిపి ఈ ఒప్పందం కుదిర్చింది. రష్యాతో 12 గంటలపాటు విడతలవారీగా అమెరికా చర్చలు జరిపింది. అణువిద్యుత్ ప్లాంట్లు, జల విద్యుత్ ఆనకట్టలు, చమురు, ఇంధన సౌకర్యాలు, గ్యాస్‌పైపు లైన్లపై దాడులు నివారించడానికి పుతిన్–ట్రంప్ మధ్య కుదిరిగిన ఒప్పందం అమలుకు ఇరువైపులా ఉద్ధృత చర్యలు తీసుకుంటారు. ఒప్పందం కుదిరినట్లు అమెరికా ప్రకటన చేసిన కొద్దింగంటలకు, ఆంక్షలు ఎత్తివేయాలన్న ఒప్పందంపై కాల్పుల విరమణకు అంగీకరించినట్లు రష్యా ప్రకటించగా, రష్యాపై ఆంక్షలు ఎత్తివేస్తే ఉక్రేన్ బలహీన పడుతుందని జెలెన్స్కీ అన్నారు. ఒప్పందం అమలు విషయంపై ఇప్పుడే తాను చెప్పలేననీ, కానీ తాము సరైన దిశలో, శాంతిమార్గంలో వెళుతున్నామనీ జెలెన్స్కీ అన్నారు. నల్లసముద్రంలో ఉక్రేన్‌లో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చేముందుగానే తమపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని రష్యా కోరగా, కాల్పుల విరమణ తక్షణం అమలు చేయడానికి రష్యాపై ఆంక్షలు ఎత్తివేయడానికి సంబంధం లేదని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ అన్నారు. ఐతే రెండు దేశాలు పరస్పరం ఇంధనవనరుల వ్యవస్థలపై దాడులు ఆపేందుకు అంగీకరించాయని అమెరికా పేర్కొంది. ఉక్రేన్‌పై రష్యా దాడులు ప్రారంభించిన తర్వాత యూరప్ దేశాలు రష్యా ఆర్థిక సంస్థలతో లావాదేవీలను నిలిపివేశాయి. రష్యా రోసెల్‌ఖోజ్ వ్యవసాయ బ్యాంకుపై ఆంక్షలు ఎత్తివేయాలని, అంతర్జాతీయ చెల్లింపుల వ్యవస్థను పునరుద్ధరించాలని రష్యా ఈ చర్చల్లో డిమాండ్ చేసింది. వ్యవసాయ, ఎరువుల ఎగుమతులను రష్యా నుండి ప్రపంచానికి తిరిగి అందుబాటులోకి తెచ్చేందుకు, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను పునరుద్ధరించేందుకు రష్యాతో కలిసి కృషి చేసేందుకు చర్చల్లో అమెరికా అంగీకరించిందని టాస్ వార్తాసంస్థ పేర్కొంది. ఐతే ఈ ఒప్పందాలు అమలు కావాలంటే యూరోపియన్‌యూనియన్ దేశాల ఆమోదం అవసరం ఉంది. ఉక్రేన్ నుండి రష్యా బలగాలను పూర్తిగా వెనక్కుమళ్ళిస్తేనే రష్యాపై ఉన్న ఆంక్షల ఎత్తివేత, సవరణలకు అవకాశం ఉంటుందని యూరోపియన్ కమిషన్ అధికార ప్రతినిధి చెప్పారు.

**యుద్ధంలో రష్యా మహిళా సైనిక జర్నలిస్టు మృతి**

బెల్గరోడ్ సరిహద్దుల్లోని యుద్ధ ప్రాంతంలో విధినిర్విహణలో ఉన్న రష్యా మహిళా సైనిక జర్నలిస్టు ప్రోకోఫియేవా మందుపాతర పేలి మరణించారు. ఆమె వయసు35 సంవత్సరాలు. యుద్ధరంగంలో ఆమె 2023 నుండీ పనిచేస్తున్నారు. ఆమెతో పాటు ఉన్న కెమేరామెన్ డిమిత్రి వోల్కోవ్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిద్దరు "ఛానల్ –1" తరపున యుద్ధంలో పాత్రికేయ విధులు నిర్వహిస్తున్నారు. జర్నలిజంలో రష్యన్ యూనివర్సిటీ పట్టభద్రురాలైన ప్రోకోఫియా స్పానిష్‌భాషా నిపుణురాలు. మహిళా సైనిక జర్నలిస్టు ప్రోకోఫియేవా మరణంపై రష్యావిదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా తీవ్రంగా స్పందించారు. ఉక్రేన్ ప్రభుత్వం యుద్ధంలో రష్యా జర్నలిస్టులను కూడా లక్ష్యంగా చేసుకుందని, వారికి రక్షణ కల్పించాలని అన్నారు. యుద్ధంలో జర్నలిస్టులకు ఉన్న న్యాయపరమైన నిబంధనలను ఉక్రేన్ విస్మరించి తక్కువచేసి చూస్తోందని విమర్శించారు. అంతకుముందు సోమవారంనాడు కూడా ఉక్రేన్ సైన్యం చేసిన దాడిలో రష్యా జర్నలిస్టులు మరణించారు. ఇజ్వెస్తియా కరస్పాండెంట్ అలెగ్జాండర్ ఫెడోర్‌చాక్, జ్వెజ్దా టీవీ కెమెరామెన్ ఆండ్రీపనోవ్, డ్రైవర్ అలెగ్జాండర్ సిర్కెలీ మరణించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com